21-02Pg1exHMNWJQE.qxd:21-02Pg1exHMNWJQE.qxd 01/01/01 9:48 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు f: fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-2-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 20 పేజీలు: 12 వెల: 6.50

మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు

శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

9లో

# మిర్చి రైతులను ఆదుకుంటాం



గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్‌చౌహాన్‌తో వర్చువల్‌గా మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### కేంద్ర మంత్రితో సాయం కోసం మాట్లాడా..

### అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంవల్లే ధరల పతనం

### పోలవరం నీరు బనకచర్లదాకా తీసుకెళ్లేందుకు కేంద్ర సాయం అడిగా..

### ఢిల్లీలో మీడియాతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త ప్రతినిధి:** మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారిని ఆదుకుంటామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. మిర్చి ధర పతనంపై కేంద్రంతో మాట్లాడామన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి రేట్లు పడిపోయాయి. గతంలో అంతర్జాతీయ మార్కెట్ బాగుండటంతో రైతులకు మంచి ధరవచ్చిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయాయి. మిర్చి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.. కేంద్రమంత్రి పర్యటనలో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సమస్యలను వివరించామన్నారు. శుక్రవారం అధికారులతో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మిర్చి ధరల అంశంపై సమీక్షిస్తారు. అని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరామన్నారు.ఈ యేడాది 12 లక్షల మెట్రిక్ టన్నులు మిర్చి సేకరించాల్సి ఉంది...ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చింది. దాదాపు 5 లక్షల ఎకరాల్లో ఈ యేడాది రాష్ట్రంలో మిర్చి సాగైంది. ఎప్పుడూ లేనంతగా రేట్లు పడిపోయాయి. ఎట్టి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరాం. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 25 శాతం మాత్రమే ఇస్తారు. సాగు ఖర్చులను లెక్కలు వేసి ధరలు నిర్ణయించాలి. అవన్నీ సరిచేయాలని కేంద్రమంత్రిని కోరాం. దీనిపై సమీక్షా సమావేశంలో చర్చించిన తర్వాత స్పష్టత ఇస్తామని కేంద్రమంత్రి చెప్పారు. ఏ విధంగానైనా రైతులను ఆదుకోవడం ముఖ్య ఉద్దేశం. శనివారం వ్యాపారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడి ధరల పతనానికి కారణాలు >>2



గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తాచేత ప్రమాణం చేయిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

### రామ్‌లాలా మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన ప్రమాణ స్వీకారం

### డి.సిఎంగా పర్వేష్‌సింగ్ వర్మ, మరో ఐదుగురు మంత్రులు ప్రమాణం

### హాజరైన ప్రధాని మోడీ, పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయె సిఎంలు, ఎపి సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

### మంత్రులకు వెంటనే శాఖల కేటాయింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** రెండున్నరదశాబ్దాలు దాటిన తర్వాత దేశరాజధాని ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలామైదాన్‌లో జరిగిన భారీ సభలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణ స్వీకారంచేసారు. లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షా, పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయేపాలిత రాష్ట్రాల ముఖ్య >>2

## ఎపి ఫైబర్‌నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై వేటు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఫైబర్‌నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై వేటు పడింది. ఫైబర్‌నెట్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ భరద్వాజ, ఫైబర్‌నెట్ బిజినెస్ హెడ్ సురేశ్, ప్రొక్యూర్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్ ఖాన్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివి రెడ్డి ఆదేశాలిచ్చారు. గత 9 నెలలుగా ఫైబర్‌నెట్‌లో కనీస పురోగతి లేదని ఒక్క రూపాయి ఆదాయం కూడా తీసుకురాలేకపోయామని జివి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఎపి ఎస్‌ఎఫ్‌ఎల్‌లో సంస్కరణలు చేస్తున్నా అధికారులు సహకరించడం లేదని అందుకే ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు ఛైర్మన్ స్పష్టం చేశారు. సంస్థలో 400 మందిని తొలగించాలని ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోలేదని జివి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల తొలగింపు ఆదేశాలపై ఫైబర్‌నెట్ ఎండి, ఇడి సంతకాలు చేయలేదని, ఉద్యోగులకు జీతాల రూపంలో సంస్థ సొమ్ము చెల్లించారని మండిపడ్డారు. ఫైబర్‌నెట్‌లోని ఉన్నతాధికారులు గత ప్రభుత్వంతో చేతులు కలిపారని అన్నారు. ఫైబర్‌నెట్‌కు జిఎస్టీ అధికారులు రూ.377 కోట్లు జరిమానా విధించారని, కానీ అధికారులు తనకు చెప్పలేదని తెలిపారు. ఈ 9 నెలల్లో ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయామని, >>2

# ఇక వడివడిగా పోలవరం

### పూర్తి సాయం అందించడానికి కేంద్రం అంగీకారం

### కుడి, ఎడమ కాల్వల నిర్మాణ ఖర్చు రీయింబర్స్‌మెంట్ అడిగాం

### కేంద్ర జలశక్తిమంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశమైన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్



గురువారం కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ భేటీ దృశ్యం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరిస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ స్పష్టం చేసారని సిఎం చంద్రబాబు తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో కలిసి కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు ఢిల్లీలో సమావేశమయ్యారు. సమావేశం మంచిగా జరిగిందని సిఎం చంద్రబాబు మీడియాకు వెల్లడించారు. పోలవరం ఎడమ, కుడి కాలువల నిర్మాణానికి చేసిన ఖర్చును రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని విన్నవించినట్లు తెలిపారు. డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు కూడా ఇప్పటికే రెండు కట్టర్లతో మొదలయ్యాయని తెలిపారు. మార్చి నుండి మూడో కట్టర్‌తో పనులు చేపడతామని వెల్లడించారు. డయాఫ్రం వాల్ నిర్మాణానికి సమాంతరంగా ఇసిఆర్‌ఎఫ్ డ్యాం పనులు మొదలు పెట్టేలా, అవసరమైన డిజైన్స్, సిడబ్ల్యూసి నుంచి త్వరగా వచ్చేలా సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు త్వరలో పోలవరం సందర్శనకు వస్తానని సిఆర్ పాటిల్ తెలిపారు. గోదావరినుంచి 200 టిఎంసిల వరద నీటిని బనకచెర్లకు తరలించే లక్ష్యంతో చేపట్టిన పోలవరం బనకచెర్ల లింక్ ప్రాజెక్టుకు మద్దతు కోరినట్లువెల్లడించారు. ఈప్రాజెక్ట్ రాష్ట్రాన్ని కరవు రహితంగా మారుస్తుందని తెలిపారు. 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. పరిశ్రమలకు 20 టిఎంసిల >>2

# 24 నుంచి అసెంబ్లీ

### 28నే బడ్జెట్ సమర్పణ

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభమవుతోన్నాయి. ఆ క్రమంలో మార్చి 4వ తేదీన రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నట్లు తొలుత సమాచారం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ షెడ్యూల్‌ను కాస్తా ముందుకు జరిపారు. ఫిబ్రవరి 28వ తేదీన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. ఇక ఈ బడ్జెట్ సమావేశాల ప్రారంభమవుతోన్న నేపథ్యంలో ఆ రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రసంగించనున్నారు.

అలాగే 25వతేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేతీర్మానంపై చర్చ ప్రారంభం కానుంది. అదేరోజు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సిఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. ఇక అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24వ తేదీనుంచి ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే బడ్జెట్ అంశాలు నిధులకేటాయింపుపై సిఎం చంద్రబాబు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖతో సహా వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు.

## గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

2లో

# వెలిగొండ పూర్తికి మరో రెండేళ్లు!

### ప్రాజెక్టుకు మరో రూ. 4వేల కోట్లు అవసరం: మంత్రి నిమ్మల

**విజయవాడ,, ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** వెలిగొండ ప్రాజక్టు పనులను పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనత గత ప్రభుత్వానిదని, ఆ ప్రాజక్టు పూర్తి కావాలంటే దాదాపు రూ.4 వేల కోట్ల నిధులతో పాటు 2 ఏళ్ల సమయం పడుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, 25 లక్షల మందికి త్రాగు నీరు అందజేసే వెలిగొండ ప్రాజక్టు ప్రధాన పనులు ఏవీ పూర్తి చేయకుండా రైతులను గృహనిర్బంధం చేసి పటిష్టమైన బందోబస్తు మధ్య ఆ ప్రాజక్టును జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. శ్రీశైలం వద్ద నున్న హెడ్ రెగ్యులేటరీ, రిటైనింగ్ వాల్ పనులు, మొదటి, రెండవ సొరంగం పనులను, ఫీడర్ కెనాల్ పనులను మరియు నిర్వాశితుల కాలనీల నిర్మాణ పనులను ఏ మాత్రం పూర్తి చేయకుండా వెలిగొండ ప్రాజక్టును జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. సొరంగం1 లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర రోడ్డును మరియు సొరంగం2 లో 2.00 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టిని తొలగించాల్సి ఉందని, అందుకు దాదాపు తొమ్మిది మాసాలు పడుతుందన్నారు. సొరంగం 2లో ఇంకా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ చేయాల్సిన పనులుఉన్నాయని అందుకు దాదాపు ఎనిమిది మాసాలు >>2

# గ్రూప్-2 పరీక్షలకు భారీ ఏర్పాట్లు



గురువారం ఎపిపిఎస్సి గ్రూపు2 మెయిన్ రాత పరీక్షలపై సమీక్షిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్

### 23న పరీక్షల నిర్వహణపై కట్టు కథలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు : సిఎస్ విజయానంద్

**విజయవాడ, ఫిబ్రవరి20.ప్రభాతవార్తప్రతినిధి:** ఈనెల 23వతేదీన నిర్వహించనున్న ఎపిపిఎస్సి గ్రూపు2 మెయిన్ రాత పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఎపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధతో కలసి ఆయన అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారంలేకుండా అన్ని పరీక్షాకేంద్రాలవద్ద కట్టుదిట్టమైన బందోబస్తుతో పాటు ఇతర ఏర్పాట్లను చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు.13 పాత జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే మార్గదర్శకాలను జిల్లాలకు పంపడం జరిగిందని వాటిని పూర్తిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు 92వేల 250 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పరీక్షలు సజావుగా జరిగేందుకు వీలుగా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ముఖ్యంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి సోషల్ మీడియాలో ఎక్కడైనా ఎవరైనా వదంతులు లేదా నకిలీ వార్తలు ప్రసారం చేసినా లేదా సర్కులేట్ చేసినా వెంటనే విచారణ చేసి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లు, ఎస్పిలకు స్పష్టం చేశారు.

ఇదే సమయంలో ఎవరైనా నకిలీ వార్తలు ప్రసారం లేదా వదంతులు సృష్టించినా అభ్యర్థులు వారి తల్లిదండ్రులు ఎవిధమైన ఆందోళన చెందవద్దని ఆయన హితవు చేశారు. పరీక్షలు సజావుగా సక్రమంగా జరిగేందుకు వీలుగా ఇప్పటికే అన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు.సెన్సిటివ్ పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన ప్రాంతాల్లో మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లు,ఎస్పిలు,ఎపిపిఎస్సి అధికారులను ఆదేశించారు. ముందుగా ఎపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధ గ్రూపు2 మెయిన్ పరీక్షల ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ పాత 13 జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా >>2

## వల్లభనేనికి హైకోర్టులో చుక్కెదురు



**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడికేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వంశీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇటీవల వంశీ దళిత యువకుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్, దాడి చేసిన కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్నాడు.

వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ న్యాయస్థానం ఉత్తర్వ్యులుజారీచేసింది. గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసులో వంశీ నింది తుడిగా ఉన్నాడు. ఈ కేసులో తనకు >>2

# రైల్వే పరీక్షల్లో భారీ అవినీతి!

### పలువురు అధికారుల అరెస్టు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** పశ్చిమ రైల్వే జోన్‌లో పదోన్నతులకు సంబంధించిన కేసులో రైల్వే అధికారులు సహా ఆరుగురిని అరెస్టు చేసినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వెల్లడించింది. పశ్చిమ రైల్వే జోన్‌లో లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ (ఎల్‌డిసిఇ) పరీక్షల్లో అభ్యర్థులకు అనుకూలంగా ఉండేందుకు భారీగా లంచం వసూలు చేశారన్న ఆరోపణలు, అభియోగాలపై పశ్చిమ రైల్వే, వడోదరలోని డిఆర్‌ఎం కార్యాలయంలో ఇద్దరు ఐఆర్‌పిఎస్ అధికారులతో పాటు మరికొందరితో కూడిన లంచం నెట్‌వర్క్ (రాకెట్)ను సిబిఐ అదుపులోకి తీసుకొని విచారిస్తోంది. ఈ కేసులో పశ్చిమ రైల్వే జోన్‌లోని వడోదరలో పనిచేస్తున్న 2008, 2018 ఐఆర్‌పిఎస్ బ్యాచ్‌కు చెందిన ఇద్దరు అధికారులతో సహా ఆరుగురు >>2

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు..

### ఎపి ఇఆర్‌సి ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ చార్జీలు పెంపులేదని ఎపిఇఆర్‌సి ఛైర్మెన్ ఠాకూర్ రామ్ సింగ్ ప్రకటించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల టారిఫ్‌లను ఏపి విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ విడుదల చేసారు. ఎపిఇఆర్‌సి మూడు డిస్కమ్‌ల కోసం రూ.57,544,17 కోట్ల రుపాయాల ఎఆర్‌ఆర్‌ని అమోదించగా, ఇది డిస్కమ్‌ల ఫైలింగ్‌ల కంటే రూ.1.324.35 కోట్లు తక్కువ అన్నారు. >>2




విద్యుత్ చార్జీల టారిఫ్‌లను విడుదల చేస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ ఠాకూర్ రామ్ సింగ్

21-02pg2exHMNWJQE.qxd:21-02pg2exHMNWJQE.qxd 01/01/01 10:15 AM Page 1





గురువారం న్యూఢిల్లీలో జరిగిన సిఎం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధాని మోడీతో డి.సిఎం పవన్

# హిమాలయాలకు వెళ్తున్నారా?

## డిప్యూటీ సిఎం పవన్‌ను చూసి చమత్కరించిన ప్రధాని మోడీ

### ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అందరినీ ఆకట్టుకొన్న పవన్ ఆహార్యం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ సిఎం రేఖ గుప్తా పదవీ స్వీకార కార్యక్రమంలో ఏపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని నరేంద్రమోడీ చతుర సంభాషణ సాగించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోడీ ఒక్కొక్క ప్రముఖున్ని పలుకరిస్తూ, కరచాలనం చేస్తూ పవన్ కల్యాణ్ కనిపించగానే ఒక్కనిమిషం పాటు అలా ఆగిపోయారు. పవన్ వస్త్రధారణ చూసిన మోడీ నవ్వుతూ హిమాలయాలకు వెళ్లామనుకుంటున్నారా! అంటూ చమత్కరించారు. మోడీ మాటలకు పడిపడి నవ్విన పవన్ కళ్యాణ్ అలా ఏమీ లేదంటూ సమాధానమిచ్చారు. వెంటనే నీ ముందు చాలా బాధ్యతలు ఉన్నాయి.. వాటిని చూసుకో అంటూ మోడీ పవన్ కళ్యాణ్ వీపుపై చేయి వేసి పలకరించారు. మోడీ మాటలకు పవన్ కళ్యాణ్ వెనుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సైతం నవ్వుతూ కనిపించారు. వేదికపై ఉన్నవారందరికీ నమస్కరిస్తూ ముందుకుసాగిన మోడీ పవన్ వద్ద కొద్దిసేపు ఆగి.. ప్రత్యేకంగా మాట్లాడటంపై రాజకీయంగా పలు భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పవన్‌పై మోడీ మరోసారి తన అభిమానాన్ని చూపించారంటూ జనసైనికులు కామెంట్స్ చేస్తున్నారు. ప్రత్యేకంగా పవన్‌వేదికపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన వస్త్రధారణ చూసి పిఎం మోడీ సైతం ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన పోరాడుతుందని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా హిందూ ఆలయాల పరిరక్షణ కోసం ప్రత్యేక సనాతన బోర్డు ఏర్పాటుచేయాలనే డిమాండ్‌ను పవన్ వినిపిస్తున్నారు. దీంతో పవన్ కల్యాణ్ పేరు దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

# రైతులను ఆదుకుంటాం

>> తెలుసుకుంటానని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్రానికి 3 సార్లు లేఖలు రాశాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అధికారులు వచ్చి కేంద్ర అధికారులతో మాట్లాడారు. మా ప్రధాన ఉద్దేశం మిర్చి రైతులను ఆదుకోవాలని కోరడానికి ఢిల్లీకి వచ్చాం. రైతులు నష్టపోకుండా ఏం చేయాలో చేస్తాం. రైతులను పట్టించుకోని వారు మాట్లాడుతున్నారు. పంటలకు సంబంధించి ధరలు ఒక్కోసారి తగ్గుతాయి.. ఒక్కోసారి పెరుగుతాయన్నారు. రైతుకు గిట్టుబాటు ధరలేనప్పుడు ప్రభుత్వం వారికి కచ్చితంగా అండగా నిలుస్తోందన్నారు. రైతులకు గతంలో ఏమీ చేయలేని వారు ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారు. 2019కి ముందు ధరలు తగ్గితే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.138 కోట్లు విడుదల చేసి మిర్చి రైతులను ఆదుకున్నాం. మళ్లీ డబ్బులివ్వబోయేది ఎన్డీయేనే. బాధ్యత లేకుండా మిర్చి యార్డులోకి వెళ్లారు. ఎన్నికల కోడ్ అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుంది. కానీ పోటీలో మేం లేం కాబట్టి మాకు వర్తించదని చెప్తున్నారు. ఎన్నికల కమిషన్ వెళ్లొద్దని చెప్పినా వినకుండా వెళ్లారు. ఇల్లీగల్ పనులు చేసి సెక్యూరిటీ కావాలని అడిగారు. మీరు చేసే ఇల్లీగల్ పనులకు పోలీసులు రక్షణ ఇవ్వాలా? నేరాలు చేస్తుంటే మీ వెనక పోలీసులు రావాలా? జల్ జీవన్, పోలవరంపై జలశక్తి శాఖమంత్రి సిఆర్ పాటిల్‌ను కూడా కలిసాను. జల్ జీవన్ మిషన్, పోలవరంపై ఆయనతో చర్చించాం. పోలవరం పనులు సజావుగా సాగుతున్నాయి. 2027 నాటికి పూర్తి చేయాలని ఆయనతో చెప్పాం. నదుల అనుసంధానంపైనా చర్చించాం. సముద్రంలోకి వృధాగా వెళ్లే నీరు ఉపయోగించుకుంటే రాష్ట్రంలో కరవు లేకుండా ఉంటుంది. పోలవరం నుంచి బనకచర్ల నీళ్లు తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం కోరాం. దీనిపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రతినిధులు కూడా రాష్ట్రానికి వస్తారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి నీటిని అందించాలన్నది లక్ష్యం, కానీ గత ప్రభుత్వం ఈ పథకాన్ని ఒక్కశాతం కూడా ఉపయోగించుకోలేదు. రాష్ట్రానికి రూ. 27 వేల కోట్లను కేంద్రం మంజూరు చేసింది. పైపులైన్ల ద్వారా కాకుండా బోరు బావుల ద్వారా ఇస్తామని చెప్పారు. కేంద్రం ఇచ్చిన రూ.50 వేల కోట్ల నిధులను యూజ్ ఖర్చు చేసింది. గుజరాత్‌లో ఇంటింటికీ కుళాయి ద్వారా నిరంతరం నీళ్లు ఇస్తున్నారు. కేంద్రం ఈ పథకాన్ని మళ్లీ నిబంధనల మార్పు 2028కి పనులు పూర్తి చేయాలని సమయం పెంచింది. దీని ప్రకారం గతంలో కేటాయించిన రూ.27 వేల కోట్లు మాత్రమే వస్తాయి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కుళాయి ద్వారా నీరివ్వాలంటే అదనంగా రూ.54 వేల కోట్లు అవసరం. దీనిపై కూడా కేంద్రంతో మళ్లీ సంప్రదిస్తాం. ప్రస్తుతం రూ.27 వేల కోట్లకు డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రాన్ని నిధులు కోరుతాం. తప్పుడు విధానాలతో ప్రజలకు నష్టంగత ప్రభుత్వం అవలంబించిన తప్పుడు విధానాల వల్ల ప్రజలు ఏ విధంగా నష్టపోతారో ఈ జల్ జీవన్ మిషన్ ఒక ఉదాహరణ. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేశారు. వాటిల్లో కొన్ని పథకాలకు మేము పక్కాగ మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించి నిధులు ఖర్చు చేసి యూసీలు ఇచ్చాం. కేంద్రం ఇచ్చే పథకాలు ఉపయోగించుకుంటే రాష్ట్రానికి ఎంతో మంచి జరుగుతుంది. కానీ గత ప్రభుత్వం చేతగాని పాలన వల్ల సమస్యలు వచ్చి పడ్డాయి... వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నాం. సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటున్నవయలు ప్రపంచంలో వరుసలో మాకుంటుంది ఏపి బిట్టబివర ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో నేను 9 ఏళ్లు సిఎంగా ఉన్నప్పుడు అనేక ప్రాజెక్టులు పూర్తి చేసి తెలంగాణాకు నీళ్లందించాం. ఇప్పుడు సముద్రంలోకి వెళ్లే నీరు ఉపయోగించుకోవాలని చూస్తున్నాం. వృధాగా సముద్రంలోకి పోయే నీటిని ఏపి ఉపయోగించుకునే అవకాశం ఉంది. వాటికి వాదులుకుంటున్నాం. రాజకీయం అంటే ప్రజా సమస్యల కోసం పని చేయాలి రాజకీయం అవుతుంది. ఎపిలో ఎన్డీయే చిత్తశుద్ధితో పని చేస్తోంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇక కేంద్రమంత్రులు కింజరపు రామ్మోహననాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు సిఎం చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి శివరాజ్‌చౌహాన్‌తో మిర్చి ధరలపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అంతకు ముందు సిఎం చంద్రబాబు ఢిల్లీ సిఎం రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని ఆమె అభినందించారు. జ్ఞాపికను అందజేసారు.



గురువారం ఢిల్లీ సిఎంగా ప్రమాణం చేసిన రేఖా గుప్తాకు జ్ఞాపికను అందించి అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

# వడివడిగా పోలవరం

>> నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా కేటాయించవచ్చని సిఎం చంద్రబాబు తెలిపారు. స్వయంగా మూడు సార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించి వర్క్ షెడ్యూల్ విడుదల చేశామని చంద్రబాబు అన్నారు. 2025 డిసెంబర్ నాటికి డయా ఫ్రాంవాల్ నిర్మాణం, 2027 డిసెంబర్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు, ఏజెన్సీలతో సమీక్షిస్తున్నామని సిఎం చంద్రబాబు కేంద్రమంత్రికి తెలిపారు. పోలవరం ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సైతం పోలవరం ప్రాజెక్టు పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని సిఆర్ పాటిల్ తెలిపారన్నారు. కేంద్రమంత్రి పాటిల్‌తో భేటీ సందర్భంగా ఆయనను సిఎం చంద్రబాబు,డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఘనంగా సత్కరించి,జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు పాల్గొన్నారు. ఈ భేటీ అనంతరం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు ఈ కార్యక్రమం అనంతరం ఎన్డీఏ నేతలకు బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా విందులో చంద్రబాబు నాయుడు,పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

>> మంత్రులు, బిజెపినేతలు హాజరయ్యారు. ఎపినుంచి సిఎం చంద్రబాబు, డిప్యూటిసిఎం పవన్‌కల్యాణ్‌లతోపాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా పాల్గొన్నారు. ఉదయం ఇంటినుంచి బయలుదేరిన రేఖాగుప్తా హనుమాన్ ఆలయంలో పూజలుచేసారు తర్వాత ఆమె రామ్‌లీలామైదానానికి చేరుకుని అందరినీ పలకరించారు. సుమారు 25వేలమంది భద్రతాసిబ్బంది బందోబస్తుతో ఉన్న రామ్‌లీలామైదాన్‌లో ఆమె ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసారు. సుమారు 50వేలమందికిపైగా హాజరయిన అభిమానులు, బిజెపి కేడర్‌లమధ్య గుప్తా సిఎంగాను, పర్వేష్‌సింగ్ వర్మ డిప్యూటి సిఎంగాను ప్రమాణాలుచేసారు. రేఖాతోపాటు బిజెపి ఎమ్మెల్యేలు పర్వేశ్‌వర్మ, ఆశీస్‌సూద్, మజీందర్‌సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్‌సింగ్, కపిల్‌మిశ్రా, పంకజ్‌కుమార్‌లు మంత్రులుగా ప్రమాణంచేసారు. కొత్త సిఎంకు జడ్‌కేటగిరీ సెక్యూరిటీని కేటాయించారు. ఇదిలా ఉండగా ప్రమాణ స్వీకారంచేసిన తర్వాత రేఖాగుప్తా మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామన్నారు. మార్చి 8వ తేదీన రూ.2500 నగదును వారి ఖాతాల్లోకి బదలాయిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని అన్నారు. ప్రధానిమోడీ కలలను సాకారంచేయడం అనేది ఢిల్లీలోని 48 మంది బిజెపి ఎమ్మెల్యేల బాధ్యత అని అన్నారు. మహిళలకు ఆర్థికంగా సాయం అందించే హామీలన్నీ మేం ఖచ్చితంగా నెరవేరుస్తామని, మార్చి 8 నాటికి సొమ్ములు వారి ఖాతాల్లో ఉంటాయని అన్నారు. ఇదిలా ఉంటే ప్రమాణ స్వీకారంచేసిన తర్వాత మధ్యాహ్నం 3 గంటలప్రాంతంలో కేంద్ర మంత్రి జెపినడ్డాతో కలిసి సిఎం రేఖాగుప్తా ఢిల్లీ సచివాలయానికి చేరారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఎమ్మెల్యేలు ఎంపిలు అధికారులు ఘనస్వాగతం పలికారు. సిఎం ఛాంబర్‌లోకి వెళ్లిన రేఖాగుప్తా ముఖ్యమంత్రిగా బాధ్యతలుచేపట్టారు. ఢిల్లీకి నాలుగో మహిళా సిఎంగాను, రెండో బిజెపి మహిళా ముఖ్యమంత్రిగా ఆమె రికార్డు నెలకొల్పారు. సాయంత్రం ఐదు గంటలకు వాసుదేవ్‌ఘాట్, యమునా బజార్‌ను సిఎం సందర్శించారు. తన మొదటి కేబినెట్ సమావేశం ఢిల్లీలోని సచివాలయంలోనే నిర్వహిస్తారు. ఈమేరకు అధికారులు సిఎం షెడ్యూలును సైతం విడుదలచేసారు.

# వెలిగొండ పూర్తికి మరో రెండేళ్లు!

>> పడుతుందన్నారు. అదే విధంగా సొరంగం2లో 6.8 కి.మి. మేర లైనింగ్ పనులు ఉన్నాయని, భారీ టన్నెల్ బోరింగ్ మిషన్ కూడా ఉందని, దాన్ని తొలగించేందుకు చాలా సమయం పడుతుందన్నారు. 21.8 కి.మి. మేర ఫీడర్ కెనాల్ పనులను కూడా నిర్వహించాల్సి ఉందన్నారు. ఇన్ని పనులు పెండింగ్‌లో ఉంటే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. అదే విధంగా ఈ ప్రాజెక్టు విషయంలో తమ ప్రభుత్వంపై బురద జల్లే విధంగా ప్రతి పక్షపార్టీ నాయకులు మాట్లాడం వింతగా ఉందన్నారు. 1996 సంవత్సరంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ ప్రాజెక్టుకు భూమి పూజచేసి, 2014 లో రూ.1,373 కోట్లను కేటాయించి అందులో 96 శాతం నిధులు అంటే రూ.1,319 కోట్లను వెచ్చించి 30 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో బడ్జెట్ రూ.3,518 కోట్లు కేటాయిస్తున్నట్లు చూపించినప్పటికీ అందులో కేవలం 18 శాతం నిధులు అంటే రూ.647 కోట్లను మాత్రమే వెచ్చించడం జరిగిందన్నారు.

పూర్తికాని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన ఘనుడు జగన్ అన్నారు. అబద్ధాలు చెప్పడం, అభూత కల్పనలు చేయడం, పూర్తికాని ప్రాజెక్టులను ప్రారంభించడంలో జగన్ అంతర్జాతీయ ఖ్యాతి గడించారని నిమ్మల రామా నాయుడు ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఇప్పటివరకు ఏడు వింతలు మాత్రమే ప్రజలకు తెలుసు అని ఎనిమిదో వింత జగన్ రూపంలో చూస్తున్నారని ఆయన అన్నారు.

# చుక్కెదురు

>> ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఇటీవల తీర్పు రిజర్వు చేసింది. నేడు పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చింది. వల్లభనేని వంశీ ఆదేశాల మేరకే గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి జరిగిందని ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. వాహనాలు దగ్ధం చేసి భయభ్రాంతులకు గురి చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అప్పట్లో అరెస్ట్ చేయలేదని తెలిపారు. వైఎస్సార్సీ అధికారంలో ఈ కేసు దర్యాప్తును నీరుకార్చారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ముందస్తు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని తెలిపారు. పిటిషనర్‌పై రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారని పిటిషనర్‌కు, దాడికి ఎటువంటి సంబంధం లేదని వంశీ తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న తరువాత వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది.

# ఉన్నతాధికారులపై వేటు

>> ఇంటర్నెట్ వ్యవస్థలో నిత్యం సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఫైబర్‌నెట్ అధికారులు ఎలా పని చేస్తున్నారనేందుకు ఇవన్నీ నిదర్శనమని జివి రెడ్డి అన్నారు. ఫైబర్‌నెట్ ఎండి దినేష్‌కుమార్ ఆగస్టులో వచ్చినా ఒక్కరోజు కూడా సమీక్షించలేదని, ఒక్క ఆపరేటర్‌ను కూడా కలవడం లేదని జివి రెడ్డి వివరించారు. ఫైబర్‌నెట్‌ను చంపేయాలని దినేష్‌కుమార్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఉన్నట్లే దినేష్‌కుమార్ పని చేస్తున్నారని అన్నారు. ఈయన కనీసం టార్గెట్లు పెట్టడం లేదని, అలాగే ఆదాయం పెంచేందుకు కూడా ప్రయత్నించడం లేదని వెల్లడించారు. కానీ సిబ్బందికి అక్రమంగా 3 నెలలు జీతాలు చెల్లించారని వివరించారు. ఆ జీతాల మొత్తాన్ని ఎండి దినేష్, ఉన్నతాధికారుల నుంచి వసూలు చేయాలని అన్నారు.

# రైల్వే పరీక్షల్లో భారీ అవినీతి!

>> నింధితులను అరెస్టు చేసింది. పశ్చిమ రైల్వే జోన్‌లో లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో పదిమంది అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించేందుకు భారీగా లంచం వసూలు చేసిన ఆరోపణలకు సంబంధించిన కేసులో ముంబై చర్చ్ గేట్ డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్, డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్, అహ్మదాబాద్‌లోని సబర్మతి డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌తో పాటు మరో ప్రైవేటు వ్యక్తిని సిబిఐ అరెస్టు చేసింది.

ఈ సందర్భంగా నింధతుల నివాసాలు, అధికారిక ప్రాంతాల్లో 11చోట్ల నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో లంచం తీసుకున్న రైల్వే ఉద్యోగులు నుండి రూ.57లక్షలు విలువ చేసే 650గ్రాముల బంగారం, బంగారు ఆభరణాలు, సుమారు రూ.5లక్షల నగదు, ఎలక్ట్రానిక్ యాంత్రిక పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ తెలిపింది. అరెస్ట్ చేసిన నింధితులను అహ్మదాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుచనున్నట్లు విచారణ కొనసాగుతుందని సిబిఐ తన ప్రకటనలో తెలిపింది.

# మార్చి 1 నుండి 20 వరకు ఇంటర్ పరీక్షలు

**విజయవాడ, ఫిబ్రవరి20.ప్రభాతవార్తప్రతినిధి:** మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగన్నాయి. మార్చి 1నుండి 19 వరకూ ప్రథమ సంవత్సర పరీక్షలు,3 నుండి 20 వరకూ ద్వితీయ సంవత్సర పరీక్షలు రోజూ ఉదయం 9గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకూ జరగనుండగా 26 జిల్లాల్లో 1535 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 10 లక్షల 58వేల 892 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటికి సంబంధించిన ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 3 నుండి 15వ తేదీ వరకూ జరగనుండగా 325 కేంద్రాల్లో ఈపరీక్షలకు మొత్తం 67వేల 952 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. ఈపరీక్షల ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలలు పరీక్షలమాసాలని కావున ఆయాపరీక్షలు సజావుగా సాగేందుకు తగిన విస్తృత ఏర్పాట్లు చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ఈపరీక్షలకు సంబంధించి 1535 కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 68 కేంద్రాలను సెన్సిటివ్,36 కేంద్రాలు వల్నరబుల్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని అక్కడ గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు,ప్రథమ చికిత్స ఏర్పాట్లు, విద్యుత్, బెంచ్‌లు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పరీక్షా కేంద్రాలకు 100మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు జారీ చేయాలనిఆదేశించారు. పరీక్షాకేంద్రాల పరిధిలో పరీక్షలసమయంలో జిరాక్సు కేంద్రాలు, నెట్ కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.

# బంగ్లాపై భారత్ విజయం

## ఆరువికెట్ల తేడాతో బంగ్లాజట్టు ఓటమి

**దుబాయ్, ఫిబ్రవరి 20:** ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీలో భారత్‌బోణి కొట్టింది. దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తోజరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన బంగ్లా 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 231 పరుగులుచేసి విజయం సాధించింది. భారత ఓపెనర్ శుభ్‌మన్‌గిల్ 101 పరుగులుచేసి సెంచరీ వీరుడుగా నిలిచాడు. ఇంగ్లండ్‌పై సెంచరీ సాధించి దూకుడుపై ఉన్న కెప్టెన్ రోహిత్‌శర్మ 41పరుగులుచేసాడు. తొలి వికెట్‌కు ఓపెనర్ గిల్‌తోకలిసి పది ఓవర్లలోపే 69 పరుగులు జోడించాడు. రోహిత్ ఔట్ అయ్యా క్రీజులోకి వచ్చిన విరాట్ ఆచితూచి ఆడుతూ 22 పరుగులుచేసాడు. స్పిన్నర్ రిషద్ బౌలింగ్‌లోనే కోహ్లీ వికెట్ పడిపోయింది, శ్రేయస్ అయ్యర్ 15పరుగులేచేసి నిరాశపరిచాడు. అక్షర్‌పటేల్ 8 పరుగులుమాత్రమేచేసి నిరాశకు గురిచేసాడు. వికెట్లు పడుతున్నా ఏకాగ్రతకోల్పోకుండా శుభ్‌మన్‌గిల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెఎల్‌రాహుల్ 40 పరుగులుచేసి జట్టును గెలిపించాడు. కెఎల్‌రాహుల్; శుభ్‌మన్‌గిల్ ఇద్దరూ కలిసి జట్టును విజయం వైపు నడిపించారు. గిల్128 బంతుల్లో తొమ్మిదిఫోర్లు, రెండు సిక్సర్లతో 101 పరుగులుచేస్తే కెఎల్‌రాహుల్ 47 బంతుల్లో ఒకఫోరు, రెండుసిక్సర్లతో నాటౌట్‌గా నిలిచారు. బంగ్లా బౌలర్లలో రషీద్‌కు రెండు, తక్సిన్ అహ్మద్, రెహమాన్‌కు చెరోవికెట్ లభించింది.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు..

>>ఎపిఇఆర్‌సి మొత్తం ఆధాయాన్ని రూ.44.323.30 కోట్ల రుపాయాలను ఆమోదించగా ఇది డిస్కమీల దాఖలు కంటే కొంచెం ఎక్కువే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.12,632.40కోట్ల సబ్సీడిని భరించటానికి అంగీకరించినట్లు తెలిపారు. అన్ని వినియోగదారుల వర్గాలకు టారిఫ్ పెంపును నివారించినట్లు తెలిపారు. వ్యవసాయ వినియోగదారులు, ఉద్యానవన నర్సరీలు, చాకలి, ఆక్వాకల్చర్ రైతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగల కుటుంబాలు మొదలైనవాటితో సహ నిర్ధిష్ట వినియోగదారు వర్గాలకు రాయితీలు, ఉచిత విద్యుత్‌ను అందించే ప్రభుత్వ ఉత్తర్వులు అన్నీకూడా ఉచిత సబ్జీడిలో చేర్చినట్లు తెలిపారు. మొదటిసారిగా ఎపిఇఆర్‌సి స్వల్పకాలిక విద్యుత్ అవసరాల గురించి మరింత వాస్తవిక అంచనా కోసం హర్లీ డిస్పాచ్‌ను ద్వారా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని జెన్‌కోలు దిగుమతి చేసుకున్న బొగ్గును సేకరించేందుకు, ఆర్‌ఎస్‌ఆర్ మోడీ ద్వారా బొగ్గును రవాణా చేసుకునేందుకు అనుమతించినట్లు తెలిపారు.

ఏప్రిల్ 1-2025 నుండి ఇళ్లను నిర్మించుకునే లేదా పునఃనిర్మించే వ్యక్తులు వాణిజ్య టారిఫ్ బదులుగా డొమెస్టిక్ టారిఫ్‌లో బిల్ చేయబడతారని తెలిపారు. స్టాండిబై టారిఫ్‌లు ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సస్ కన్జమర్ మాత్రమే కాకుండా ఓపెన్ యాక్సస్ కన్జమర్స్‌కు వర్తిస్తాయని తెలిపారు. 150 కెడబ్ల్యు వరకు కనెక్ట్ చేయబడిన ఈవి చార్జింగ్ స్టేషన్‌లకు ఎల్‌టి వోల్టేజ్ స్థాయిలో విద్యుత్ సరఫరా చేయడానికి అమోదం తెలిపినట్లు తెలిపారు. డిమాండ్ చార్జీలు లేకుండా ఇవిల టారిఫ్ యూనిట్‌కు రూ.6.70 మాత్రమే వసూలు చేస్తాయని తెలిపారు. డొమెస్టిక్ వినియోగదారుల కోసం అదనపు లోడ్‌లను క్రమబద్ధీకరించే పథకాన్ని ఎపిఇఆర్‌సి అమోదించి, ఈ పథకం మార్చి 1నుండి జూన్ 30వరకు అమలులో ఉంటుందని తెలిపారు. అన్‌లైన్ విండో ద్వారా వినియోగదారులు స్వచ్ఛంధంగా అదనపు లోడ్‌లను ప్రకటించవచ్చునని తెలిపారు.

# గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో గ్రూప్2 ప్రధానపరీక్ష(మెయిన్స్) ప్రక్రియను నిలువరించాలంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను రాష్ట్ర హైకోర్టు గురువారం కొట్టేసింది. ప్రస్తుత వాజ్యాలలో కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి గ్రూప్-2 ఫలితాలు ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో మహిళలు, మాజీ సైనిక ఉద్యోగులు, క్రీడాకారులు, దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు కేటాయించడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ఈ విధంగా తీర్పు వెలువరించింది. ఫిబ్రవరి 23వ తేదీన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిలువరించాలంటూ పలువురు అభ్యర్థులు ఇటీవల ఎపి హైకోర్టును ఆశ్రయించారు. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించనున్న ప్రధాన పరీక్షను నిలుపుదల చేయాలంటూ వేసిన అనుబంధ పిటిషన్లపై న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

ప్రధాన వ్యాజ్యాలపై కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఫిక్స్ చేసి గ్రూప్-2 పోస్టులకు తాజాగా నోటిఫికేషన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశాఖకు చెందిన ఎం. పార్థసారథి, కడపకు చెందిన కనుపర్తి పెంచలయ్యతోపాటు మరో ఇద్దరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాదులు బొద్దులూరి శ్రీనివాసరావు, జీవీ శివాజీ వాదనలు వినిపించారు. ఎపిపిఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్.. రిజర్వేషన్ల అమలుతోపాటు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోను ఈ సందర్భంగా కోర్టు ముందు ఉంచారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న గ్రూప్ 2 ప్రధాన పరీక్షను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ ప్రిలిమినరీ పరీక్ష ఇప్పటికే ముగిసిందని, ప్రధాన పరీక్షను నిలువరించ వద్దని హైకోర్టును కోరిన విషయం విధితమే. అలాంటి వేళ.. ఎపి హైకోర్టు ఈ విధంగా తీర్పు వెలువరించింది.

# గ్రూప్-2 పరీక్షలకు భారీ ఏర్పాట్లు

>> కేంద్రాల్లో ఈపరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 23వ తేదీ ఉదయం 10గం.ల నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకూ పేపర్1 వ్రాత పరీక్ష ఉంటుందని అభ్యర్థులు ఉ.9.30 గం.ల లోపు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఉ.9.45 గం.లకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేయాలని ఆలస్యంగా వచ్చిన ఎవరినీ లోనికి అనుమతించ కూడదని స్పష్టం చేశారు. అదే విధంగా మధ్యాహ్నం 3గం.ల నుండి 5.30 గం.ల వరకూ పేపర్2 పరీక్ష ఉంటుందని అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 గం.ల లోగా ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని 2.45 గం.లకు ఆ పరీక్షా కేంద్రాలా గేట్లను మూసివేసి ఆతర్వాత ఎట్టిపరిస్థితుల్లోను అభ్యర్థులెవరినీ లోనికి అనుమతించకూడదని ఆమె స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి డిటైల్డ్ ఇన్‌స్ట్రక్షన్లతో కూడిన బుక్ లెట్‌ను అన్ని పరీక్షా కేంద్రాలకు పంపడం జరిగిందని ఆసూచనలన్నీ లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటిండెంట్లు, ఇన్విజిలేటర్లు తుచ తప్పక పాటించి పరీక్షలు సజావుగా జరిగేలే చూడాలని చెప్పారు. గ్రూపు2 మెయిన్ పరీక్షలకు సంబంధించి సోషల్ మీడియాలో పరీక్షలు వాయిదా పడతాయని, ఇతర దుష్ప్రచారం జరుగుతోందని అటువంటి వేమీ అభ్యర్థులు నమ్మవద్దని ఎట్టి పరిస్థితుల్లోను ఈనెల 23వ తేదీన ఈ పరీక్షలను సజావుగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చైర్మన్ అనురాధ స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేనివిధంగా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలక్టర్లు, ఎస్పిలకు ఆమె సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించాలని చెప్పారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల సమీపంలో పరీక్షల సమయంలో జిరాక్సు,నెట్ కేంద్రాలన్ని మూసి ఉంచాలన్నారు. పరీక్ష హాల్లోకి మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర పరికరాలను ఎట్టిపరిస్థితుల్లోను లోనికి అనుతించరాదని తెలిపారు. అంతేగాక అవసరమైన మేర పరీక్షా కేంద్రాల్లో సిసిటివి కవరేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ అనురాధ కలక్టర్లకు సూచించారు.

రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎక్కడైనా సోషల్ మీడియా లేదా ఇతర ప్రచార మాధ్యమాల్లో నకిలీ వార్తలు ప్రసారం చేస్తే వెంటనే స్పందించి పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలక్టర్లకు సూచించారు. అలాంటి వార్తలపై వెంటనే స్పందించి కౌంటర్ చేయడం తోపాటు తప్పుడు లేదా నకిలీ వార్తలు ప్రసారం చేస్తే అలాంటి వారిపై చట్ట పరంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, ఆశాఖ కమీషనర్ కృతికా శుక్ల, సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల,ఎపిపిఎస్సి కార్యదర్శి ఐఎస్ మూర్తి తదితర అధికారులు పాల్గొనగా వర్చువల్‌గా జిల్లా కలక్టర్లు, ఎస్పిలు, సిపిలు,ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**తేది : 21-02-2025, శుక్రవారం**
**శ్రీ క్రోధి నామ సంవత్సరం,**
**మాఘమాసం, ఉత్తరాయణం,**
**శిశిర ఋతువు, కృష్ణపక్షం,**
అష్టమి ఉ.11.59
అనూరాధ ప.3.53
వర్జ్యం : రా.9.54-11.37
దు.ఉ.9.00-9.47
2) మ.12.53-1.40
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. చికాకులు ఎక్కువ అవుతాయి.

**వృషభం :** మీ ఊహలు నిజమయ్యే సూచనలు లేవు. ప్రయాణాలు వద్దు.

**మిథునం:** శ్రమపడ్డా ఫలితం దక్కదు. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

**కర్కాటకం:** కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** సంఘంలో ఆదరణ పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవదర్శనాలు.

**తుల :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:**ముఖ్యమైన నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలు.

**ధనుస్సు:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వాహనయోగం.

**కుంభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభవార్తలు.

**మీనం :** వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైన పట్టుదలతో అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ఆచార్య యార్లగడ్డ భేటీ

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ సయ్యద్ అబ్దుల్ నజీర్ ను రాజ్య సభ పూర్వ సభ్యులు, విశ్వ హిందీపరిషత్తు జాతీయ అధ్యక్షులు, పద్మభూషణ్ అచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసారు. గురువారం విజయవాడ రాజ్ భవన్ లో జరిగిన భేటీ సందర్భంగా యార్లగడ్డ తాజాగా రచించిన అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ హిందీ, డోనాల్డ్ ట్రంప్ అంగ్ల పుస్తకాలను గవర్నర్ కు బహుకరించారు. అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ పుస్తకాన్ని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అవిష్కరించిన విషయం విదితమే. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ విశ్వవిద్యా లయాల ఉపకులపతుల నియామకంలో రాష్ట్ర పభుత్వం అనుసరించిన విధానం అభినందనీయమని, కులపతి హోదాలో గవర్నర్ అమలు చేసిన తీరు అందరి ప్రశంసలు అందుకుందని గవర్నర్ నజీర్ కు వివరించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిభకు పట్టం కడుతూ ఉప కులపతుల నియామకం జరిగిందన్నారు. విశ్వవిద్యా లయాను ప్రక్షాళన చేసే దిశగా ప్రతిభకు పట్టం కట్టారని ప్రశంసించారు. వివిధ విశ్వవిద్య లయాలు, ప్రత్యేకించి ఆంధ్రా విశ్వవిద్యా లయంలో నెలకొన్న క్రమ శిక్షణా రాహిత్యంపై దృష్టి సారించాలని యార్లగడ్డ గవర్నర్ కు విన్నవించారు. రాష్ట్రంలో హిందీ ప్రచారం, సాహిత్య సృజనల వికాసాన్ని వివరిస్తూ అలూరు భైరాగి, అచార్య ఆదేశ్వరరావుల కవితలను వైఎల్పి వినిపించారు. ఆంధ్రప్రదేశ్ కు సర్ అర్థర్ కాటన్ అందించిన సేవలు సైతం వీరి మధ్య చర్చకు వచ్చాయి.

## పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై మంత్రి సవిత ఆందోళన!



**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** కొండపి ఎంజేపీ బాలుర పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది నితంతరం అప్ర మత్తంగా ఉండాలని, విద్యార్థుల భద్రత పట్ల బాధ్యతతో మెలగాలని గురుకులం కార్యదర్శి మాధవీలతను ఫోన్లో ఆదేశించారు. గురువారం ఉదయం కొండపి ఎంజేపీ బాలుర పాఠశాలలో అయిదో తరగతి చదువున్న మధుమోహన్ పాలు తాగ డానికి కిచెన్ రూమ్ కు వెళ్లాడు. పాలు తాగి వస్తున్న క్రమంలో పక్కన టేబుల్ పై ఉన్న వేడి పాలుతో ఉన్న గిన్నె దొర్లి మధుమోహన్ పై పడిపోయింది. దీంతో బాలుడి చాతి కింద, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ఇన్చార్జి అంకిరెడ్డి బాలునికి వైద్య సేవలందించారు. ఘటన జరిగిన వెంటనే ఎంజేపీ ఇన్చార్జి వార్డెన్ స్రవంతి బాలుని తల్లిదండ్రులకు సమాచారమందించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి సవిత.గురుకులం కార్యదర్శి మాధవీలతతో ఫోన్ లో మాట్లాడారు. బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాలుని ఆరోగ్యం నిలకడగా ఉందని, తీవ్ర గాయాలు కావడంతో మరో మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నట్లు వెల్లడించారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, బాలునికి మెరుగైన వైద్యమందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు బాలుని ఆరోగ్యంపై వివరాలు అందివ్వాలని స్పష్టంచేశారు. వేడి పాలు ఉన్నచోట హాస్టల్ నిర్వాహకులు, సిబ్బంది లేకపోవడంపై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత హెచ్చరించారు.స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డొక్కా బాలవీరాంజనేయులతోనూ మంత్రి సవిత మాట్లాడారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే మంత్రి బాలవీరాంజనేయులు ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, విద్యార్థికి మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు. ఎంజేపీ స్కూల్లో జరిగిన ఘటనపై మంత్రి సవితకు మంత్రి బాలవీరాంజనేయులు సమాచార మందించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు.

## 'గర్భాలయ శిఖర కలశాలు అపవిత్రం'

### ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం గర్భాలయ కలశాలు అపవిత్రం జరిగిందని మాజీ ధర్మకర్తల మండలి అంజూరు తారక శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2022లో కూడా ఇలా జరిగి గందరగోళం మారిందన్నారు. కుంబాభిషేకాల సమయంలో అర్చకులు కలశాలకు అభిషేకించటానికి తప్ప మరెప్పుడు తాకలేదన్నారు.

గర్భాలయ శిఖరాలపై ఏదైనా చేయాలంటే సంప్రదాయబద్ధంగా ఆగమ నిబంధనల ప్రకారం చేయాలని అలా కాకుండా చేస్తే చేదు అనుభవాలు ఎదుర్కొన్నారని శ్రీనివాసులు ఆరోపించారు. 2020లో ఏం జరిగిందో ఆలయాధికారులు గుర్తించుకోవాలన్నారు.ఇప్పటికైనా అధికారులు జరిగిన పొరబాటును గుర్తించి సరిదిద్దాలన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వైద్యులు, సిబ్బందిపై వేటు తప్పదు

### - రాష్ట్ర ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మంత్రి వాసంశెట్టి సుభాష్



**సచివాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** కార్మికులకు ఉచితంగా ఉత్తమ వైద్య సేవలు అందజేయాలనే లక్ష్య ంతోనే ఈఎస్ఐ ఆస్పత్రులను ఏర్పాటు చేయడం జరిగిందని,అయితే అటు వంటి లక్ష్యానికి విఘాతం కల్పించే విధంగా ప్రవరి ్తంచే వైద్యులు,సిబ్బందని ఏమాత్రం ఉపేక్షించబోమని రాష్ట్ర కార్మిక,ఫ్యాక్టరీలు,బాయిలర్ ్స,ఇన్సూ రెన్స్ మెడికల్ సర్వీసెస్ శాక మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు.రాజమండ్రి ఇఎస్ఐ వైద్యులు,సిబ్బంది విధుల పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరినీ స్వయంగా గమనించిన తదుపరే 5గురు వైదు ్యలను,4గురు ఔట్‌సోర్సి ంగ్ సిబ్బందిన సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటి సెల్లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాటా ్లడుతూ రాజమండ్రి ఈఎస్ఐ వైదు ్యలు,సిబ్బంది విధులపట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిదోరణి వల్ల ఆస ్ప త్రిలో ఓపి గరిష్టంగా 50కూడా లేదని,అయితే వీరిని సస్పెండ్ చేసిన తదుపరి ఓపి 170కి పెరిగిందనే విషయాన్ని ఆయన స్పష్టంచేశారు.తిరుపతి ఇఎస్ఐ వైద్యులు విదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల ఆ ఆస్పత్రిలో చాలా మంచి వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని తద్వారా అక్కడ ఓపి దాదాపు 350దాకా ఉందన్నారు.గత ప్రభుత్వం ఈఎస్ఐ లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం జరిగిందని,కాకినాడ ఈఎస్ఐ ఆస్పత్రిని కేంద్రప్రబుత్వానికి అప్పగించిందన్నారు.

రాష్ట్రంలోని కారి ్మకుల భద్రతకు,సంక్షేమానికి ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యదిక ప్రాదాన్యతను ఇస్తుందని,ప్రస్తుతం ఉన్న 78డిస్పెన ్సరీలకు అదనంగా మరో 18డిస్పెన్సరీలను తమ ప్రబుత్వం మంజూరు చేయడం జరుగుతుందన్నారు.తమ ప్రభుత్వం ఏర్పడిన 9నెలల కాలంలోనే అమరావతిలో 500పడకల ఈఎస్ఐ సెకండరీ కేర్ ఆస్పత్రితో పాటు ఇఎస్ఐ మెడికల్ కళాశాలను మరియు 150పడకల సూపర్ స్పెషాలీటి ఆస్పత్రిని ఏర్పాటు చేసే ప్రతిపాదనలను ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్‌కు పంపడం జరిగిందన్నారు.తిరుపతి ఈఎస్ఐని 50పడకల నుంచి 100పడకల సామర్ా్యనికి పెంచే చర్యలు చేపట్టామన్నారు.తద్వారా 97రెగ్యూలర్ పోస్టులు,94ఔట్‌సోరి ్సంగ్ పోస్టులు మంజూరు చేయడం జరిగిందన్నారు.కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని విశాఖ ఫార్మాసిటీలో సిఎస్ఆర్ నిధులతో మొబైల్ ఐసి యూనిట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇఎస్ఐ సంచాలకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

## బాలికల రక్షణ కోసం ఆద్య పేరిట సరికొత్త కార్యక్రమం

### - రాష్ట్రంలోనే తొలిసారి నసనకోట ఎంజెపి పాఠశాలలో ప్రారంభం
### - ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త బ్యూరో** బాలికల శక్తిని తెలియజేస్తూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కల్పించే విధంగా రాష్ట్రంలో తొలిసారి శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఆద్య అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్, ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నసనకోట ఎంజెపి పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, ట్రైనీ కలెక్టర్ వినూత్న, ఇతర అధికారులు, మేధావులు హాజరయ్యారు. ముఖ్యంగా బాలికలు చదువుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రేమ, వ్యామోహాలు, సోషల్ మీడియా వంటి వాటికి ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. బాలికలపై ఎవరైనా కనెన్నెత్తి చూడాలంటే భయపడే విధంగా రాష్ట్రంలో పోలీసులు కీచకులను ఎన్కౌంటర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలికలు చిన్న వయస్సులోనే ప్రేమ ఇతర వాటిపై ఆకర్షితులు కాకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనుక్షణం తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ అన్నది అరచేతిలో అద్భుతమని, అదే మీకు శాపంగా మారకుండా చూసుకోవాల న్నారు. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగిం చాలన్నారు. బాలికల రక్షణ కోసం పోలీసులు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని, సైబర్ క్రైమ్ డ్రగ్స్ వంటి వాటిపై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అమ్మాయిలను చదివిస్తుం టారని వారి నమ్మకాలను వమ్ముచేయకుండా మీరు చదువుకోవాలన్నారు. ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం మొత్తం మీ పాఠశాల, గ్రామాలపై పడుతుందని ఆమె అన్నారు.

## వల్లభనేని వంశీ కస్టడీ, హెల్త్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. ఈ రెండు పిటిషన్లపై ఎస్సీ ఎస్టీ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. వంశీతో పాటు మరో ఇద్దరి కస్టడీ పిటిషన్లపైనా న్యాయస్థానం తీర్పు ఇవ్వనుంది. గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దళిత యువకుడు సత్యవర్ధన్ కిడ్నాప్ దాడి కేసులో ఇటీవల వల్లభనేని వంశీని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన విజయవాడలోని జిల్లా జైలులో ఉన్నారు.

## యూట్యూబర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

### - ప్రభుత్వ భూవివాదమే హత్యకు కారణం
### - వివరాలు వెల్లడించిన డిఎస్‌పి శ్రీనివాస్



అరెస్ట్ అయిన ముద్దాయిలను చూపుతున్న పోలీసులు

**గుంతకల్లు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** గత ఐదు రోజుల క్రితం జరిగిన యూట్యూబర్ భోగాల తిరుమలరెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రభుత్వ భూమి వివాదమే హత్యకు కారణమని తెలిపారు. ఈ మేరకు గురువారం కసాపురం పోలీసుస్టేషన్ ప్రాంగణంలో డిఎస్‌పి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మండలంలోని సంఘాల గ్రామానికి చెందిన ముద్దాయి జీవన్‌కుమార్ తనకున్న నాలుగు ఎకరాల పొలం పక్కనే వున్న ఒక ఎకరం ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాడని తెలిపారు. బివిఆర్ న్యూస్ టుడే యూట్యూట్ ఛానెల్ నిర్వహిస్తున్న తిరుమలరెడ్డి ప్రభుత్వ భూమిని ఎలా సాగు చేసుకుంటావని అభ్యంతరం తెలిపాడని పేర్కొన్నారు. భూమిని సాగు చేసుకుంటున్న విషయాన్ని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసి డబ్బులు డిమాండ్ చేశాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం పెరిగి పెద్దదైందన్నారు. తిరుమలరెడ్డిని అడ్డు తొలగించుకోవాలని బావించిన జీవన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు, కసాపురం గ్రామానికి చెందిన బోయ రామన్నల సహాయంతో ఈనెల 17వతేదీ ఉదయం 7.45 గంటల సమయంలో సొంత పొలానికి బైకుపై వెళుతున్న తిరుమలరెడ్డిని ట్రాక్టర్‌తో బలంగా గుద్ది హంద్రీనీవా కాలువలో పడవేశారన్నారు. మృతుని భార్య కామేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయిలను గురువారం అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఒక ట్రాక్టర్, మోటర్‌సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టిపి వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. కేసు ఛేదింపులో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుళ్లు జాఫర్, కిషోర్‌కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, అంజి, నూర్‌అహ్మద్‌లను డిఎస్‌పి అభినందించారు.

## శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని సూచించారు. 18 సీట్లున్న మినీ ఏసీ బస్సు ఈ నెల 25న సాయంత్రం ఆరింటికి రాజమహేంద్రవరంలో బయలుదేరుతుందని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు విజయవాడ బెర్మ్‌పార్కు హోటల్ వద్దకు చేరుతుందని వివరించారు. పదింటికి మళ్లీ బయలుదేరి 26న ఉదయం శ్రీశైలం చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడి పర్యాటకాభివృద్ధి సంస్థ హోటల్‌లో అల్పాహారం, మధ్యాహ్నభోజన సదుపాయం కల్పిస్తున్నట్లు ఈడీ వివరించారు. టిక్కెట్ ధర పెద్దలకు రూ.4360 పిల్లలకు రూ.3490గా నిర్ణయించినట్లు తెలిపారు. దర్శనం అనంతరం బస్సు తిరుగు ప్రయాణంలో త్రిపురాంతకం మీదుగా 27న తెల్లవారుజామున రెండింటికి విజయవాడ, ఉదయం ఆరింటికి రాజమహేంద్రవరం చేరుకుంటుందని ఈడీ వివరించారు. వివరాలకు 9848629341, 9848007025 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## హాబీట్రాట్స్ ట్రస్ట్ గ్రాంట్ 8వ ఎడిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ, సామాజిక, సాంకేతిక అంశాలపై ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత ్సహించే లక్ష్యంతో భారత దేశ సహజ ఆవాసాలు, స్వదేశీ జాతులను రక్షించడానికి స్వలాభాపేక్ష లేని తాము ఈ ఏడాది ది హాబీటాబ్స్ ట్రస్ట్ గ్రాంట్స్ 8వ ఎడిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు హాబీటాబ్స్ ట్రస్ట్ అధిపతి రుషికేష్ చవాన్ ప్రకటించారు. ఈనెల 15 నుండి మార్చి 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫైనల్ వివరాలు అక్టోబర్ 2025లో వెల్లడిస్తామన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

### నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రు.25వేలకోట్ల బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షులు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావులు గురువారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తమ డిమాండ్లను తెలిపారు. రాజధానితో పాటు 26 జిల్లా కేంద్రాల్లో రు.500కోట్లతో వెంచర్లు వేసి సబ్సిడీపై ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇళ్ళస్థలాలు కేటాయించి వారి స్వంతింటి కల నెరవేర్చాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగికి రు.3 నుండి రు.5లక్షల మేర ప్రభుత్వం బకాయి వుందని , డిఏ బకాయిలు నగదు రూపంలో చెల్లించాల్సిన నగదుతో కలిపితే మరింత పెరుగుతుందని వీటి చెల్లింపుపై ప్రభుత్వం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తక్షణ నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగి అనుమతితో ఆ బకాయిలను 30శాతం సబ్సిడపై ఇళ్ళస్థలాలను కేటాయించడం ద్వారా స్వంతింటి కల నెరవేర్చాలన్నారు.

## మహాకుంభమేళాలో ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్ పుణ్యస్నానం



**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చంద్రయాన్-3తో గఘన కీర్తిని కట్టబెట్టిన ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్యాత్మికతపరంగాను ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్, డిఓఎస్ అధ్యక్షునిగా అత్యంత ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు కూడా ఆయన పదేపదే ఆధ్యాత్మిక భావాలు వెలిబుచ్చేవారు. సంస్కృత భాషలోనూ కొంత పట్టున్న సోమనాథ్ దక్షిణ భారతదేశంలో పేరెన్నిక కలిగిన పలు ఆలయాలను సందర్శించి ఉన్నారు. గత నెలలో ఇస్రో ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు విరమించిన తర్వాత ఆధ్యాత్మికతపరంగా మరింత చొరవ చూపిస్తున్నారు. ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అధికారదర్పం ఎలాగో ఉంటుంది. ప్రస్తుతం ఆయన సాధారణ పౌరుడిగా ప్రయాగరాజ్ త్రివేణి సంగమ తీరంలో కొంతసేపు పడవ కోసం నిరీక్షించి అనంతరం పుణ్యస్నానం ఆచరించారు. మహాకుంభమేళాలో సోమనాథ్‌ని చూసిన భక్తులు ఆయన సాదాసీదాగా ఒక చిన్న బ్యాగు పట్టుకొని నిరీక్షించడాన్ని ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం సోమనాథ్ ప్రయాగరాజ్ తీరంలో పడవ కోసం నిరీక్షించడం, పుణ్నస్నానం చేయడం వంటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విరివిగా కనిపిస్తున్నాయి. భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు గొప్ప విజయాలను అందించిన శాస్త్రవేత్త ఇంత సాధారణంగా వ్యవహరించడాన్ని చూసి అక్కడి భక్తులు, సందర్శకులతో పాటు ఈ దృశ్యాలను తిలకించిన వారు కూడా ఆయనను మరింత గౌరవభావంతో చూస్తున్నారు. భారత శాస్త్ర సాంకేతికరంగంలోని ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని ఇది ప్రతిబింబించిందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## ముంబయిలో పర్యటించిన మంత్రి నారాయణ, సిఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో రాజధాని అమరావతి పాటు,కీలక నగరాల అభివృద్ధి లక్ష్యం రాష్ట్ర పురపాలక శాఖా మంత్రిత్వ శాఖ కీలక చర్యలు చేపట్టింది.ఈ క్రమంలో ముంబయి నగరానికి వెళ్ళారు.అక్కడ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ(ఎంఎంఆర్‌డిఏ ), సిడ్కో అధికారులతో మంత్రి నారాయణ, సీఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబులుఇతర అధికారులు సమావేశమయ్యారు.ఎంఎంఆర్‌డిఏప్లానింగ్ డైరెక్టర్ శంకర్ దేశ్ పాండే,ఇతర విభాగాల అధికారులుముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్న ఎంఎంఆర్‌డిఏముంబయి లో రోడ్లు,మెట్రో రైలు,హౌసింగ్ ప్రాజెక్టులు చేపడుతున్న ఎంఎంఆర్‌డిఏరోడ్ల అభివృద్ధి,మెట్రో రైలు ప్లానింగ్,రవాణా ప్రణాళికలు, ఇళ్ల నిర్మాణం,రీజినల్ డెవలప్మెంట్,నిధుల సమీకరణ పై మంత్రి నారాయణకు ముంబై అధికారులు వివరించారు.ముంబయి మహానగరంలో విదేశీ పెట్టుబడుల సహకారంతో మౌళిక వసతులను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని మంత్రి కి వివరించిన లీలీళిదీతి అధికారులుప్రభుత్వ ప్రాజెక్టుల కోసం నిధుల సమీకరణ చేస్తున్న విధానాలు అడిగి తెలుసుకున్న మంత్రిముంబై మహానగర అభివృద్ధి లో ఎంఎంఆర్‌డిఏ తీసుకుంటున్న విధానాలను ఏపీలోని నగరాల అభివృద్ధికి అనుసరించే ఆలోచనలో మంత్రి నారాయణ ఉన్నారు.

## పింఛన్ల వెరిఫికేషన్ పారదర్శకం

### - రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ఫ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**సచివాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ఎంతో పారదర్శకంగా జరుగుతుందని రాష్ట్ర ఎమ్ఎస్ఎంఈ,సెర్ప్,ఎన్నారై ఎంపవర్‌మెంట్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 8లక్షల దివ్యాంగులకు సామాజిక భద్రతా ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని,ఇందులో ఇప్పటివరకు 1.20లక్షల పింఛన్లు వెరిఫికేషన్ పూర్తయినట్లు తెలిపారు.గతంలోని నియమ నిబంధల ప్రకారమే ఈ ఫించన్లు వెరిఫికేషన్ జరుగుతుందని,అర్హులైన ఏ ఒక్కరికి ఎటువంటి అన్యాయం జరగదన్నారు.ఒక జోన్‌లోని వైద్యులు మరో జోన్‌లో వెరిఫికేషన్‌ను ఎంతో పారదర ్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎమ్ఎస్ఎంఈ ల సర్వే కూడా ముమ్మరంగా సాగుతున్నందని, ఇప్పటివరకు 50శాతం మేర సర్వే పూర్తయిందని,ఈసర్వేకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుది గడువు నిర్ణయించినట్లు మార్చి 15కల్లా ఈ సర్వే పూర్తవుతుందని ఆయన తెలిపారు.

## రాజశేఖరం మృతి పార్టీకి తీరని లోటు

### - పాలవలస కుటుంబ సభ్యులను పరామర్శించిన జగన్

**పాలకొండ (మన్యం జిల్లా), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పాలవలస రాజశేఖరం మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఆయన తాము పెద్ద దిక్కును కోల్పోయామని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మన్యం జిల్లా పాలకొండ పట్టణంలోని పాలవలస రాజశేఖరం ఇంటికి వచ్చిన సందర్భంగా రాజశేఖరం భార్య రేగిడి మండలం జెడ్పీటీసీ పాలవలస ఇందుమతిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజశేఖర్ మృతి వార్త నన్ను కలచి వేసింది అన్నారు. తండ్రి సమానుడు తాను పార్టీలో



ఎదుగుదలకు నా వెంట నడిపించారని జగన్మోహన్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. మరణ వార్త తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నారు. నా తండ్రికి కూడా ఉత్తరాంధ్రలో అప్పుడు ఎవరైతే ఉన్నారంటే అది రాజశేఖర్‌ని గుర్తు చేసుకున్నారు. దూరంగా ఉండడం వలన రాలేకపోయానని రాజశేఖరం కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖరం భార్య ఇందుమతిని కుమార్తె పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబులను పరామర్శించి వారితో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం పాలవలస రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో పాలకొండ సమీపంలో మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో దిగారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పార్వతీపురం, విజయనగరం జిల్లాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలతో పాటు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణిలు జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. పాలవలస విక్రాంత్‌బాబు ఇంటికి సుమారు రెండు కిలోమీటర్లు రోడ్‌షోలో జగన్మోహన్‌రెడ్డి వచ్చారు. దారి పొడుగునా జగన్మోహన్‌రెడ్డిని చూడడానికి మండలంలోని చట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు తండోప తండాలుగా వచ్చారు. ముఖ్యంగా రాజశేఖరం ఇంటి వద్ద వివిధ కళాశాల విద్యార్థులు, రైతులు తమ సమస్యలను వివరించేందుకు బార్లు తీరారు. జగన్‌ను చూసిన ఆనందంలో జై జగన్ జైజగన్ అంటూ నినాదాలు చేశారు. ప్రజల కేరింతలను చూసి కాన్వాయ్ నుంచి బయటకు వచ్చిన జగన్ దారి పొడవునా ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ దాన్ని ఉల్లంఘించారని తెలుస్తోంది. ముఖ్యంగా జగన్మోహన్‌రెడ్డి రోడ్‌షోలో దారి పొడుగునా జగన్ జగన్ అంటూ నినాదాలు వినిపించాయి. ముఖ్యంగా జగన్మోహన్‌రెడ్డి ప్లేకార్డులు జెండాలు కనిపించాయి జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు ప్రజల్లో మంచి క్రేజ్ ఏర్పడింది. పాలవలస ఇంటి నుంచి బయటకు వచ్చిన దువ్వాడ శ్రీనివాస్‌ను ప్రజలు ముఖ్యంగా యువత చుట్టుముట్టి సెల్ఫీలు దిగారు.

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యసిద్ధి అవసరం.

న-సి.డబ్ల్యు.వెండైట్

## 'ప్రక్షాళన' మొదలు!

దేశంలో నదులన్నీ జీవనదులే. నదీ స్నానాలకు విశేష ప్రాధాన్యత ఉంది. పర్వదినాలప్పుడు భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఆ నదుల్లో పుణ్యస్నానాలాచరిస్తుంటారు. పన్నెండేళ్లకోసారి ఆయా నదులకు పుష్కరాలూ జరుగుతుంటాయి. ప్రస్తుతం మహాకుంభమేళాలో పవిత్ర స్నానాల కోసం జనం తండోపతండాలుగా వచ్చి వెళ్తున్నారు. ఒకరోజిద్దరో కాదు తాజా లెక్కల్ని బట్టి 57కోట్ల మంది స్నానం చేసి వెళ్లారు. అంతటి అమృత స్నానాలు కారణంగా గంగా, యమున, సరస్వతి నదులను త్రివేణి సంగమ పవిత్ర భూమిగానే కొలుస్తాం. కానీ నదీ జలాలు అనేక కారణాల చేత కాలుష్యంతో నిండిపోయాయి. పర్యావరణ శాస్త్రజ్ఞులు వీటి విషయంలో జాగ్రత్తలు చెబుతూనే ఉంటారు. నదులు తమ సహజ స్వరూపస్వభావాలను కోల్పోవడం తెలిశాక వాటి సంరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సంకల్పించిన ప్రభుత్వాలు వాటి మీద పలు కారణాల వలన శ్రద్ధ చూపించలేకపోయాయి. నదుల్లో కాలుష్యం నియంత్రించలేని స్థాయికి చేరుకున్నదని ఏనాడో గుర్తించారు. ఒక అడుగు ముందుకు పడలేదు. ఆయా నదుల్లో మురుగు నీటి ప్రవాహాల వలన కళ్లల కాసారాలుగా పేరుపొందుతున్నాయి. ఇదే పరిస్థితి దేశవ్యాప్తంగా తారసిల్లుతోంది. పారిశ్రామిక వ్యర్థజలాలే కాదు, ప్లాస్టిక్‌తో కూడిన చెత్తకూడా చివరకు చేరేది ఈ నది తీరానికే. నదుల్లో కాలుష్య నియంత్రణకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ప్రత్యేకించి నదుల కట్టిన సంఖ్యలు లేవు. జాతీయ హరిత ట్రిబ్యునల్ కూడా అనేక కేసుల్లో వీటి విషయాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నది. గోదావరి, కృష్ణా జలాల్లో సైతం తీసుకున్న జలనమూనాలన్నీ విష లోహాలతో నిండిఉన్నట్లు నివేదికలొచ్చాయి. అర్సెనిక్, నికెల్, కాడ్మియం, క్రోమియం వంటి రసాయనిక పదార్థాలు కలిసి ఉన్న ఈ జలాల వలన వాటిని తాగునీరుగా వాడే జనానికి అనారోగ్యహేతువవుతున్నాయి. దేశంలోని 187 నదుల్లో నీరు అత్యంత కాలుష్యాన్ని మోసుకెళ్తున్నట్లు చెప్పుకుంటారు. గంగానదిలోకి ఉత్తరాదిన దాదాపు అన్ని ప్రధాన పట్టణాల నుంచి రోజూ 300కోట్ల లీటర్లకు పైగా మురుగునీరు వచ్చి చేరుతోందని అంచనా. విష రసాయనాలు, క్రిమిసంహారక మందులు, ఇవిగాక పశు కళేబరాలు, మృతదేహాలు కూడా ఈ నదుల్లో కలిసిపోతుండడం వల్ల పవిత్ర నదులుగా భావించే మనం తీరా స్నానం చేసే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరతాయోనని భయం పట్టుకుంటోంది. అందుకే నదీజలాలు తాగునీటిగా ఉపయోగపడవనే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వచ్చేసింది. నదీ కాలుష్యం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. జీవనదిలో చేసిన అధ్యయనాన్ని బట్టి గంగానది ఇప్పుడు నీటిలో మలసంబంధిత బ్యాక్టీరియా నిండి పోయింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఈ నెల 3న సమర్పించిన నివేదికను బట్టి ఈ నది నీటి నాణ్యత స్నానానికి పనికిరాదు. హరిద్వార్‌లోనూ గంగానది కలుషితమైంది. 1986లో కేంద్రప్రభుత్వం గంగానది శుద్ధికోసం 'నమామి గంగే' ప్రాజెక్టు ప్రారంభించింది. వేలాది కోట్లు ఖర్చుచేసినా సత్ఫలితాలు సాధించ లేకపోయారు. అమెరికా, యూరప్ వంటి పశ్చిమదేశాల్లో నదులను అత్యంత శుభ్రంగా ఉంచుకోవడం మనకు తెలిసిన విషయమే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిన రోజుల్లో కూడా మురుగునీటి శుద్ధి పారిశుధ్య సంరక్షణ వంటి విషయాల్లో వెనుకబడి ఉన్నామనే మన కార్యాచరణలో లోపముందన్నది తేటతెల్లం. ఈ నేపథ్యంలోనే యమునా నదీ కాలుష్యమెంతో నానాటికీ పెరిగిపోయా యని పెద్ద చర్చేసాగుతోంది. నిన్నమొన్నటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా యమునా నది కాలుష్యం గురించి ప్రచారం జరిగింది. ప్రధాన పోటీ లో ఉన్న ఆప్, భారతీయ జనతాపార్టీలు యమునా నదీ జలాలు ప్రక్షాళనపై విసుర్లు కూడా విసురుకున్నాయి. ఆప్ చివరకు 'యమునా నది ప్రక్షాళన' తాము చేస్తామంటే తాము చేస్తామని హామీలు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం అండదండలు లేకుండా ఇలాంటి మహత్తర కార్యక్రమాలు చేయడం కష్టసాధ్యం. అయినా 'ఆప్' కూడా ఆ పాటే పాడింది. 2020లోనే ఆమ్ ఆద్మీపార్టీ ఢిల్లీ పీఠం ఎక్కినా కేంద్రప్రభుత్వంతో వైరంతో యమునా నదిప్రక్షాళన ఊసేఎత్తలేదు. ఏమైతేనే పాలకులెవరైనా, ఏపార్టీ వారైనా ప్రక్షాళన అవసరమేనని ఒప్పుకున్నారు. అనుకున్నట్లుగానే ఈ నెల 16 నుంచి యమునా నది శుద్ధిపనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. నిత్యం పారిశ్రామిక వ్యర్థాలు, 3 కోట్లకుపైగా జనాభా ఉన్న ఢిల్లీ ప్రాంతాల నుంచివస్తున్న మురుగు కూడా దీనిలో కలుస్తాయి. 4అంచెల ప్రణాళిక తో ముందుకు వెళ్లింది. కొత్త ప్రభుత్వం ఏర్పడకుండానే ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పనులు మొదలయ్యాయి. యమునా నది ఉత్తరాఖండ్ హిమాలయాలను దాటి హర్యానా, యుపి సరిహద్దుల మీదుగా ప్రవహించి ఢిల్లీకి చేరుకుంటుంది. ప్రస్తుతానికి ఈ 57 కిలో మీటర్ల మేర పనులు పూర్తి చేస్తారు. ఢిల్లీని దాటితే మధుర ఆగ్రా ప్రాంతంలో కూడా నదజలాలు కాలుష్యమే. నదిశుభ్రం కోసం క్లీనింగ్ ఆపరేషన్ మొదలెట్టారు. ట్రాష్ స్కిమ్మర్లు, వీడ్ హార్వెస్టర్లు, డ్రెడ్జ్ యుటిలిటీ యూనిట్లతో నదిని శుభ్రం చేస్తున్నారు. సుందరీకరణ, కాలుష్యం కలిగించే వ్యర్థాల తొలగింపు జరుగుతోంది. మురుగునీటితో పేరుకుపోయిన మేటలను డ్రెడ్జింగ్ యంత్రాలు తొలగిస్తాయి. ఆ తర్వాత సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటులను ఏర్పాటుచేస్తారు. ఏమయితేనేం ఢిల్లీ విషయంలో కేంద్రం ఓ ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర నదుల్లో కాలుష్యం తొలగించేందుకు కూడా యుద్ధప్రాతిపదికన నదుం కట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

మీరు గౌరవాన్ని కోరుకుంటే, ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్ జాన్సన్

## ప్రజావాక్కు



### కుల భావజాలానికి కాలం చెల్లింది!

వైకాపానేత, పులివెందుల శాసనసభ్యులు జగన్ మోహన్ రెడ్డి తన విజయవాడ పర్యటనలో చంద్రబాబు నాయుడుకి తన సామాజిక వర్గానికి చెందిన వారు ఎదగటం ఇష్టం ఉండదంటూ ఒక వ్యర్థప్రేలాపన చేశారు. వల్లభనేని వంశీని అరెస్టు చేస్తే న్యాయ పోరాటం చేయవచ్చు. జగన్ అందుకు అన్నివిధాలా సహాయ పడవచ్చు. ఇక్కడ కుల ప్రస్తావన అసంబద్ధం, దివాళా కోరు రాజకీయాలకు పరాకాష్ట! గతంలో కులాలమధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందారు. వైకాపా పాలనలో బిటెక్ రవి గారిని కూడా వేధింపులకు గురిచేశారు. మరి ఇదే నీతిసూత్రం అప్పుడు కూడా వర్తించాలి కదా? ఇదే భావజాలం కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ఆ పదకొండు స్థానాలు కూడా రావు.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఎస్జీటీ ఉపాధ్యాయులకు పరీక్షల విధులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాల్లో అధిక భాగం స్కూళ్లలోఒకరు లేక ఇద్దరుఎస్జీటీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈఎస్జీటీ ఉపాధ్యాయులకు మార్చి, ఏప్రిల్ నెలల్లోఇంటర్మీడియట్ పరీక్షలఇన్విజిలేషన్ డ్యూటీలు, పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ స్పాట్ వాల్యూయేషన్ విధులు కేటాయిస్తున్నారు. అందువల్ల ప్రాథమిక పాఠశాలలు సింగిల్ టీచర్స్ స్కూల్స్ అవుతున్నాయి. దీంతో ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతున్నది. రాబోవురోజుల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులను పదవ తరగతి పబ్లిక్ పరీక్షల విధులకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ డ్యూటీ, స్పాట్‌వాల్యూయేషన్ డ్యూటీల నుంచి ఎస్జీటీ ఉపాధ్యాయులను మినహాయించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### మాదకద్రవ్యాల నియంత్రణ ఎక్కడ?

మాదకద్రవ్యాల సమస్య రోజురోజుకు తీవ్రతరమై యువతరాన్ని నిర్వీర్యం చేస్తుంది. మాదకద్రవ్యాల మత్తులో పడి నిండు నూరేళ్ల జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. వీటిని సేవించడంవల్ల కలిగేదుష్ఫలితాలను చిన్నవయసు నుంచే పసిపిల్లలకు వివరించి చెప్పాలి. పాఠశాలలో వీటి దుష్ఫలితాలను గురించి స్పష్టంగా బోధించాలి.

- తూలుగు రమణారావు, అక్కరాపల్లి

### కుంభమేళా భక్తుల జేబుకు చిల్లు

మహా కుంభమేళా ఫిబ్రవరి 26న వచ్చే శివరాత్రితో ముగియనుంది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్ రాజ్ తరలివెళ్తారు. విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు వెళుతున్నారు. ఈడిమాండ్‌ను ఆసరాగాచేసుకుని విమానయాన సంస్థలు భక్తుల జేబుకు చిల్లులు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో రూ.5000 నుండి రూ. 10,000 లోపు ఉండే చార్జీలను ఏకంగా రూ.30 వేలకు పైనే వసూలు చేస్తున్నాయి. ఈ వారం ఆరంభంలో ప్రయోగ్ రాజ్ నుండి బెంగుళూరు ప్రయాణానికి ఓ ప్రయివేటు విమాన కంపెనీ ఒక్కొక్కరికి రూ. 39,146 వసూలు చేసింది. సాధారణంగా రూ.10 వేల లోపు ఉన్న విమాన చార్జీలను కుంభమేళా సమయంలో బెంగుళూరుకు రూ.22వేల వరకు వసూలు చేశాయి. తాజాగా ఈ చార్జీలు మరింత దంచుకోవడం పై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వెంటనే కేంద్ర విమాన మంత్రిత్వ శాఖ ట్రావెల్స్ ఏజెన్సీలపై చర్యలు తీసుకొని విమాన చార్జీలను తగ్గించే విధంగా చేయాలని ప్రయాణికుల విన్నపం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భారత్,బంగ్లా సంబంధాలు

షేక్ హసీనాకు ఆశ్రయం ఇవ్వడం వల్ల బంగ్లా కొంత మనకు దూరం జరిగిన పాకిస్థాన్‌తో అంటకాగడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదు భారత్‌లోద్వారా స్కింతయారీలో అమర్త్యసేన్‌తో పాలుపంచుకున్న మహమ్మద్ యూనిస్ పాలకుడుగా బంగ్లాలో నివసించే మైనారిటీలకు ముఖ్యంగా హిందువులకు ఏమాత్రం విశ్వాసం కలిగించిన దాఖలాలు లేవు అదే అతి పెద్ద విషాదం. అయితే భారత్‌కు బంగ్లాకు సాంస్కృతిక సంబంధాలు కూడా ఉన్నాయి. అంత మాత్రమే కాదు భారత్ బంగ్లా మధ్య కుషియారానది రహీంపూర్ కాలువ సంబంధాలు కూడా ఉన్నాయి. కావున ఆ దిశగా భారత్ బంగ్లా అడుగులు పటిష్టంగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

### ప్రజల అవసరాలు పట్టించుకోండి

గ్రామాల్లో పాఠశాల, వైద్య శాల, పార్కు, గ్రంథాలయం, పబ్లిక్ టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు ఉన్నప్పుడే గ్రామం సమగ్రా భివృద్ధి చెందుతుంది. ప్రభుత్వాలు ఇంటి పన్ను వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఉచితబియ్యం, బస్సు, రైతుబంధు వంటి పథకాలు ప్రకటిస్తూ ప్రజల అవసరాలను మాత్రం విస్మరిస్తున్నాయి.

- పుట్లూరి రాంనర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించాలి

**ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభాలెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్లమంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీ ర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సిన అవసరం ఉంది.**

రామ కిష్టయ్య సంగన భట్ల

ఒక సమాజపు సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతు లు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయ రానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతి లో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్న మైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగు తుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమా దంలో పడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్‌కు వెళ్లినవ్యవసాయ కూలీలు 185 సంవత్సరాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగువాళ్లు ఉండగా తమ వారసు లకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారికతను సాధించి పెట్టేందుకు కృతనిశ్చయంతో, తెలుగుభాషా మాధ్యమంలో పాఠశాలలు నిర్వహింప చేసు కుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలున్నాయి. ఉత్సవాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ ఛానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి ఛానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్సిటీ లో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సులున్నాయి. అంతేకాకుండా, మారిషస్ తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక కళానిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావితరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈక్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలి యాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠ శాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్ వేల్స్, క్వీన్స్ లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. అమెరికాలో తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది. ఇది గత ఏడు సంవత్సరాలలో 86శాతం పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్




3న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళా సారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డ మ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతేకాదు మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్యసమ్మేళనం కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్‌రికార్డ్స్, తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాదిమంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగిపోని సంఘటన. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్సవంలో దాదాపు 45 దేశాలనుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటిపైకి వచ్చాయి. తెలుగు చరిత్రలో కనీవినీ ఎరుగని రికార్డ్‌అది. జయహో భారతీయం భారతదేశం, జిజ్ఞాస-భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్రప్రదేశ్ అసోసియే షన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగుఅసోసియేషన్ ఆఫ్‌లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసి యేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్-కువైట్, తెలుగుకళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగుసమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగుకల్చరల్ సొసైటీ నార్త్రెన్ ఐర్లాండ్, తెలుగు కళాసమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ - న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాత్మెంటిన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి - న్యూజిల్యాండ్, తెలుగు కళాసమితి-ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతోపాటు ఆయా దేశాలలో వివిధరాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషనునికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీభాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధాపరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్రశిక్ష విధించిన విషయం చరిత్రచెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తనకాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబులాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈతరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాలపట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు తెలుగులెస్స అన్న నానుడి దేశ భాషలందు తెలుగు లెస్ అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగుమాట్లాడేవారు 15కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్ల మంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగామారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సిన అవసరం ఉంది. ●

## పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవడం ఎలా?


బి.మధుపాళి

మార్చి,ఏప్రిల్ మాసాలు భారత్‌లో వార్షిక పరీక్షల సీజన్‌గా పరిగణించబడుతున్నది. విద్యార్థినీవిద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల వేటలో తమ కృషిని కొనసాగిస్తారు. పరీక్ష అంటేనే ఒక రకమైన ఒత్తిడి పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించాలనే ఆశావహ మానసిక ఒత్తిడి లేదా పాజిటివ్ స్ట్రెస్ ఉన్న యువత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందుతారు. పరీక్షలకు తయారు అవుతున్న విద్యార్థులు అతిగా ఆలోచిస్తూ, ఏమవుతుందో అనే అనవసర ఆందోళనలు, తీవ్రమైన నెగెటివ్ ఒత్తిడులు పరీక్షల్లో ఫలితాలను తారుమారు చేస్తాయని తెలుసుకోవాలి. విద్యార్థులపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ప్రభావం కూడా పరీక్షల ఒత్తిడిని పెంచుతుందని గమనించాలి. పరీక్షల్లో తాహత్తుకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నయువతలో 'పరీక్షల ఆందోళన' తారస్థాయికి చేరి ఫలితాలను మరింత ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. గత పరీక్షల్లో పొందిన మార్కులు లేదా ర్యాంకుల కన్న కొంతైనామెరుగైన ఫలితాలను సాధించాలనే ఆచరణయోగ్య లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మన శక్తి సామర్థ్యాలకు మించి మార్కులు లేదా ర్యాంకులు రావాలని ఆశపడడం వల్ల మన చదువులపైప్రతికూల ప్రభావాలు పడడంతోపాటు గతంకన్న తక్కువ స్థాయిలో ఫలితాలు వస్తాయి. పరీక్షలంటే అనవసర ఆందోళనలు మన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయి. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురికావడం సాధారణంగా జరుగుతుంది. ప్రతికూల ఒత్తిడిపెరిగిన యువతలో ఏకాగ్రత సడలడం, ఆందోళనలు పెరిగి ఎక్కువ సమయం చదవకపోవడం జరుగుతుంది. పరీక్షలంటే భయం పెరిగిన యువతలో శారీరకంగా అతిగా చెమటలు పట్టడం, వాంతులు, జీర్ణసంబంధ సమస్యలు, గుండెవేగం పెరగడం, శ్వాస మందగించడం, తలనొప్పి, కోపం పెరగడం, అధిక బీపీ, ప్రతికూల ఆలోచనలు వెంటాడడం, భయదాడి (పానిక్ అటాక్) లాంటి అవలక్షణాలన్ని కనిపిస్తాయి. రాబోయే పరీక్షలకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని చదవడం ప్రారంభించాలి. పరీక్షా ఫలితాలపట్ల అనవసర ఆలోచనలు మన ఏకాగ్రతను మింగేస్తాయి. సబ్జెక్టుల వారీగాప్రణాళికలు రాసుకొని ప్రాధాన్యతాక్రమంలో చదవడం మంచిది. చదివిన పాఠాలు ఎంతవరకు గుర్తున్నాయో తెలుసుకోవడానికి స్వయం పరీక్షలు రాయాలి. చదువుతున్న సమయంలో గంట లేదా రెండు గంటలకు ఒకసారి స్వల్ప విరామం తీసుకోవడం, దీర్ఘశ్వాసలు తీసుకోవడం ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి. గత పరీక్షలో పొందిన మార్కులకన్న ఎక్కువరావాలనే లక్ష్యాలు మంచి ఫలితాలను ఇస్తాయి. నిన్నటికన్న నేడు మెరుగైతే మనం ప్రగతి బాటన నడిపినట్లే అని నమ్మాలి. మనం చదివేచదువుపై అనవసర ప్రతికూల ఆలోచనలకు స్వస్తిపలకాలి. నా శక్తి వంచన మేరకు చదువుతున్నాను, నేను మంచి ఫలితాలను సాధించగలను, నేను అనుకున్న ఫలితాలు పొందకపోయినా రానున్న పరీక్షల్లో మెరుగు పరుచుకోగలను లాంటి ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఆశావహ ఆలోచనలు మన ప్రతిభను పెంచుతాయి. దినచర్యను నిర్ణయించుకొని, మధ్యమధ్య పాలు లేదా టీ లాంటివి తాగుతూ మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలి. చదవడాన్ని వాయిదా వేయవద్దు. చదువుతున్న పాఠంలోని ముఖ్యఅంశాలను అండర్‌లైన్ చేసుకోవడం మంచిది. గ్రాఫ్‌లు, లెక్కలు, దయా గ్రామ్స్, సూత్రాలు, సమీకరణాలు లాంటిఅంశాలను చదివే సందర్భంలో రాసుకుంటూ చదవడంమంచిది. ఒకసారిరాస్తే పదిసార్లు చదివినట్లే అని తెలుసుకోవాలి. ప్రతిరోజు కొన్ని నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించండి. పరీక్ష రోజునకనీసం 15, 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. పరీక్షకు వెళ్లే ముందు అతిగా తినడం మంచిది కాదు. పరీక్షకు ముందు రోజు సమయానికి నిద్రపోవాలి. సమయానికి చేరలేమేమో అనే ఆందోళనలు మన ఏకాగ్రతకు భంగంకలిగిస్తాయి. పరీక్ష హాలుకు తీసుకుపోవలసిన హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిల్‌లు, ఇతర సామాగ్రినిముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించరని గుర్తుంచుకోవాలి. ●

## సామాజిక న్యాయదిశగా వర్గీకరణ అడుగులు

గురం రాంమోహన్ రెడ్డి

సామాజిక సమ న్యాయం దిశగా అడుగులు పడుతున్నాయి. మహోజ్వాలంగా సాగిన ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం వర్గీకరణ రూపేణ ఫలితాలు అందేందుకు మార్గాలు సుగమవుతున్నాయి. ఎస్సీలకు, ఉపకులాలకు ఎ.బి.సి వర్గీకరణ రూపేణ విద్యా, ఉద్యోగ రంగాల్లో వాటను పొందనున్నారు. తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి వున్నామని అధికారికంగా ప్రకటించింది. ఇచ్చిన మాటకు కట్టుబడి వుండాలన్న సంకల్పంతో జస్టీస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమీషన్ను నియమించింది. ఎస్సీలోని 59 కులాలు అభిప్రాయాలను ఆలోచనలను మనోగతాన్ని కమీషన్ సేకరించి, నివేదికి రూపొందించి ప్రభుత్వంకు అందజేసింది. ఏక సభ్య కమీషన్ అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను రాష్ట్ర కేబినేట్ ఆమోదించి చట్ట సభలైన శాసనసభ, శాసన మండలలో ప్రవేశపెట్టి అధికారిక ప్రకటనను శాసన సభలో ముఖ్యమంత్రి శాసన మండలి ఆర్థికమంత్రి చేసి చర్చకు పెట్టారు. ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన జస్టీస్ షమీమ్ అక్తర్ నివేదికను అధికార పక్షంతోపాటు ప్రధాన రాజకీయ పక్షాలు బి.ఆర్.యస్., బి.జె.పి. ఎం.ఐ.ఎం, సి.పి.ఐ పార్టీల సభ్యులు ససమర్థించారు. ఎస్సీలకు, ఉపకులాలకు, మాలలకు సమన్యాయం దక్కే దిశగా అడుగులు పడటాన్ని అన్ని పార్టీలు స్వాగతించిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ అమలు కోసం చట్టం చేయాలా, ఆర్డినెన్స్ తీసుకురావాలన్న యోచనలో నిమగ్నమైంది. గతంలో షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లను ఎ.బి.సి.డిగా వర్గీకరణ చేసి విద్య ఉద్యోగ రంగాల్లో అమలు చేశారు. జస్టీస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ రిజర్వేషన్ల ఎ.బి.సి. మాత్రమే అమలు చేయాలని సూచించింది. 9 శాతం ఎస్సీలకు ఉపకులాలకు (ఎ గ్రూప్) 5 శాతం మాలలు ఇతర ఉపకులాలకు "డి గ్రూప్), 1 శాతం ఉపకులాలకు (సి గ్రూపు) మొత్తం 15 శాతం అమలు చేయాలని సూచించింది. ఎస్సీ జాబితాల్లోని మొత్తం కులాలకు సమన్యాయం దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర జనాభాల్లో ఎస్సీలు 61 లక్షల 84 వేల 319 శాతం జనాభా వున్నట్లుగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక, ఆర్థిక విద్యా, ఉపాధి రాజకీయ సమగ్ర సర్వేలో వెల్లడైంది. మొత్తం తెలంగాణ జనాభలో ఎస్సీల శాతం 17.43 ఉన్నట్లు సర్వేలో తెలింది. సుప్రీమ్ కోర్టు భారత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునుఅమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చకచకగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఎస్సీల (59 కులాల) జనాభా, అక్షరాస్యత ఉపాధి, విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల నియమాకాలు, ఆర్థిక



స్థితిగతులను అధ్యాయనం చేసిన కమీషన్ రిజర్వేషన్ల వర్గీకరికరించి ప్రభుత్వంకు సిఫార్సు చేసింది. కమీషన్ 199 పేజీల నివేదికలో ఎస్సీల్లోని 59 కులాలపై వివరణాత్మక అంశాలను పొందుపర్చి మూడు గ్రూపులుగా విభజించాలని సూచించిన నేపథ్యం వేగంగా ఆచరణ యోగ్యమైన నిర్ణయాలకు తెలంగాణ ప్రభుత్వం ఉపక్రమిస్తుంది. 2011 జనాభా గణన ప్రకారం గ్రూప్లో అత్యంత వెనుకబడి ఎవరు పట్టించుకోని ఎస్.సి. కులాలకు 1 శాతం, గ్రూపు 2లో మధ్యస్థంగా లబ్ధిపొందిన 18ఎస్.సి.కులాలకు 9 శాతం (జనాభాలో 62.748 శాతం) గ్రూపు 3లో మెరుగైన ప్రయోజనం పొందిన 26 ఎస్.సి. కులాలకు 5 శాతం (జనాభాలో 33,963 శాతం) రిజర్వేషన్లు కల్పించనున్నది. కమీషన్ గ్రూపు 1లో బావుర్, బుడజంగం, చలాటి, దక్కలి, జగ్గలి, పంబాద, పంబాలో, వంబండ, మాగ్, మన్నే, మస్తీ, మాంగ్ గరోడి, మాతంగి, మోహతర్, ముండాల, సంబన్, స్రప్తు కులాలకు 1 శాతం రిజర్వుషన్లు వర్తించనున్నాయి. గ్రూపు 2లోని అరుందతీయ, బైద్ల, చమర్, మోచి, మూని, చమర్, రవిదాస్, చమర్ రోహిదోస్, చంచర్, చండాల, డోమ్, ఓంబరా, పైడి, పానో, ఎల్లమ్మ వాడ్లు గోడార్, జాంబువులు, ఎస్సీ మాదిగదాసు, మస్తీక, పామిడి, పంచమ, పరియ ప్రమగర, చిందోల్లు, యాటల, వల్లువన్, ఎస్.సి. కులాలకు 9శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గ్రుపు3లోని ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, అనాముక్, అరేమాల, అర్వమాల, బ్యాగర, చలవాడి, డోర్, ఘాసి, చండి, శల్లీ, గోసంగి, హెలియా, హెలియాదాసరి, మాదాసి కురవ, మదారి కురవ, మహర్, మాల, మాలదాసరి, మాలదాసు, మాల హన్యాయ్ మాల జంగం, మాల మస్తీ, నేతకాని, మాలసన్యాసి, మిత అయ్యల్వార్, పాక్, మోత, రేల్లి కులాలకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. రిజర్వేషన్ల పరిధి నుండి క్రిమిలేయర్ను మినహాయించడానికి వర్గీకరణలోని 4వ నంబర్ (డి గ్రూపు)ను సిఫార్సు నుంచి తొలగించేలాని కమీషన్ సిపార్సు చేసిన క్రమమంలో ప్రస్తుతం గ్రూపు1, గ్రూప్2, గ్రూప్3 వర్గాలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయి. 1999లో ప్రారంభమైన ఉద్యమ ఆకాంక్షలు నేరవేరడానికి బాటలు పడ్డాయి. ప్రకాశం జిల్లా ఇది మూడిలో ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం ఆరంభమై మహాజ్వాలంగా గల్లి నుంచి హస్తిన వరకు 32 ఏళ్లపాటు కొనసాగి విజయ తీరాలకు చేరుకోబోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కదిలించి, మెప్పించి ఒప్పించి ఎం.ఆర్.పి. ఎస్.ఉద్యమం దళిత బహుజనుల్లో శ్రామికు కులాల్లో ఉద్వేగాన్ని నింపి జయగీతం పాడనున్నది. ఇప్పటికే హర్యానా రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబర్ 19 నుంచి విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుంది. సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు అన్ని రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు కొరకు ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమబేరిమోగించనున్నది. ●

## సచివాలయ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

**- ఎమ్మెల్యే ఉగ్ర**



**కనిగిరి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం అమరావతి మైదానంలో కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా, త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. అక్రమ వెంచర్లు లేకుండా చొరువ చూపాలని కూడా ఆయన సూచించారు. మునిసపాలిటీ అనుమతితో వెంచర్ల లేఅవుట్‌లు 30 అడుగుల రోడ్లు, సైడ్ కాలువలు, వీధి దీపాలు వంటి సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. మున్సిపాలిటీకి రుసుము చెల్లించిన తర్వాత పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేలా పార్టీలకు అతీతంగా పన్ను వసూళ్లు చేయాలని అధికారులను ఆయన సూచించారు. సచివాలయం కార్యదర్శులు, సర్వేయర్లు, మహిళా పోలీసులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు పలు సూచనలు, సలహాలు అందించారు. మున్సిపాలిటీలో ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ డానియల్ జోసెఫ్, తహాశీల్దార్ ఆకుల వెంకట రవికుమార్, మేనేజర్ ప్రసాద్, టీపీఎస్ చేబ్రోలు సువర్ణ కుమారి, శానిటరీ ఇన్‌సెపక్టర్ నాయబ్ రసూల్, సీనియర్ అసిస్టెంట్ పూర్ణిమ, చెన్నకేశవ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్ర ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి అధికారులను కట్టుబడి పని చేయాలని కోరారు. ప్రజల సేవలో ఎల్లప్పుడూ జాగ్రత్తగా, నిబద్దతతో ఉండాలని ఆయన తెలిపారు.

## కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న రైతులు

**- స్పందచని ప్రాజెక్టు అధికారులు**



**మద్దిపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

గుండ్లకమ్మ కాలువ మరమ్మత్తులతో.. తమ పంటలకు సకాలంలో నీరు అంది మంచి దిగుబడులు వస్తాయనుకున్నామే కానీ చేతికి వచ్చిన పంట నష్టపోతామని అనుకోలేదంటూ మద్దిపాడు గ్రామానికి చెందిన శనగ రైతు నూనె వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్లకమ్మ కాలువలకు మార్చిలోపు మరమ్మత్తులు నిర్వహించాలని జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారనే క్రమంలో గుండ్లకమ్మ మెయిన్ కాలువలతో పాటు పంట పొలాలకు సాగు నీటిని సరఫరా చేసే కాలువలను కూడా మరమ్మత్తులు చేపట్టడం జరిగింది. మరమ్మత్తుల నిర్వహణ చేపట్టే క్రమంలో మద్దిపాడు గడియపూడి కాలనీ శివారులో గుండ్లకమ్మ సాగునీటిని సరఫరా చేసే కాలువను గత నాలుగు రోజులు నుంచి నాసు, జమ్మూ తొలగింపు,



పూడికతీతలను గడియపూడి, దొడ్డవరప్పాడు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కాంట్రాక్టు తీసుకొని ప్రొక్లెయిన్‌తో మరమ్మత్తులు చేపడుతున్నారు. ఈ పనులను గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం, వారు తమ ఇష్టారాజ్యంగా పూడికతీత పనులు చేయడంతో పంట కాలంలోని నీరు ఉధృతి పెరిగి, కాలువ పొంగి పక్కనే ఉన్నటువంటి శనగ, పొగాకు, మిర్చి, మొక్కజొన్న పంటలు పొలాలలో అధికంగా నీరు చేరడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై శనగ పంట రైతు నూనె వెంకటేశ్వర్లు పంట కాలువకు సమీపంలో 8.5 ఎకరాలు శనగ పంటను సాగు చేస్తుంటే దానిలో 4.5 ఎకరాల శనగ పంట మునిగిపోయిన పరిస్థితి. ఆ రైతు గుండ్లకమ్మ ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులకు ఫోన్ ద్వారా పరిస్థితిని తెలుపగా శనగ పంటకు నీరు మంచిదే కదా.. అంటూ బొకాయిస్తూ మాట్లాడారని శనగ పంట రైతు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు, కాంట్రాక్టర్లు తమ పంట నష్టపరిహారం చెల్లించాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఆ రైతుకు పంట నష్టపరిహారంతో పాటుగా రైతులకు కూడా నష్టం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు.

## నేడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విదార్థులకు వైద్యపరీక్షలు

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

నేడు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు కలాం ప్రకాశం క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు డొంకలోని నారాయణ సిఓ ఒలింపియాడ్ స్కూల్ నందు గల విద్యార్థులకు స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి, డాక్టర్ అశోక్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్ వారి సహకారంతో కంటి మరియు దంత పరీక్షలు నిర్వహించడం జరిగిందని క్లబ్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్, పాఠశాల ప్రిన్సిపల్ లయన్ సయ్యద్ నాగుర్ వలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలు విద్యతోపాటు, సేవా కార్యక్రమాల్లో కూడా ముందు వరుసలో ఉంటారని తెలిపారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని నారాయణ గ్రూప్ ఏజీఎం నర్రావుల పెద్దారెడ్డి ప్రారంభించగా స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి మరియు డాక్టర్ అశోక్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్ వారి సహకారంతో దాదాపు 510 మంది విద్యార్థినీ విద్యార్థులకు కంటి దంత సంబంధిత ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ లయన్ డాక్టర్ షాకీర్ సీనియర్ లయన్స్ సభ్యులు లయన్ మహంకాళి వెంకట శేషయ్య క్లబ్ సెక్రటరీ లయన్ డాక్టర్ మీరావాలి ట్రెజరర్ లయన్ దాసరి కరుణాకర్ సభ్యులు లయన్ మల్లికార్జున్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలని పారదర్శకంగా నిర్వహించాలి

- *ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి*
- *మార్చి 17 నుండి 31వరకు పది పరీక్షలు*
- *జిల్లాలో 103 కేంద్రాలు ఏర్పాటు*
- *హాజరు కానున్న 16361 మంది రెగ్యులర్; 438 ప్రైవేటు విద్యార్థులు*
- *పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు*

**చీరాల టౌన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని, ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌జేడీ బి.లింగేశ్వర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ ఎన్ కళాశాలలోని సమావేశ హాల్‌లో పరీక్ష కేంద్రాల చీఫ్‌లు డిపార్టుమెంటల్ అధికారులు రూట్ ఆఫీసర్లు, కస్టోడియన్లకు ఒక్క రోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మార్చి 17 నుండి 31 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పరీక్షలను



పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 17 నుండి 31వరకు 10వ తరగతి రెగ్యులర్ వారికి 17 నుండి మార్చి 28 వరకు ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు ఉదయం 9.30గంటల నుండి 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. రెగ్యులర్, ప్రైవేటు కలిపి జిల్లాలో 103 కేంద్రాల్లో 16361 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఈ పరీక్షలు కట్టుదిట్టంగా ఎక్కడా కాపీ జరగకుండా నిర్వహించాలని తెలిపారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను డిపార్టుమెంటల్ అధికారిని నియమించామని అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలను, నెట్ సెంటర్లను మూసి వేయాలని తెలిపారు. 10 రూట్‌లను ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, విద్యుత్ అధికారులకు, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత సిబ్బంది వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద, స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం వద్ద మెడికల్ క్యాంపులను నిర్వహించి అత్యవసర మందులను సిద్దం చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలన్నీ సెల్ ఫోన్ రహిత ప్రాంతాలుగా ప్రకటించామని చీఫ్‌తో సహా ఎవరి వద్ద సెల్ ఫోన్ ఉండడానికి వీలు లేదని అన్నారు. తగిన గుర్తింపు కార్డు లేకుండా ఎవ్వరు పరీక్షా కేంద్రాలలోకి అనుమతించబోరని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ఉప విద్యాశాఖ అధికారులుగంగాధరరావు, సురేష్, అసిస్టెంట్ కమీషనర్ ఫర్ ఎగ్జామ్స్ డి.ప్రసాదరావు, శ్రీనివాస్ చీరాల మండల విద్యాశాఖాధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రకాశం



వార్త తెలుగు జాతీయ దినపత్రిక

## నారాయణ సిఓ ఒలంపియాడ్ స్కూలు నందు ఉచిత కంటి, పంటి పరీక్షలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



స్థానిక లాయరుపేటలోని నారాయణ సీవో ఒలంపియాడ్ స్కూల్ నందు హ్యూమన్ రిసోర్స్ పర్సన్ కే. మస్తానయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి ఉచిత కంటి, పంటి పరీక్షలు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ నాగూర్ వలి మాట్లాడుతూ నారాయణ స్కూల్ యాజ మాన్యం



సిబ్బంది ఆరోగ్య భద్రత భరోసా అనే ప్రాతిపదిక సూత్రం పైన మెడికల్ ఇన్సూరెన్స్ వంటి వాటిని అందిస్తూ ఉద్యోగుల భద్రత పై అత్యంత శ్రద్ధ వహిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నారాయణ స్కూల్స్ ఏజియం నర్రావుల పెద్దిరెడ్డి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రకృతి సేధ్యాన్ని ప్రోత్సహించేలా మరింత దృష్టి పెట్టాలి

***- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా***

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకృతి సేధ్యాన్ని ప్రోత్సహించేలా మరింత దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. ఈ దిశగా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌కు కార్యాచరణ ప్రణాళికపై గురువారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్‌లో వ్యవసాయం, ఉద్యానవనం, ప్రకృతి సేద్యం, డీఆర్డీఏ అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మారిన జీవన శైలి వలన ఆరోగ్యం దెబ్బ తింటున్నదని, ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకురావడానికి ఆహారమే ఔషధంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా వచ్చిన ఉత్పత్తులే దీనికి ముఖ్య ప్రత్యామ్నాయమని ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో కూడా సౌభాగ్యం, ఆరోగ్యం సంతోష



కరమైన రాష్ట్రం ఆవిష్కరణ లక్ష్యంగా పేర్కొన్నట్లు తెలిపారు. తీసుకుంటున్న ఆహారంపై దృష్టి సారిస్తే మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోగలుగుతామని కలెక్టర్ చెప్పారు. ఆర్గానిక్ సేధ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు ఈ ఉత్పత్తులకు అవసరమైన మార్కెటింగ్ కూడా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాలపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సమావేశాలలో ప్రకృతి సేద్యం కూడా ఒక చర్చనీయాంశంగా చేర్చాలని అదికారులకు దిశానిర్ధేశం చేశారు. తక్కువ స్థలంలో పెరటి సాగు చేసుకోవడంపైనా అవగాహన కల్పించాలన్నారు. రైతులకు శాస్త్రవేత్తల ద్వారా సలహాలు ఇప్పించాలని, అదే విధంగా సాగులో పాటించాల్సిన మెలుకువలను మొబైల్ యాప్స్ ద్వారా తెలియజేయాలని చెప్పారు. కాగా, ఈ దిశగా తీసుకుంటున్న చర్యలను, జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) ద్వారా అందిస్తున్న సేవలను ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి వివరించారు. ఆర్గానిక్ సాగును, ఈ దిశగా తమ ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణ-అనుభవాలను, సాగు చేస్తున్న దేశవాళీ రకాలను పలువురు రైతులు కూడా ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపిచంద్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ఆయా శాఖల డీపీఎంలు, ఏవోలు, హెచ్ఓలు, ఏపీఎంలు పాల్గొన్నారు. ప్రకృతి సేద్యం పై అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

### పేరుకే పెద్ద మోడల్ స్కూల్..

## అయితే అక్కడన్నీ సమస్యలే



***- ఇబ్బందుల్లో విద్యార్థులు***

***- అసౌకర్యాలతో మోట్ల మల్లిఖార్జునపురం మోడల్ స్కూల్***

**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

పేరుకే పెద్ద మోడల్ స్కూల్.. అయితే అక్కడ పేరులోనే మోడల్.. వెళ్లి చూస్తే అన్ని అసౌకర్యాలే.. మంచినీటి వరకు ఇబ్బందులే.. మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నా లేనట్లే. వాటర్ ప్లాంట్ పనిచేయదు. ఈ స్కూల్లో పేరు పెన్నిది మోసే సమస్యలు రాజ్యమేలే అన్న చందంగా ఉంది. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వారి పిల్లలకు విద్యతో పాటు భోజన సౌకర్యాల కల్పనతో ప్రభుత్వం పాఠశాల, బాలికలకు వసతి గృహం ఏర్పాటు చేసింది. క్షేత్ర స్థాయిలో చూస్తే చుట్టు అసౌకర్యాలతో కొట్టుమోడల్ స్కూల్ మిట్టాడుతుంది. ఒక సమాజం ప్రగతి పథంలో పయనించాలంటే విద్యాభివృద్ధి ఎంతో కీలకం. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆకట్టుకునే విద్యా బోధనలతో పాఠశాలలు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఆలయాలుగా విలసిల్లినాడే ప్రగతి కుసుమాలు వికసించేది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌పై ఒకింత నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఆడ పిల్లల హాస్టల్ వద్ద కంప పెరిగి అడవిని తలపిస్తుంది. పెద్దదోర్నాల మండలం ఎగువచెర్లోపల్లికి వెళ్లే రహదారి పక్కన మోట్ల మల్లిఖార్జునపురం వద్ద ప్రభుత్వం





ఏపీ మోడల్ స్కూల్‌ను ఇంగ్లీష్ మీడియంతో ఏర్పాటు చేసింది. ఆరో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకునేందుకు అవకాశం ఉంది. పెద్దపెద్ద భవనాలతో స్కూల్‌మాత్రం నిర్మితమైంది. కానీ అక్కడ వారికి వంట చేసేందుకు వసతి లేదు. కనీసం రేకుల షెడ్డు లేదు. దీంతో ఆరు బయట ఒక చెట్టు కింద, అక్కడే గోడ పక్కన రాళ్లను పొయ్యి లాగా చేసి కట్టెలతో వంట చేస్తున్నారు. దీంతో ఆరు బయట వంట చేస్తుండటంతో గాలి ధూళికి బూడిద ఎగిసి పడి వంట వండేటప్పుడు అందులో పడుతుంది. అలాగే క్రిమి కీటకాలు కూడా గాలి దూళి వంట చేసేటప్పుడు అన్నం కూరల్లో పడతాయనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులకు రోగాలు ప్రభలే అవకాశం ఉంది. ఈ పాఠశాలకు కూరగాయాలు సరఫరాలేదు. వాస్త వానికి టెండర్ ద్వారా కూరగా యలు సప్లై చేయాలి. ఈ విషయమై ప్రిన్సిపాల్ ఆంజనేయులును వివరణ కోరగా కూరగాయాల సప్లైకి టెండర్ లేదని తెలిపారు. దీంతో ఏ రోజు కా రోజు కూరగాయలు నేనే తెస్తున్నానని తెలిపారు. తర్వాత కూరగాయాల వ్యక్తికి చెక్కు ఇస్తానన్నారు. ఇక కట్టెలతో వంట చేస్తున్నారు. మరి ప్రభుత్వం పాఠశాలలకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తుంది కదా..? గ్యాస్తఓ వంట చేయవచ్చు కదా వంట చెరుకును ఎందుకు ఉపయోగిస్తున్నారు అని అడిగితే ఏదైనా ఒకటే అని ప్రిన్సిపాల్ ఆంజనేయులు సమాధానం దాటవేశారు. ఏపీ మోడల్ స్కూల్‌కు కూరగాయాలు సప్లైచేసే టెండర్ లేదని దీంతో మండల కేంద్రమైన పెద్దదోర్నాల కూరగాయల మార్కెట్ నుండి కూరగాయాలు తెచ్చుకుంటానని ప్రిన్సిపాల్ చెప్పడం విడ్డూరంగా ఉంది. ఏ రోజు ఎన్ని కూరగాయాలు ఎంతకు తెస్తారో తెలియదు. కూరగాయాలు ఇచ్చిన వ్యక్తికి బిల్లు అమౌంట్ చెల్లిస్తారు. ఇందులో గిల్లుడు ఎంతో గుంజుడు ఎంతో దేవుడికే ఎరుక. ఇక బాలికల హాస్టల్లో, బాలుర స్కూల్లో మాత్రం మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదు. బోరువాటరే శరణ్యమైంది. నీళ్ల ట్యాంకులలో పాచిపట్టి ఉంటాయని ఇందులో క్రిములు చేరుతాయని విద్యార్థులు చెబుతున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురై ఎన్నో రోజులుగా మూలనపడ్డ పట్టించు కున్న నాధుడే లేడని విద్యార్థులు తెలిపారు. పైపుల్లో వచ్చే నీటిని కనీసం కాచి చల్లార్చి ఇస్తే రోగాలు శోకవనేది సామాన్యులకు తెలుసు. అధికారులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. బాలికల హాస్టల్ గ్రౌండ్ ఫ్లోర్లో మాత్రం బాత్ రూముల పైపులు ట్రక్ అయిపోయాయి. దీంతో అసౌకర్యంగా ఉందని బాలికలు తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోయింది. చేసేది లేక పైపులు నుండి వచ్చే బోరు నీళ్లు తాగుతున్నామని బాలికలు వాపోయారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ లక్ష్మీదేవిని వివరణ కోరగా వాటర్ ప్లాంట్ మరమ్మత్తులకు గురైందని, దీంతో బాలికలకు మినరల్ వాటర్ అందడం లేదని చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్లో పైపులు ట్రక్ అయ్యాయని వివరించారు. ఏదీ ఏమైనప్పటికి మోట్ల మల్లిఖార్జునపురం వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది.







గతంలో ఇక్కడ తనిఖీ చేసిన అధికారులు కూడా ఇక్కడమెనూ అమలు పరచడం లేదని, కూరగాయాల అన్నంలో కూరగాయల్లేవని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా నని రిమార్కులు కూడా రాశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏపీ మోడల్ స్కూల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి విద్యా కుసుమాలు విరాజిల్లేలా చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## గురువులపైనే బాలల భవిష్యత్తు, బాధ్యత

- *ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్సు తప్పనిసరి*
- *ప్రైవేటు పాఠశాలలో ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలి*
- *బాలల సంరక్షణకు సమన్వయంతో పని చేయాలి*
- *బాలల హక్కులను పరిరక్షించే బాధ్యత ఉపాధ్యాయులదే*
- *పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలి*





**ఒంగోలు, ప్రభాతవార్త**

నేటి బాలలే రేపటి పౌరులు, వారిని ప్రపంచానికి ముఖ్యమైన మానవ వనరులుగా తీర్చిదిద్ది మానవాళికి అందించే క్రమంలో బాలల హక్కులను పరిరక్షించే ప్రధాన భూమిక ఉపాధ్యాయులదేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. గురువారం నాడు ప్రకావం జిల్లా నందు జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ అధ్యక్షతన ఎన్టీఆర్ కళాపరిషత్, ఒంగోలు నందు జరిగిన జిల్లా స్థాయి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో బాలల హక్కులు పరిరక్షణ అమలు జరుగుతున్న తీరుపై రాష్ట్ర బాలల మక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు పద్మావతి సుమీక్ష సమావేశం నిర్వహించారు. పిల్లలపై మొబైల్ ప్రభావాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని ఈ సంద్భంగా ఆమె తెలిపారు. పిల్లలను ఒత్తిడి గురి చేయకుండా చదువుతో పాటు క్రీడలు నాయకత్వ లక్షణాలు సృజనాత్మకత పెంపొందించే విధంగా తయారు చేయాలన్నారు. మార్కుల విషయమే గాని మరి ఇతర విషయాల్లో పిల్లలను ఇతరులతో సరిపోల్చకుండా కేవలం వారి వ్యక్తిగత సామర్థ్యాలు మేరకు రాణించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. చిన్న వయసులోనే చదువుల ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పిల్లలను చూస్తున్నామని చదవంటే కేవలం డాక్టర్ ఇంజనీరు మాత్రమే కాదని ఇతర అనేక రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని చిన్న వయసులోనే పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా ప్రతి పాఠశాలలోనూ ప్రైవేటు పాఠశాలలో కూడా కంప్లైంట్ బాక్సులను కేవలం అలంకారప్రాయంగా కాకుండా పిల్లలందరికి తెలిసే విధంగా బహిరంగంగా ఉంచాలన్నారు. కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయడంపై ఉపాధ్యాయులు తప్పుగా భావించరాదని పిల్లల సమస్యలను వెలుగులోనికి తెచ్చే విధంగా వాటిని ఉపయోగించాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాల ప్రభావం మొబైల్ ప్రభావం పిల్లలపై అధికంగా ఉంటుందని, దానితో బాలికలపై అత్యాచారాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలోనూ తప్పనిసరిగా ప్రహరి క్లబ్స్ ఏర్పాటు చేయడమే కాకుండా ఆచరణాత్మకంగా దాన్ని అమలు పరచాలని తెలిపారు. బాల బాలికలకు ఇరువురికి గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మీద అవగాహన కల్పించాలని, ఫ్రెండ్లీ టీచర్ కాన్సెప్ట్ అభివృద్ధి చేయాలన్నారు. విధిగా ప్రతి నెల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని, ఆరోగ్య పరీక్షలను కూడా తప్పనిసరిగా జరిపించాలని తెలిపారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో యోగాను నేర్పించడం వంటివి కూడా మొదలు పెట్టాల్సిందిగా తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలని, ప్రతి పాఠశాలలో ఫిర్యాదు బాక్సులు ఉండాలని, పిల్లలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర బాలల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరత కూడా ఉందని సూచించారు. పిల్లల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబరు 1098,100,112 నెంబర్లు ప్రతి క్లాస్ రూమ్‌లో ఉండేలా చూడాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో యాజమాన్యాల స్థాయిలో ఫిర్యాదులు అందిన వెంటనే పరిష్కరించుకోవాలని, పరిష్కారం కానివి, పై అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి 25 శాతం సీట్లు కేటాయించారా లేదా అనే విషయాన్ని ప్రశ్నించి తగిన వివరాలు అందజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆహార విషయంలో మధ్యాహ్నా భోజన పథకం కింద పౌష్టికాహారం ఉండే విధంగా చూడాలని తాగునీరు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నా భోజన పథకంలో కొట్టివేతలు, దిద్దివేతలు ఉండకుండా సరైన విధంగా రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలో, హాస్టల్స్‌లో ఉండే పిల్లలకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట విష కీటకాలు సంచారం ఉన్న ప్రదేశాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా, జంగిల్ క్లియరెన్స్ జరిగేలా చూడాలని ఆదేశించారు. రానున్న నెల రోజుల లోపల ఫీజుల వివరాలుతెలిపే విధంగా నోటీసు బోర్డులు బహిరంగంగా ప్రదర్శించాలని నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. 10వ తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే పిల్లలకు హాల్ టికెట్లు నిర్ణీత సమయంలో అందజేయాలని ఆదేశించారు. బాలల సంక్షేమ మండలి సభ్యురాలు నీలిమ, వంశీలత, ఐసీడీఎస్ పీడీ హేమ సుజన్, బాలల సంరక్షణ విభాగ అధికారి దినేష్ కుమార్, మండల విద్యాధికారులు, రెసిడెన్షిల్, కస్తూరిభాగాంధీ, బీసీ గురుకుల హెచ్‌యంలు, ప్రైవేటు పాఠశాలల హెచ్‌యంలు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతే జీవన ప్రమాణాలకు నాంది

## - లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ బాబు



**మద్దిపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
ఆర్థిక అక్షరాస్యతే జీవన ప్రమాణాలకు నాంది పలుకవచ్చని లీడ్ బ్యాంకు మేనేజర్ డి.రమేష్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భద్రత డిజిటల్ బ్యాంకింగ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి ఖాతాలను సురక్షితంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హోటల్ పెన్షన్ యోజన సుకన్య సమృద్ధి యోజన సురక్ష యోజన జీవన్ జ్యోతి యోజన కార్యక్రమాలపై ప్రతి ఒక్క ఖాతాదారుడు తెలుసుకోవాలన్నారు. ఈ శ్రమ కార్డు అబా కార్డు వంటి పథకాల గురించి తెలుసుకొని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మద్దిపాడు కెనరా బ్యాంకు మేనేజర్ వి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు. తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు డ్వాక్రా గ్రూపు రుణాలు నాలుగు కోట్ల రూపాయలుపైన అందజేసినట్లు తెలిపారు. స్టేట్ కోఆర్డినేటర్ కే.అశోక్ మాట్లాడుతూ వ్యాపారస్తులకు కెనరా బ్యాంకు పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులు అధిక మొత్తంలో డిపాజిట్లు చేయాలని ఆయన కోరారు. డిస్ట్రిక్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్, ఎస్.అమృతరాజ్, వీవోఏ శ్రీదేవి, కెనరా బ్యాంకు సిబ్బంది, రైతులు మహిళలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ పూర్తి



**మద్దిపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
అంగన్‌వాడీ వర్కర్లకు ఏర్పాటు చేసిన జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికేట్ కోర్సు శిక్షణా కార్యక్మమం మొదటి విడత శుక్రవారంతో ముగిసింది. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు అందరూ పాల్గొన్నారు. మండలంలోని 60 మంది అంగన్‌వాడీ వర్కర్లు రెండు బ్యాచ్‌లుగా గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు 0 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలను ఎలా అర్థం చేసుకోవాలి, బాల్యారంభ సంరక్షణ, విద్య, ఇటీవల భారత దేశంలో విద్యా విధానంలో పాలసీలు, పిల్లల స్వభావం లక్షణాలు, మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపే అంశాలు సమగ్ర అభివృద్ధిపై ఈ శిక్షణలో అంగన్‌వాడీ వర్కర్లకు తెలియజేశారు. ఇటువంటి అంశాలపై అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి పరిశీలించిన అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్ అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలకు సృజనాత్మకత జోడించి చిన్నారులకు చక్కటి విద్యను అందించాలని ఆయన కోరారు. రెండో విడతశిక్షణ కార్యక్రమం త్వరలో జరుగుతుందని ఆయన అంగన్‌వాడీ వర్కర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, డీఆర్పీలు, ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

# రైతులు విధిగా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి



**తాళ్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
ప్రతి రైతు విశిష్ట సంఖ్యను విధిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని దోసకాయల పాడు, తోట వెంగన్నపాలెం గ్రామాల్లో గురువారం ఫార్మర్ రిజిస్టర్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాష్ట్రంలోని భూమి కలిగిన ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం అవుతాయన్నారు. కావున ప్రతి రైతు తమ ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, సెల్ ఫోన్ తీసుకుని మీమీ పరిదిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

# దశదినకర్మకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు



**పొన్నలూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
జడ్పీటీసీ సభ్యులు బెజవాడ వెంకటేశ్వర్లు తొలి బెజవాడ లక్ష్మమ్మ దశదినకర్మకు వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు కొండపి సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైసీపీ కొండపి మాజీ సమన్వయకర్త మాదాసి వెంకయ్య, నియోజకవర్గ సీనియర్ నాయకులు అశోక్ కుమార్‌రెడ్డి హాజరై లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జడ్పీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. దశదినకర్మ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని లక్ష్మమ్మకు నివాళులర్పించారు.

# వైసీపీ కార్యకర్తని పరామర్శించిన మాజీ మంత్రి సురేష్



**పొన్నలూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
మండలంలోని చౌటపాలెం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన శ్యాంసన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వైసీపీ కొండపి మాజీ సమన్వయకర్త మాదాసి వెంకయ్యతో కలిసి వైసీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. శ్యాంసన్ ఆరోగ్య పరిస్థితి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మండల వైసీపీ నాయకులు, పెరిదేపిపాలెం మాజీ సర్పంచ్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, చౌటపాలెం సర్పంచ్ అనుముల ప్రసాద్ కలిసి శ్యాంసన్ వైద్య ఖర్చులకు రూ.15వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో చౌటపాలెం ఎంపీటీసీ సభ్యుడు కాట్లగడ్డ నర్సింగరావు, జిల్లా వైసీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం చిన్న వెంకటేశ్వర్లు, జిల్లా వైసీపీ కార్యవరణ కార్యదర్శి కాట మాధవరావు, వైసీపీ కొండపి నియోజకవర్గం లీగల్ సెల్ కన్వీనర్ ధారా మాధవరావు పాల్గొన్నారు.

# అక్రమ లేఅవుట్లను అడ్డుకోకపోతే సెక్రటరీపై చర్యలు తప్పవు



**కొండపి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**
కొండపి మండలంలోని పంచాయతీలలో వ్యవసాయ భూమిలో అక్రమ లేఅవుట్లను అడ్డుకోకపోతే పంచాయితీ కార్యదర్శులు, పంచాయితీ అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ పి మురళి తెలిపారు. గురువారం కొండపి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం వైస్ ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కొండపి మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూములలో అక్రమంగా లే అవుట్లు వేసి అమ్ముకుంటూ జరుపుతున్న కారణంగా పలు రకాల వివాదాలు తమ దృష్టికి వచ్చాయని అన్నారు. ఇకనుంచి వ్యవసాయ భూములలో లే అవుట్లు నిర్మించేందుకు పంచాయితీ అనుమతులు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గతంలో అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లపై విచారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అసైన్మెంట్ భూములను క్రమబద్ధీకరించేందుకు జీవో నెంబరు 30ను ప్రవేశపెట్టిందని ఈ జీవో ద్వారా 2019 అక్టోబర్ 15నాటికి అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములను ఆయా అనుభవదారులకు రెవెన్యూ పరమైన హక్కులు కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 299 అర్జీలు రాగా అందులో 36 ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా ఈనెల ఆఖరులోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. 0నుండి 5సంవత్సరాలలోపు గల పిల్లలకు ఆధార్ తీయడం జరుగుతుందని అంగన్వాడీ సూపర్ వైజర్ తెలిపారు.

**పారిశుధ్య సమస్యలపై పంచాయితీ కార్యదర్శులు దృష్టిసారించాలి : ఎంపిడిఓ రామాంజనేయులు**
మండలంలో అన్ని పంచాయితీలలో పారిశుధ్య లోపాలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ప్రతి పంచాయితీ కార్యదర్శి వారికి రెండు రోజుల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎంపిడిఓ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా పెదకండ్లగుంట ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదని రాత్రివేళ తిరగాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే పంచాయితీ వారు తక్షణమే వీధిలైట్లపై దృష్టిసారించాలని ఎంపిడిఓ తెలిపారు. ఈ సందర్భంగా అన్ని శాఖాధికారులు వారి పరిధిలోని సంబంధిత పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కోటరాజు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో సునీల్ ప్రైమరీ స్కూల్ నందు గురువారం జరిగిన మహారాజ్ శివాజీ జయంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు దాత టీడీపీ నేత, నాయి బ్రాహ్మణ సాధికారక కమిటీ కన్వీనర్ డాక్టర్ కరేటి నరసింహారావు ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ బాపట్ల పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. బీసీ వర్గాల అభ్యున్నతకు మహారాజ్ శివాజీ ఎంతగానో పాటుపడ్డారని మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు తన ప్రసంగంలో పేర్కొన్నారు. విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేసిన దాత డాక్టర్ కరేటి నరసింహారావును ఈ సందర్భంగా టీడీపీ నేత తన్నీరు శ్రీనివాసరావు తదితరులు అభినందించారు. మహారాజ్ శివాజీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుంచాల ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయురాలు గుంటూరు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన నియోజకవర్గ నేత బాబుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో గురువారం నాడు సంతనూతలపాడు నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త కందుకూరు వెంకటేశ్వరరావు అలియాస్‌బాబు జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగాగ్రామంలో జరిగిన కార్యక్రమంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జనసేన నేత బాబుకు శుభాకాంక్షలు తెలిపి కేక్ తినిపించారు. జనసేనపార్టీ అభిమానులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సమక్షంలో జనసేన నేత కందుకూరిబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్, మాజీ కౌన్సిలర్ పగిడి రాములు, మాజీ ఎంపీపీ వివరం గోవిందు, నగర కార్యదర్శి కందుకూరు వాసు, 41వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీనివాసు, జనసేన పార్టీ నాయకులు కందుకూరి ఆంజనేయులు, తిరుమలశెట్టి రాము, చల్లాకృష్ణ, ఆకుల శివ, కందుకూరి నరేంద్ర, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని బాబుని అభినందించిన వారిలో ఉన్నారు.

# 23న జిల్లా స్థాయి సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక

**సంతనూతలపాడు,ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల 23న డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్ ఒంగోలు నందు సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక జరగనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ రమణారెడ్డి, ఏ.సుందరరామిరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం తీసుకొని ఉదయం 9గంటలకు రావాల్సిందిగా కోరారు. ఈ ఎంపికలకు వచ్చే వారు 1-01-1991 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు టి.రవికుమార్ 9666067764ను సంప్రదించాలని కోరారు.

# వడదెబ్బతో మృతి చెందిన సుబ్బారావుకు ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం గుమ్మలపాడు గ్రామంలో వడదెబ్బతో మృతి చెందిన టీడీపీ నేత నెప్పల సుబ్బారావుకు గురువారం నాడు సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఆయన మృతదేహాన్ని గ్రామంలో సందర్శించి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు బొమ్మినేని రామాంజనేయులు, చంద్రపాలెం సర్పంచ్ బొడ్డు రామారావు, మాజీ సర్పంచ్‌లు రంపతోటి అంకారావు, బొమ్మినేని సుబ్బారావు, నెప్పలి కనకయ్యలు గ్రామ టీడీపీ అధ్యక్షులు మొలకలపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు మద్దినేని చైతన్య, బొడ్డు సుబ్బారావు, బొడ్డపాటి వెంకటరామయ్య, నలుమోతు శ్రీనివాసరావు, పాతూరి రాంబాబు, ఈదర విష్ణువర్ధన్ తదితరులు పాల్గొని సుబ్బారావుకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వలేటి రామదాసు చిత్రపటానికి ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ రాందాస్ కుమారుడు తిరుపతి స్వామికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మండలంలోని కొనగానివారిపాలెం గ్రామంలో చుండూరి వెంకయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వెయ్యాలి

## - జ్ఞాన జ్యోతి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హెనా సుజన్



**సింగరాయకొండ, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**
కార్యకర్తలందరూ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేన సుజన్ సూచించారు .గురువారం మండలంలో ని బాలికల ఉన్నత పాఠశాల నందు అంగన్వాడి కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణా శిబిరాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, సీడీపీఓ మల్లీశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య 3 నుంచి 5 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు ఎంతో కీలకమైనదని ఈ దశలోనే విద్యార్థుల శారీరక, మానసిక, భాష, మేదస్సులలో అభివృద్ధి అధికంగా జరుగుతుందని అన్నారు .అనంతరం శిక్షణలో కార్యకర్తలు తయారుచేసిన అభ్యసన సామాగ్రి మేళా సందర్శించారు. శిక్షణా ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా రిసోర్స్ పర్సన్స్ అగ్రిబోయిన రాంబాబు, రిజ్వానా, కీర్తి శ్రీనివాసరావు, సైదాబీ లను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ లు, 62మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే అన్నా!



**రాచర్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన బచ్చి గారి రమాదేవి నాగేశ్వరరావు దంపతుల కుమార్తె స్వప్న వివాహం రంగప్రసాద్ తో గురువారం జరిగింది ఈ వివాహ కార్యక్రమానికి గిద్దలూరు మాజీ శాసనసభ్యులు మార్కాపురం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమానికి విచ్చేసిన రాంబాబుకు రమాదేవి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో పాటు స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆత్మీయ స్వాగతం పలికారు అనంతరం వారు ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో ఆయన పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బచ్చిగారి శేఖర్ కనుమర్లపూడి గోపి అనుములపల్లి సర్పంచ్ సిరిగిరి రమేష్ ఉలాపు లింగన్న పుల్లారెడ్డి కేశాలు నిబ్బరగండ్ల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అడవిని నమ్మి బతికే వాళ్ళం


## - ఆర్ఓ ఎఫ్ఆర్ కింద భూములు ఇవ్వండి

## - మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్‌కు విన్నవించుకున్న ఎస్టీలు



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
తరతరాల నుండి అడవిలోనే జీవనం సాగించాము. ఆవులు, గొర్రెలు, మేకలు కాసుకొని బతుకుతున్నాం. 1972లో పెచ్చెరువు నుండి బోడే నాయక్ తండాకు వచ్చి నివాసముంటున్నామని అయితే మాకున్న గొర్రెలు, మేకలు ఆవులను అడువలలో మేపుకోకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, మా పశువులను అడవులో మేపుకోనియ్యకపోతే ఎడవల్లి బీట్ పరిధిలో చెరువు కింద భూములను ఆర్ఓఎఫ్ ఆర్ కింద పట్టాలివ్వాలని గురువారం బోడేనాయక్ తాండకు విచ్చేసిన మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌కు లంబాడి గిరిజనులు వినతిపత్రం అందజేశారు. అక్కడి గిరిజనుల సమస్యలను సబ్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ తో పాటు దోర్నాల అటవీశాఖ రేంజ్ అధికారి జీవన్, మండల తహశీల్దార్ కిన్నెర శాంతి, ఎస్సై వెలగా మహేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వెంటాడుతున్న పులి చావు భయం




**యర్రగొండపాలెంరూరల్, ఫిబ్రవరి 20 ,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మండలంలోని అటవీ గ్రామాల ప్రజలను పులి భయం వెంటాడుతుంది. ముఖ్యంగా అటవీకి దగ్గరలో ఉన్న గంజివారిపల్లె, జంగంవారిపల్లె, కొలుకుల గ్రామాల ప్రజలు భయం గుప్పిటలో కాలం వెల్లదీస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు పులి భయం ఉన్నప్పటికీ అటవీశాఖాధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు తప్ప ఎటువంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. కొన్ని గ్రామాలలో పులి కనిపించిందని రైతులు ఫిర్యాదులు చేసినా కంటితుడుపు చర్యలుగా అటవీ అధికారులు ఆ పరిసరాలలో తిరిగి అక్కడి గుర్తులు పులి అడుగులు కాదు, అడవి పిల్లి అడుగులంటూ చెబుతుండటం తరచు వారినుంచి వినిపిస్తున్న మాటలు. గతంలో గంజివారిపల్లె పొలంలో పులి తిరుగాడుతుందని నెలలతరబడి పులి సంచారంతో రైతులు, వ్యవసాయ కూలీలు అడవిపై ఆధారపడి జీవించే చిరు కూలీలు, రహదారులపై వెళ్ళే వాహనదారులు పులి భయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించిన ఘటన మరువకముందే ఇలా గంజివారిపల్లె నుంచి కొలుకులకు వెళ్ళే ప్రధాన రహదారి దగ్గరలో చిరుత పులి ఇలా వేటగాళ్ళ ఉచ్చులకు చిక్కి మరణించడంతో రెండుగ్రామాల జనం భయపడుతున్నారు. నిత్యం బాటసారులు సంచరించే రహదారి ప్రక్కనే చిరుత తిరగాడుతూ మరణించిందా ? ఇన్నిరోజులు ఆ రహదారి మీదుగానే తిరిగామా అనే ఆలోచన వారిని భయం గొలుపుతుంది.

**వన్యప్రాణుల సంరక్షణలో అటవీశాఖ అధికారులు విఫలం :**
గ్రామాల్లో అటవీశాఖకు సంబంధించిన అడవి సంరక్షకులు ఉన్నప్పటికీ అడవులలో ఉచ్చులు వేసి వన్యప్రాణులను వేటాడే వేటగాళ్ళను పసిగట్టడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారు. జంతువుల కదలికలు నమోదు చేసేందుకు సరైన ప్రణాళికలు రచించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో జంతుజలాల మాంసానికి అలవాటుపడిన కొంతమంది వేటగాళ్ళు విచ్చలవిడిగా వన్యప్రాణులను వేటాడి చంపుతున్నారు. వీరి ఆగడాలను గుర్తించడంలో, చర్యలు గైకొనడంలో అటవీశాఖ పూర్తిగా విఫలం చెందుతుంది. ఆయితే నల్లమల అటవీప్రాంతపు గ్రామాల దాపులలో చిరుత పులి మరణం సంచలనంగా మారింది. అప్రమత్తమైన అటవీఅధికారులు అడవిలో జంతుజలాలను వేటాడే వేటగాళ్ళకోసం అటవీశాఖ అధికారులు అన్వేషణ మొదలు పెట్టాము అని చెబుతున్నారు. గంజివారిపల్లె పరిసరాలతోపాటు నల్లమల అటవీ దగ్గరి గ్రామాలలో తరచూ పులి సంచారంతో పాటు వెలుగు గొడ్ల దాడులు వెలుగులోకి వస్తుంది. యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో పలు అటవీ సమీప గ్రామాలలో ఇవి నిత్యకృత్యంగా మారింది. ఏదైనా దాడులు జరిగి ప్రాణాపాయం జరిగితే తప్పా అటవీశ్శాఖ అధికారులు స్పందించే పరిస్థితి గోచరించడం లేదు. అసలు కొలుకుల పరిసరాల అటవీ ప్రాంతంలో చిరుత పులి కలియ తిరుగుతున్నా విషయాన్ని చిరుత చనిపోయేంత వరకు కనిపెట్టలేకపోయారంటే అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లంగా గోచరిస్తాఉంది. పులి పాదముద్రలను గుర్తించి అటవీలో ఎటునుంచి ఎటు తిరుగుతుంది అనే అంచనాలు కనుగొంటామని చెబుతున్నా అటవీశాఖ నిండు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు గ్రామాల్లో వినిపిస్తుంది. సంబంధిత బీటు వాచర్లు, గార్డులు, ఫారెస్టులు తమ బీటు పరిధిలో నివాసం ఉండకుండగా పట్టణాలలో నివాసం ఏర్పాటు చేసుకొని చుట్టపుచూపుగా అటవీ బీటులకు వస్తున్నారని అక్కడి ప్రజలు తెలుపుతున్నారు. భయం గుప్పిటలో ప్రజలు జీవనం సాగిస్తుంటే పులికి హాని తలపెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జరీ చేస్తుండటం పుండుమీద కారం జల్లిన విధంగా అటవీశాఖ తీరు ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

**వన్యప్రాణులకు విలువ లేదా : ఎమ్మెల్యే తాటిపర్తి**
కొలుకుల చిరుత మరణంపై యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ డిప్యూటీ సిఎం మరియు అటవీశాఖ మంత్రి ఆయన పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశిస్తూ గురువారం ట్వీట్ చేశారు. యర్రగొండపాలెం పరిధిలో ఇటీవల వేటగాళ్ళ ఉచ్చులో పడి చిరుత మృతిచెందడంపట్ల ఎమ్మెల్యే స్పందిస్తూ మా నియోజకవర్గ పరిధిలోని వన్యప్రాణులకు విలువ లేదా ? వన్యప్రాణుల స్మగ్లింగ్ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశిస్తూ ట్వీట్ చేశారు.

# 9 మద్యం బాటిళ్ళు స్వాధీనం



**గిద్దలూరు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**
అనధికారికంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తి నుండి 9 మద్యం బాటిళ్ళను గిద్దలూరు ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. మండలంలోని కృష్ణంశెట్టిపల్లి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద అనధికారికంగా ఉన్న 9 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సిఐ జయరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాహనాల రద్దీ కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకూడదు

## - కంభం సిఐ మల్లిఖార్జున్



**కంభం రూరల్, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**
వాహనాల రద్దీ కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు కలుగకూడదని కంభం సిఐ మల్లిఖార్జున్, ఎస్సై బి నరసింహారావు, పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పాలుగుళ్ళ రమేష్ రెడ్డిలు అన్నారు. కంభం పట్టణంలో పెరిగిన ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా వారు గురువారం కంభం బస్టాండ్ సెంటర్ నుండి బేస్తవారిపేట వైపు పంచాయితీ మార్జిన్ వరకు రోడ్డుకు రెండు వైపులా మార్కింగ్ ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంభం పట్టణంలోని అన్ని రోడ్లకు ఈ మార్కింగ్‌ను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు, వాహనదారులు పోలీసువారికి, పంచాయితీ వారికి సహకరించి ఎవ్వరూ కూడా మార్కింగ్ లోపల మీ వాహనాలను పార్కింగ్ చేయరాదని అలా చేసిన యెడల మీ వాహనాలపై జరిమానా విధించి కేసులు నమోదు చేయడం జరుగుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలి

## - ఎంపీపీ గాయం సావిత్రి



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు అధ్యక్షతన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో రివ్వూ్య మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ గాయం సావిత్రి పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, రోజు వారి సగటు వేతనం రూ.280లు తగ్గకుండా మార్కింగ్ ఇచ్చి పని చేయించడం, అలాగే క్యాటిల్ షెడ్ పనులను, సోక్ ఫిట్స్‌ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు నిర్వహించిన కమిటీ మీటింగ్లో పాల్గొని ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో డాక్టర్ సందీప్ కుమార్, డాక్టర్ లక్ష్మి భార్గవి, ఏపీవో వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

## - ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కోసం బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు గురువారం తహశీల్దార్ ఏ.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. పశ్చిమ ప్రకాశం వర ప్రసాదిని అయిన వెలుగొండ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. 2వ టన్నెల్ నిర్మాణం, నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లింపు, టన్నెల్స్ నుండి నీటిని తరలించే ఫీడర్ కాలువ మరమ్మత్తులు మొదలగు పనులకు నిధులు సరిపడా కేటాయించకపోవడంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో 2 వేల కోట్లు కేటాయించి దుర్భిక్ష ప్రాంతాన్ని ఆదుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బూరి వెంకటేశ్వర్లు, నాయకులు పి.బాలనరసయ్య, ఏ.శ్రీనివాసులు, శేఖర్, ఏసేబు, తదితరులు ఉన్నారు.

# వీఆర్వో అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



**తాళ్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ 2025 డైరీని తహశీల్దార్ జే.ఇమ్మానేయులు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం ఒంగోలు డివిజన్ అధ్యక్షుడు పి.చంద్రశేఖరరావు, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఆర్ఐ అనూష, వీఆర్వోలు చిన్ని కృష్ణ, నాగలక్ష్మి, నాగూర్ బి, రమణ, జూనియర్ అసిస్టెంట్ రియాజ్ పాల్గొన్నారు.

# దొనకొండ అభివృద్ధికి వెలుగొండ ప్రాజెక్టే శరణ్యం

## - రాష్ట్ర బడ్జెట్‌లో 2 వేల కోట్లు కేటాయించాలి

## - పనులు పూర్తిచేసి సాగునీరు విడుదల చేయాలి

## - తహాశీల్దార్ ఆఫీసు వద్ద రైతుసంఘం ధర్నా



**దొనకొండ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**
దొనకొండ మండల అభివృద్ధి కావడానికి వెలుగొండ ప్రాజెక్టు శరణ్యం అని రైతు సంఘం జిల్లా నాయకులు తాండవ రంగారావు అన్నారు. ఈరోజు దొనకొండ తహాశీల్దార్ ఆఫీసు వద్ద జరిగిన ధర్నాకి రైతు నాయకులు కర్నాటి వెంకటరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వెనుక బడిన పశ్చిమ ప్రకాశం జిల్లా ఆశా జ్యోతి అయిన శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు కి ఈసంవత్సరం ప్రవేశ పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్ లో 2 వేల కోట్లు కేటాయించి , మొదటి టన్నెల్ ద్వారా నీరు విడుదల చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. దొనకొండ మండలంలో భూగర్భ జలాలు 400 నుంచి 700 అడుగుల లోతులో ఉండటం వలన కరువు విలయతాండవం చేస్తుందని , నిత్యం ప్రజలు వలసలు పోతేనే తిండి లేకపోతే పస్తులతో అలమట్టించడం జరుగుతుందని వెలుగొండ నీరు రావడం వలనే దొనకొండ అభివృద్ధి చెందుతుందని, వైసిపి,తెలుగుదేశం పార్టీలు ఓట్లు కోసం మాయమాటలు చెప్పడం తప్ప వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి చిత్తశుద్ధితో పనిచేయడం లేదని అవేధన వ్యక్తం చేశారు. ప్రజలు కదలి ఆందోళనలు చేయడం వలన ద్వారానే వెలుగొండ పూర్తి ఆవుతుందని రైతు సంఘం పోరాట కార్యక్రమాన్ని సిద్ధం చేసి ప్రాజెక్టు పూర్తి చేసి, నీరు విడుదల చేసేవరకు పోరాడుతుందని తెలిపారు. సిపియం దొనకొండ మండల నాయకులు చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ దొనకొండ 19 గ్రామాలలోని 17,000 ఎకరాల సాగుభూమికి పారుదల వెలుగొండ ప్రాజెక్టు డిజైన్ లో ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడ్డ దొనకొండ ప్రాంతాని సాగు,తాగు నీరు రావడం , భూగర్భ జలాలు పెరగడం జరుగుతుందని , దొనకొండ పారిశ్రామిక కారిడార్ కి కూడా నీరు అందించ వచ్చునని ఇంజనీర్లు తెలుపుచున్నారని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం ఈ ప్రాజెక్టు వలన ప్రజలకు కలుగుతుందని ఈ లాంటి ప్రాజెక్టు శంకుస్థాపన చేసి 30 సంవత్సరాలు అయినా వైసిపి,తెలుగుదేశం, కాంగ్రీసు పార్టీలు నిధులు కేటాయించడం పూర్తి చేయలేదని విమర్శించారు .ఇప్పటికైన తెలుగుదేశం ప్రభుత్వం స్పందించి ఈ బడ్జెట్ లో 2 వేల కోట్లు నిధులు కేటాయించి పూర్తి చేయాలని, లేకపోతే ఛలో అసెంబ్లీ పిలుపుఇచ్చి పోరాడతామని హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో రైతులు బోరెడ్డి వెంకటరామిరెడ్డి,మల్లవరపు బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు,జి.వీరరాజు,ఎగ్గోని కోటేశ్వరరావు,ప్రభుదాసు, బొరిగొర్లతిరపతయ్య,త్రిపరయ్య, ప్రభాకర రావు,పురుషోత్తమకాశయ్య,మేకల నరశింహారావు పాల్గొన్నారు.

# వి వి పురంలో బోరింగ్ పంపు మరమ్మత్తులు




**దొనకొండ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**
వచ్చేది ఎండాకాలం అని దృష్టిలో ఉంచుకొని నీళ్లకి ఇబ్బంది అవుతుందని మస్తాన్ ఆధ్వర్యంలో దొనకొండ వి వి పురంలో చేతిపంపు బోరింగ్ నీళ్లు రాక ఇబ్బంది ఉండటంతో ఈరోజు బోరింగ్ బాగు చేయించి విధి ప్రజలకి నీళ్ళు అందించడం జరిగింది వి వి పురంలో ఉన్నటువంటి మిగతా 5 బోరింగ్ లు కూడా చెక్ చేసి నీళ్ళు అందించడం జరిగినది ఎవరికి నీళ్ళకి ఇబ్బంది రాకూడదని ఈరోజు చేతిపంపు బోర్లను బాగు చేయించడం జరిగినది.ఈ కార్యక్రమంలో అన్వర్ వి వి పురం తెలుగు యువత మలపోలు చెన్నయ్య రాయన కోటేశ్వరరావుచెన్నారావు వెంకటేశ్వర్లు శివ పాల్గొన్నారు

# శివరాత్రి వేడుకలకు వ్యాఖ్యాతగా పొన్నూరు



**ఒంగోలు ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త**
శ్రీశైలం దేవస్థానంలో జరిగే శివరాత్రి వేడుకలకు వ్యాఖ్యాతగా పొన్నూరు శ్రీనివాసులుకు ఆహ్వానం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవస్థానం లో ఈనెల 26వ తేదీ జరిగే మహాశివరాత్రి వేడుకలకు తనకు వ్యాఖ్యాతగా అవకాశం లభించినట్లు ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు తెలిపారు. మహాశివరాత్రి రోజు లింగోద్భవ సమయంలో స్వామి వారికి జరిగే పాగాలంకరణ మహోత్సవానికి తాను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా శివరాత్రి నాడు జరిగే పాగాలంకరణకు తాను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నానని అన్నారు. మూడవసారి కూడా తనకు వ్యాఖ్యాతగా అవకాశం కల్పించిన శ్రీశైల దేవస్థానం వారికి తన కృతజ్ఞతలు తెలిపారు. శైవ క్షేత్రాలలో ఎక్కడా లేని పాగాలంకరణ మహోత్సవం శ్రీశైల దేవస్థానంలో ప్రత్యేకతను సంతరించుకుందని అన్నారు. జన్మలో ఒక్కసారైనా శ్రీశైల దేవస్థానంలో జరిగే పాగాలంకరణ మహోత్సవాన్ని ప్రతి ఒక్క భక్తుడు వీక్షించి తరించాలని కోరారు.ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా అటు సాహిత్య రంగంలో విశేషమైన కృషి చేస్తూ ఆధ్యాత్మిక రంగంలో ప్రకాశం జిల్లాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చి ఈ ఉద్యమంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో జరిగిన రథసప్తమి వేడుకలలో తిరుపతిలోని గోవిందరాజస్వామి దేవస్థానం ఐదు వాహన సేవలకు వ్యాఖ్యాతగా వ్యవహరించి, ప్రస్తుతం శ్రీశైల దేవస్థానంలో జరిగే శివరాత్రి వేడుకలలో మూడవసారి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తు జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న స్వర్గకవిత గ్రహీత పొన్నూరు వేంకట శ్రీనివాసులును ప్రకాశం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, ప్రముఖ కవులు పాలూరి శివప్రసాద్, కె.ఎస్.వి. ప్రసాద్, షేక్ మహబూబ్ జాన్, గాయకులు ఐ.మురళీకృష్ణ, కల్లగుంట కృష్ణయ్య,ఆధ్యాత్మిక ఉపన్యాసకులు నెమ్మని సీతారామయ్య, చిలకపాటిరంగారావు, తదితరులు అభినందించారు.

## కేవలం విద్య మాత్రమే అల్పవర్గాల అభివృద్ధికి రాచబాట : దేవలూటి శంకర్



**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20 ,ప్రభాతవార్త**
రజక విద్యాసేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు దేవలూటి శంకర్ తన జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం, శనివారం పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు రోజులపాటు అందుబాటులో ఉండనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద కుటుంబాలు అభివృద్ధి చెందాలంటే కేవలం విద్య ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుందని తెలిపారు. దానిని దృష్టిలో పెట్టుకుని నిరుపేద రజక విద్యార్థులకు ఉన్నత విద్యకోసం ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందన్నారు. రజక విద్యార్థులు, తల్లిదండ్రులు లేని విద్యార్థుల వారి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు వివిధ రజక సంఘాల నాయకులు,ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులు కలవాలనుకునే వారు తనను సంప్రదించవచ్చునని తెలిపారు. ఆయనతో ప్రత్యక్షంగా మాట్లాడదలచినవారు చరవాణి 8096646072, 6304330529 నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# సబ్సిడీ రుణాల దరఖాస్తుల పరిశీలన



**తాళ్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ సబ్సిడీ పథకాల రుణాల దరఖాస్తులను ఎంపీడీఓ దారా హనుమంతరావు ఆధ్వర్యంలోబ్యాంకు,సచివాలయ సిబ్బంది పరిశీలించారు. మొత్తం 436 మంది దరఖాస్తు చేసుకోగా380 దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తాళ్లూరు కెనరాబ్యాంకు మేనేజర్ ధర్మ సాయి,తూర్పు గంగవరం యూనియన్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున, బొద్దికూరపాడు ఏపీజీవీ మేనేజర్నారాయణ,ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందిరాజేంద్ర,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య సంరక్షణ విద్యపై శిక్షణ



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి20,ప్రభాతవార్త**
య ర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్వాడీ కార్యకర్తలకు మూడవ రోజు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.సూపర్వైజర్ ఎ.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ట్రైనింగ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాల గురించి వివరిస్తూ పిల్లల్లో ప్రారంభించు ప్రారంభ సంవత్సరాలలో మెదడు అభివృద్ధి మరియు అభ్యసన సమ అభివృద్ధి పిల్లలకు అనుకూలమైన ఆసక్తిని కలిగించే అభ్యాసనం సామాగ్రి రూపకల్పన పాఠశాల సంసిద్ధతను వివరించారు.అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలకు 120రోజుల జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా పిల్లలకు విద్యను ఎలా బోధించాలి,వారి మానసిక వికాసం అభివృద్ధి చెందే విధంగా ఆటలు పాటలతో కూడిన విద్యను తరగతి గదులలో ప్రదర్శించాలన్నారు.పిల్లల చేత సంఖ్య జ్ఞానం సృజనాత్మకత అంశాలపై కార్యక్రమాన్ని ప్రదర్శింపచేయాలన్నారు.ఆర్పీలు, లక్ష్మీనారాయణ, మల్లికార్జునరెడ్డి, సూపర్వైజర్లు ఎ.పద్మజ,సుజాత,సిఆర్పిఎంటిలు,మూర్తి,దుర్గారావు, కోటేశ్వరరావు యల్లయ్య, ఉపాధ్యాయులు వినయ్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో 442వ రక్తదానం



**అద్దంకి , ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
రక్తహీనత సమస్యతో బాధపడుతున్న చక్రాయపాలెం నివాసి ముట్లూరి తిరుపాలు(75)కు వైద్యులు అత్యవసరంగా బి.పాజిటివ్ రక్తం అవసరం కాగ, రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు స్థానిక మెడికల్ ఆసోసియేషన్ సెక్రటరీ నాగసూరి హనుమంతరావు (53)ను ప్రోత్సహించి రక్తదానం చేయించారు. ఇది మురళీ సుధాకరరావు ప్రోత్సహించి, రోటరీ ద్వారా చేయించిన 442వ రక్తదానం. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ఉపాధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరరావు, ఎజిపి యర్రమోతు రమేష్‌బాబు, పాల్గొన్నారు. అనంతరం చుండూరి మురళీ సుధాకరరావుని, రక్తదాత హనుమంతరావుని రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు.

# కందులు మద్దతు ధరకు కొనుగోలు



**అద్దంకి , ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
కందులు మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. నాగులపాడు సొసైటీలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కందులు క్వింటాల్ ఒక్కటికి 7550 ప్రభుత్వ ధర చెల్లిస్తుందని, 12%లోపు తేమశాతం ఉండేటట్లు చూసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఈ పంటలో నమోదైన రైతులకు రైతు సేవా కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు రిజి స్ట్రేషన్ చేసి, షెడ్యూల్ చేస్తారని తెలిపారు. బస్తాలు ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, తెలిపారు. రైతులు అందరూ మద్దతు ధరకు పంటను అమ్ముకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వేర్ హౌస్ మేనేజర్ రాంబాబు, ఎన్.సిసిఎఫ్ అసిస్టెంట్ మేనేజరు, మనోజ్, ఎన్‌సిఎంఎల్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# కొండను తవ్వారు.. ఎలుకను పట్టారు

## - సామాజిక తనిఖీలో సమన్యాయం - జనం లేకుండా జరిపిన ప్రజావేదిక



**బల్లికురవ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో తలెత్తుతున్న అవినీతిని వెలికి తీసేందుకు సామాజిక తనిఖీల పేరుతో ప్రభుత్వం చేపడుతున్న ఈ తనిఖీలు అందరికి సమన్యాయం చేశాయి.సామాజిక బృందాలు తనిఖీల పేరిట రిపోర్టులు తయారు చేస్తూ అవినీతికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఫలితంగా సామాజిక తనిఖీలు, ప్రజా వేదికలు, అంధమైన పదాలు గానే మిగిలిపోతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని 21 పంచాయతీలలో 1.04.2023 నుండి 31.03.2024 వరకు రూ.13 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఈ పనుల్లో అవినీతి అంతులేకుండా కొనసాగింది. వీరి అవినీతి అలా సాగిందో ఉదాహరణకు కొన్ని ముక్తేశ్వరం మరికొన్ని గ్రామాలలో కూలీల సంతకాలు లేకుండానే చెల్లింపులు జరిగాయి. కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారికి సైతం నెలలు తరబడి మస్టర్ వేశారు. మల్లాయపాలెం గ్రామంలో భవనాలు కట్టకుండానే బిల్లులు డ్రా చేశారు. అదే విధంగా కే.రాజుపాలెంలో ఎంబుక్‌తో పని లేకుండా చెల్లింపులు జరిపారు. కొప్పెరపాడు గ్రామంలో వాలంటీర్లకు నెలలు తరబడి మస్టర్ వేసి దిగమించేశారు. హార్టికల్చర్ పేరుతో ఒక్క మొక్క కూడా లేకుండా ఎన్నో గ్రామాలలో నిధులు డ్రా చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే గ్రామ గ్రామాన అవినీతి అనకొండ మాదిరిగా పెరుగుతూ పోయింది. సామాజిక తనిఖీల ద్వారా, ప్రజా వేదికలో మూడు రోజులు అధికారులు తెగ కష్టపడి తేల్చేసింది కేవలం ఎనిమిది లక్షల అవినీతి. నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్న సామెతగా అధికారుల పనితీరు గుర్తు చేస్తుంది.

# రామదాసుకు కరణం నివాళి



**బల్లికురవ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
వేములపాడు గ్రామంలో వలేటి రామదాసు, దశదినకర్మ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి హాజరై రామదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మన్నే శ్రీధర్ స్థానిక నేతలు ఉన్నారు.

# ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు మద్దతుగా సంబరాలు



**సంతమాగులూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
దేశ రాజధాని ఢిల్లీ పీఠంపై నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా గురువారం ప్రమాణం చేశారు.సంతమాగులూరు మండలం ఏల్చూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ సంఘం సంతమాగులూరు మండల అధ్యక్షులు కొలిశెట్టి మస్తాన్‌రావు అధ్యక్షతన కేక్ కట్ చేసి, అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓబీసీ సామాజిక వర్గానికి సముచితమైన స్థానం కల్పించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసిన రేఖా గుప్తాకు సీఎం పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సంతమాగులూరు మండల అధ్యక్షుడు దేవరంపల్లి నరసింహారెడ్డి,ప్రధాన కార్యదర్శి సిరిపురపు వెంకటరెడ్డి,అధికార ప్రతినిధి మక్కెన శ్రీనివాసరావు, టీడీపీ నేత నక్కావెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం నేతలు దివ్వేల వెంకట నాగేశ్వరరావు, కొలిశెట్టి సుబ్బారావు,అన్నాయోగేశ్వరరావు పాల్గొన్నారు.

# నిశ్చితార్ధ వేడుకల్లో పాల్గొన్న గూడూరి ఎరిక్షన్‌బాబు



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి20,ప్రభాతవార్త**
య ర్రగొండపాలెం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్ నందు గురువారం తెలుగు యువత నాయకులు షేక్ పెద్దవలి కుమార్తె నిశ్చితార్ధ వేడుకల్లో యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ వేడుకల్లో యంపిడివో శ్రీనివసులు,నాయకులు కామేపల్లె వెంకటేశ్వర్లు,చేకూరి సుబ్బారావు, వేగినాటిశ్రీను, మంత్రునాయక్, సత్యనారాయణగౌడ్,తెలుగుయువత నాయకులు షేక్ వలి,మస్తాన్‌వలి,చిట్యాల వెంగళ్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన

## ఎస్సై డాక్టర్ రాజమోహన్ రావు



**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**
మార్కాపురం పోలీస్ స్టేషన్ ఆవరణంలో గురువారం ఆటోడ్రైవర్లకు రూరల్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ రావు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటీవల నికరంపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై మిర్చి కూలీల మినీ వాహనం రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు మహిళారైతు కూలీలు చనిపోవడం, పలువురికి గాయాలు కావడం అందరినీ కలిచివేసిన సంఘటన నేపథ్యంలో అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎస్సై రాజమోహన్ రావు ఆటో డ్రైవర్లకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రధానంగా పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో ఎక్కించడం వలన తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా డ్రైవర్ ప్రక్కన ప్రయాణికులు కూర్చోవడానికి వీలు లేకుండా రెండువైపులా సీట్లను తొలగించారు. ఆటో నడిపేటప్పుడు మద్యం సేవించరాదని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజకుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ కోటినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2వేల కోట్లు బడ్జెట్లో కేటాయించాలి

## - నిర్వాసితులకు వెంటనే ఆర్‌అండ్‌ఆర్ వెంటనే చెల్లించాలి

## - రైతు సంఘం డిమాండ్




**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన రూ. 2వేల కోట్లు బడ్జెట్లో కేటాయించి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వెంటనే చెల్లించి అమలు చేయాలని, 2025 వరద సీజన్ నాటికి వెలుగొండ ప్రాజెక్టు నీరు విడుదల చేయాలని, అలాగే యువతి యువకులకు కటాఫ్ తేదీని పెంచాలని ఏపీ రైతు సంఘం ప్రకాశం జిల్లా శాఖ సహాయక కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, మండల నాయకులు ఏసేపు, సుంకన్న, పిచ్చయ్య, దావీదు, కుమారి, తదితరులు గురువారం పెద్దదోర్నాల మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షుడు శగ్గం శ్రీనివాసులును

## సన్మానించిన బీజేపీ దోర్నాల నాయకులు



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
బీజేపీ జిల్లా అధ్యక్షుడు శగ్గం శ్రీనివాసులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కుటుంబ సమేతంగా శ్రీశైలం వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యంలోని పెద్దదోర్నాలలో గురువారం బీజేపీ నాయకులు కలుసుకొని శగ్గం శ్రీనివాసులు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దదోర్నాల బీజేపీ మండల అధ్యక్షుడు సువరం గండి వీరారెడ్డి, తంగిరాల సీతారెడ్డి, తంగిరాల అశోక్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నాం

## - ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి




**రాచర్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాచర్ల బిసి భవన్‌లో స్థానిక తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు అనేక రకాల సమస్యలతో ప్రజా దర్బార్ కార్యక్రమానికి చేరుకొని వారి సమస్యలను తెలియజేశారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులు ఆయన స్వీకరించి వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ అనే కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల వద్దకు వెళ్ళి వారి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించాలనేదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అందుకు గల కారణాలు ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఉపయోగం లేని పథకాలతో కోట్లరూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుంపటిగా మార్చి ఖాళీ ఖజానాతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూ లోటుబడ్జెట్‌తో ఉన్న రాష్ట్ర అభివృద్ధికోసం, ప్రజా సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తుందని అన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకూడదని, సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందని ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల వద్దకు వెళ్ళి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని అన్నారు. కాబట్టి ప్రజలు ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను విచారించి వెంటనే పరిష్కరిస్తామని, పరిష్కారమైన సమస్యల గురించి సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, పరిష్కారానికి వీలుకాని సమస్యలు ఏవైనా ఉంటే వాటిపై కూడా అందుకుగల కారణాలను అర్జీదారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మెరుగైన పాలన అందించడమే కాకుండా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేపడతామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఇచ్చిన మాట తప్పే ప్రసక్తేలేదని అన్నారు. ఇప్పటికే పింఛన్లు పెంచామని ఏడాదికి మూడు సిలిండర్లు కార్యక్రమం అమలు చేస్తున్నామని త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని మిగిలిన వాటిని కూడా అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని అన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి మండల ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, తహశిల్దార్ కార్యాలయ సిబ్బంది, స్థానిక తెలుగుదేశంపార్టీ నాయకులు, మండల ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ తహశిల్దార్ జి భారతిభాయ్, అన్నిశాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, జిల్లా పార్లమెంట్ కార్యదర్శి గోపిరెడ్డి జీవనేశ్వరరెడ్డి, టిడిపి యువనాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, జనసేనా మండల అధ్యక్షులు పుట్ట బాలకృష్ణ, బిసి సెల్ జిల్లా కార్యదర్శి నల్లబోతుల శ్రీనివాసులు, తెలుగుదేశం, జనసేన, బిజేపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో శ్రీ మార్కండేశ్వర స్వామి బ్రహోత్సవాలు




**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త**
మార్కాపురంలో వెలసి ఉన్న శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి వారి శివరాత్రి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్చార్జి కందుల రామిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ అర్చకులు వేలూరి ఆంజనేయ శర్మ, వరుణ్ తేజ శర్మ, ఆలయ సిబ్బంది, తెలుగుదేశంపార్టీ నాయకులు స్వామివారి భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుండి మార్చి 5వ తేదీవరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించబడతాయని తెలిపారు.. 2025 ఫిబ్రవరి 26 తెల్లవారుజామున 4గంటలకు శ్రీ మార్కండేశ్వర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగును. మార్చి 3వ తేదీ రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించబడుతుందన్నారు. పై కార్యక్రమాలు అన్ని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని ఆయన తెలిపారు.

# డయల్ 100కు ఫోన్.. భర్త పురుగుల మందు సేవించాడంటూ

## - పరుగులు తీసిన మద్దిపాడు పోలీసులు

**మద్దిపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
మండల పరిధిలోని కొష్టాల సెంటర్లో ఒక వ్యక్తి పురుగుల మందు సేవించాడంటూ అతని భార్య డయల్ 100కి సాయంత్రం 4గంటల సమయంలో ఫిర్యాదు చేయడంతో వారు మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించగా.. మద్దిపాడు పోలీసులు కొష్టాలు సెంటర్ చుట్టు పక్కల ప్రాంతాలు అన్ని తిరుగుతూ పరుగులు తీశారు. అందిన వివరాల ప్రకారం అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన బండి రోశయ్య తాను పురుగుల మందు తాగానని కొష్టాలు సెంటర్లో ఉన్నానని భార్యకు చెప్పడంతో ఆమె వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం తెలిపింది. ఈ క్రమంలో సాయంత్రం 7గంటల సమయంలో బండి రోశయ్య, మేదరమెట్ల బైపాస్ వద్ద ఉన్నట్లు, అక్కడ పురుగుల మందు తాగడానికి ప్రయత్నించినట్లు సమాచారం. కుటుంబంలో భార్యభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు కారణంగా పురుగుల మందు తాగి బెదిరించాలన్న ఉద్దేశంతోనే సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న మద్దిపాడు పోలీసులు వెతుకులాట నిలిపివేసి ఊపిరి పీల్చుకున్నారు.

# త్వరగా శ్రమ శక్తి సంఘాల గ్రూపులు ఏర్పాటు చేయాలి



**తాళ్లూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**
గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో శ్రమశక్తి సంఘాలను త్వరగా ఏర్పాటు చేయాలని ఏపీవో మురళి అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ గ్రామాలలో కూలీలు వలసలు పోకుండా పటిష్గంగా ఉపాధి పనులు చేయించాలన్నారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మినీ గోకులం షెడ్‌లు పనులు పూర్తి చేయించాలని సూచించారు. ప్రజలకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించి పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి క్లష్టర్ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శైలేష్, టెక్నికల్ అసిస్టెంట్ అచ్చిరెడ్డి, ఈసీ గురుబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు రమేష్, కోటేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



నరసరావుపేటలోని ప్రెట్టిమేకోవర్ స్టూడియో అండ్ అకాడమీ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొని నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్త కుమారుని మృతదేహానికి నివాళులర్పించిన బూచేపల్లి

**దర్శి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



దర్శి మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామంలో కరెంట్ షాక్‌తో మృతి చెందిన పార్టీ నాయకులు సుబ్బులు కుమారుడికి గురువారం నివాళులర్పించిన దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బులు కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చుమారి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, వైసీపీ నాయకులు గొంది అప్పిరెడ్డి, నాగ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ అసిస్టెంట్ మిస్సింగ్ కేసు నమోదు

**దర్శి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



చందలూరు గ్రామ సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జాన్ గార్డెన్ అనే అతను బుధవారం ఉద్యోగ విధులకు చందలూరు వెళ్లలేదని అతని పెద్దనాన్న దర్శి పోలీసు స్టేషన్‌లో రిపోర్ట్ ఇవ్వగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది. అతనికి ఆర్థిక సమస్యలు ఉన్నట్లుగా అందువలన మానసికంగా ఇబ్బంది పడుతూ వెళ్ళిపోయినట్లుగా అనిపిస్తుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై ఎం.మురళి తెలిపారు.

**పనిముట్లు ఇప్పిస్తానని రైతుల దగ్గర నుండి నగదు వసూళ్లు:**

చందులూరు అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జాన్ గార్డెన్ అనే వ్యక్తి ఆ సచివాలయ పరిధిలోని రైతుల దగ్గర నుండి రైతులకు సంబంధించిన పనిముట్లను ఇప్పిస్తానని కొంత మంది రైతుల దగ్గర నుండి దాదాపు రూ.50లక్షలకు పైగా వసూళ్లు చేశారని రైతుల ఆరోపణ. కొంత మంది రైతుల దగ్గర నుండి తీసుకున్న నగదును ఇస్తానని రాతపూర్వకంగా కూడా రైతులకి రాసిచ్చినట్లు సమాచారం. దర్శి పోలీసు స్టేషన్‌లో మొత్తంగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.మురళి తెలిపారు.

## ఉప్పుగుండూరులో జ్ఞానజ్యోతి

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



అంగన్‌వాడీ కార్యకర్తలకు గత మూడు రోజుల నుండి జ్ఞానజ్యోతి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం ఉప్పుగుండూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఏడబ్ల్యూడబ్ల్యూ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ శిక్షణలో పలువురు శిక్షకులు మాట్లాడుతూ 0-నుండి 6 సంవత్సరాల పిల్లలను అర్థం చేసుకోవడం ఎలా, బాల్యారంభ సంరక్షణ, విద్య, భారతదేశంలో ఇటీవల పాలసీ విధానాలు, పిల్లల స్వభావం లక్షణాలు, మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపే అంశాలు సమగ్ర అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. సమగ్ర అభివృద్ధి కృత్యాలు అయిన శారీరక అభివృద్ధి భాషాభివృద్ధి, మేధాభివృద్ధి, సృజనాత్మకత సామాజిక భావోద్వేగ అభివృద్ధిలు 0-6 సంవత్సరాల పిల్లలకు ఎలా కలిగించాలి అనేవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి స్కూల్ టీచర్స్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, సీడీపీఓ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీఎన్

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలంలోని 5 గ్రామాల్లో 14 మందికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సీఎం సహాయనిధి చెక్కులను గురువారం అందజేశారు. రూ.7లక్షల 51 వేల 426 విలువ చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, మండల పార్టీ సెక్రటరీ కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, మారెళ్ల శేషయ్య, మాజీ జడ్పీటీసీ షేక్ ఖాజావలి, జాన్సన్, స్వర్ణ అనురాధ, పెనుబోతు సునీల్‌బాబు, దేవి పున్నారావు, కొణిజేటి ధనుష్, సాయి చరణ్, స్వరా కిషోర్, మెట్టు సుబ్బయ్య నాయుడు, కొమ్మినేని రమేష్, శరత్, పీకా బైరాగిబోయిడి బ్రహ్మరాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు

**టంగుటూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



మూడో రోజు జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు గుంటూరు గవర్నమెంట్ ఉన్నత పాఠశాల నందు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులు టంగుటూరు వల్లూరు ,కారుమంచి సెక్టార్లో పని చేసే అంగన్‌వాడీ ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు. గురువారం శిక్షణా తరగతిలో కోర్స్ డైరక్టర్ అయిన పాఠశాల ప్రధానోపాధ్యాయుని తులసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలుగా ఎస్.రవి, జి.జ్యోతి, తేళ్ల కుసుమకుమారి, సూపర్‌వైజర్ వల్లూరు సెక్టార్ ఆర్పీలుగా పాల్గొన్నారు. ఈశిక్షణా తరగతుని జిల్లా ఐసడీఎస్ ప్రాజెక్టు డైరక్టర్ బి.హేన సుజన్, విజిట్ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు.

## మంచి వ్యక్తిని కోల్పోయాం - జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

**టంగుటూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



మండల పరిధిలోని ఆలకూరపాడు గ్రామానికి చెందిన అనుమాల సుభాష్ చంద్రబోస్ తొమ్మిదో వర్ధంతి సందర్భంగా జిల్లా ఎస్పీ దామోదర్ అనుమాల సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాజకీయంగా గ్రామంలో ప్రతి ఒక్కరిని కలుపుకొని పోయే వ్యక్తి అని ఆయన కొనియాడారు. అదే విధంగా అన్న బాటలో తమ్ముడు అనుమాల రవిచంద్ర ప్రతి ఒక్కరికి పలకరిస్తూ తన వంతు పేదలకు సహాయం చేస్తూ అన్న బాటలో రవిచంద్ర కూడా మంచి మనసున్న వ్యక్తిని ఆయన అన్నారు. అలాగే మాజీ సర్పంచ్ బెల్లం జయంతిబాబు మాట్లాడుతూ అనుమాల సుభాష్ చంద్రబోస్, తెలుగుదేశం పార్టీలో ఉంటూ గ్రామ నాయకుడిగా అనేక కార్యక్రమాలు చేయడంతో పాటు పార్టీకి గట్టి పట్టు ఉన్న నాయకుడిగా పని చేశారని, వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వేడిపాలు పడి విద్యార్థికి గాయాలు

**టంగుటూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



టంగుటూరు మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వలన ఐదో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలు అయిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టంగుటూరు మండలంలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థితో పని చేపిస్తున్న క్రమంలో కాగే కాగే పాలు విద్యార్థి మీద పడటంతో విద్యార్థికి తీవ్ర గాయాలైన విద్యార్థిని హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు.

**విద్యార్థినిని పరామర్శించిన మంత్రి స్వామి:**

గురుకుల పాఠశాలలో పాలుపడి గాయపడిన విద్యార్థినిని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## ఉద్యోగ భద్రత, సమ్మె ఒప్పందాల భరోసాకై దశల వారి పోరాటాలు

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

**చీరాల టౌన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు కోసం దశల వారి పోరాటాలు చేస్తూ కార్మికులకు అండగా ఉంటాం అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయు) రాష్ట్ర కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాలంఒల పొరుగు సేవలు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దు చేయాలని మంత్రి వర్గం తీర్మానించినట్లు వార్తలు వినిపిస్తున్నాయని, దీంతో ఆప్కాస్‌లో ఉన్న పొరుగు సేవల కార్మికులందరిలోనూ తీవ్ర భయాందోళన నెలకొన్నది అన్నారు. గురువారం చీరాలలో జరిగిన మున్సిపల్ కార్మికుల గేట్ మీటింగ్‌లలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఆప్కాస్ ఏర్పాటు కాకముందు మున్సిపాలిటీ రంగంలో ప్రతి సెక్షన్ కి దళారీ వ్యవస్థ కొనసాగేది అని, జీతభత్యాల చెల్లింపు దళారీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేది అన్నారు. వారు ప్రతి నెల జీతాలు చెల్లించకుండా ఐదు నుండి ఆరు నెలలు జీతాలు బకాయిలు పెట్టేవారు అన్నారు. అంతే కాకుండా జీతాలలో కూడా పెద్ద ఎత్తున కోతలు విధించి కార్మికులను దగా చేసే వారు అని అన్నారు. కార్మికుల బ్యాంకు పాస్ పుస్తకాలు కూడా వారి దగ్గరే పెట్టుకుని కార్మికులను వేదింపులకు గురి చేసిన పరిస్థితి ఉందన్నారు. ఆప్కాస్ వ్యవస్థ ఏర్పాటు వల్ల వీటన్నింటికి చెల్లు చీటి జరిగి దళారీ వ్యవస్థ స్థానంలో ప్రభుత్వమే మధ్యవర్తి పాత్ర పోషించే ఆప్కాస్ వ్యవస్థను తెచ్చిపెట్టిందన్నారు. అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి ఒప్పంద కార్మికులందరిని పర్మినెంట్ చేస్తుందని కార్మికులు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. కానీ గురువారం జరిగిన మంత్రివర్గం సమావేశం అందుకు భిన్నంగా ఆప్కాస్‌ను రద్దు చేసి తిరిగి దళారీ వ్యవస్థను తెచ్చిపెడుతున్నట్లు ప్రభుత్వ ప్రకటన విడుదల కావడం తీవ్ర విచారకరం అని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు, శాశ్వత స్వభావం కలిగిన విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు పర్మినెంట్ తో పాటు, గత సమ్మె కాలపు ఒప్పందాలు అమలు కోసం దశల వారీ పోరాటం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అందులో భాగంగా 20, 21 తేదీలలో స్థానికమంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వడం, 24న ముఖ్యమంత్రికి ఉత్తరాలు పంపడం, 25,26వ తేదీల్లో మున్సిపల్ చైర్మన్‌లు, కౌన్సిలర్లకు వినతిపత్రాలు అందజేయటం అంతిమంగా మార్చి 5న ఛలో విజయవాడ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు చీరాల కమిటీ అధ్యక్షుడు ఎన్.బాబురావు, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు సీహెచ్ వీరాస్వామి, స్థానిక కమిటీ నాయకులు జి.ఇమ్మానియేలు, క్రాంతి సాగర్, బి.రాంబాబు, సీహెచ్ నాగేశ్వరరావు, చాంద్ భాషా, పి.సురేష్, వేపురి రంజిత్, పి.వెంకటేశ్వర్లు, జి.కోటేశ్వరమ్మ, బి.కుమారి, ఓ.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంట్ స్థలాన్ని పరిశీలించిన ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం

**చీరాల టౌన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



చీరాల మండలం వాడరేవు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న రెండు ఆర్వో ప్లాంట్‌ల స్థలాలను ఎంపీడీఓ శివ సుబ్రహ్మణ్యం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడరేవు గ్రామస్తుల సూచన మేరకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాలతో వాడరేవు గ్రామంలోని సచివాలయం వన్ సచివాలయం టు వద్ద ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలించామన్నారు. రానున్న వేసవి కాలం రిత్యా తాగునీటికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తగా ఆర్వో ప్లాంట్‌లను గ్రామస్తుల అవసరార్థం గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే ప్లాంట్లను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి కోటా నాగయ్య, టీడీపీ నాయకులు పిక్కి నారాయణ పలువురు ఉన్నారు.

## దత్తక్షేత్రం నందు అనఘాష్టమి వ్రతము

**చీరాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



కొత్తపాలెం రోడ్డులో గల శ్రీక్షిప్త ప్రసన్న దత్త క్షేత్రం నందు మాఘమాసం బహుళ అష్టమి సందర్భంగా ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శ్రీ అనఘాదేవి సమేత శ్రీ దత్తాత్రేయ స్వామి వార్ల ఉత్సవమూర్తుల వద్ద అనఘాష్టమి వ్రతంను దత్తపరివారు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రసాదములు నివేదన చేసి, శ్రీదత్తాత్రేయ స్వామి వారికి నక్షత్ర హారతి ఇచ్చి, తదుపరి పంచదత్తులకు అభిషేకం నిర్వహించారు. తదుపరి భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో దత్తక్షేత్రం కన్వీనర్ ప్రమీలాదేవి, సభ్యులు బండ్ల చంద్ర, రాజేశ్వరి, వనిత, లత, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## పందిళ్లపల్లి హైస్కూల్‌లో మనో వికాసం చిత్రలేఖనంపై వర్క్‌షాపు

**వేటపాలెం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



మండలంలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రశాంత్‌రెడ్డి పంచవృత్తుల భావ ప్రకటన వేదిక ఆధ్వర్యంలో మనో వికాసం చిత్రలేఖనం వర్క్‌షాపు జరిగింది. ఈ వర్క్ షాపులో ఎంపీపీ స్కూల్ విద్యార్థులు 10 మంది బాల బాలికలు పాల్గొన్నారు. వీరిలో దేవి కీర్తన చిత్రలేఖనం లో ప్రథమ శ్రేణి పొందింది. జే.పూజిత్ ద్వితీయ, పి.నాగనిఖిల తృతీయ స్థానం సాధించారు. ఎస్.అలేఖ్య ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమం ముగింపుగా పందిళ్లపల్లి కాంప్లెక్స్ చైర్మన్ ఎం.శేఖర్‌రావు చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు.

## నక్కల ఆంజనేయులు మరణం బాధాకరం - తెన్నేటి కృష్ణప్రసాద్

**చీరాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నక్కల ఆంజనేయులు మరణం బాధాకరం అని, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు బాపట్ల పార్లమెంట్ సభ్యులు, లోకసభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేసిన కృష్ణ ప్రసాద్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుండి కూడా పార్టీ పటిష్ఠతకు ఆంజనేయులు విశిష్ట కృషి చేశారని ఆయన అన్నారు. ఆంజనేయులు రెండవ కుమారుడు, ప్రస్తుతం తన వద్ద ఓఎస్డీగా పని చేస్తున్న నక్కల వెంకట రమణని ఎంపీ ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు.

## మిట్టపాలెంలో ఘనంగా ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**సీఎస్‌పురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**







ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి వారి ఆలయంలో స్వామివారి 67వ సప్తాహ్నిక, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు రుత్వికుల వేదమంత్రాల నడుమ గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ, పప్పు శ్రీకాంత్‌లు ఉదయం గణపతి పూజ, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, రుత్విగ్వరణము, లక్ష్మీగణపతి, దత్తాత్రేయ హోమములు నిర్వహించారు. అనంతరం మృతికాసంగ్రహ దీక్షాహోమములు, రాత్రికి పల్లకిసేవ, రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకటరావు బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొని అర్చకులకు రుత్వీకరణ గాంచారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకటరావు, ఉభయదాతలు గుత్తి వెంకటరాజు, అనిల్ కుమార్, బుజ్జమ్మ, యశ్విని భక్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల వేతనాలు..నిర్వహణ మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి

- శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని డాక్టర్ ఉగ్ర హామీ

**కనిగిరి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వం అప్కాస్ రద్దు పరుస్తూ మున్సిపల్ శాఖనే ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగ కార్మికుల బాధ్యత ఉంటుందని స్పష్టంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయుసీ అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి తగు డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు పరుస్తూ మున్సిపల్ శాఖనే ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగ కార్మికుల బాధ్యత ఉంటుందని చెప్పినప్పటికి సపష్టమైన హామీ ఇవ్వకపోవడంతో అయితే వీటిని ప్రైవేటు వ్యక్తులకు అంటే బడా కంపెనీలకు వారి ఏజెన్సీలకు అప్పజెబుదామనే మంత్రి వర్గ సభ్యుల అభిప్రాయాలు పత్రికల్లో ప్రకటించడంపై కార్మికుల ఆందోళనలో ఉన్నారని, కనుక ఫిబ్రవరి 24 నుంచి మార్చి 10 వరకు జరగనున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకెళ్లి తగు పరిష్కారం చూపాలని స్థానిక ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చామని, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచివ్వాలన్నారు. పట్టణ జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచి ఇంజనీరింగ్ ఒప్పంద సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ నాసర్ వలి, చియాద్రి అశోక్, ఆలూరి కోటయ్య, గంగవరపు కిరణ్, చంద్రమోహన్, సుబ్రహ్మణ్యం, శేషయ్య, షేక్ మస్తాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు భోజన వసతి కల్పించిన బసిరెడ్డి పిచ్చిరెడ్డి

**కనిగిరి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



కనిగిరి ఏరియా ఆసుపత్రిలో వికలాంగులకు సదరం ధృవీకరణ పత్రాలు పునఃపరిశీలనకు క్యాంపుకు హాజరైన దివ్యాంగులకు గురువారం రిటైర్డ్ టీచర్ బసిరెడ్డి పిచ్చిరెడ్డి ఆర్థిక సహాయంతో భోజనవసతి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అన్నదానాన్ని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, రిటైర్డ్ టీచర్ బసిరెడ్డి పిచ్చిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు కలిగి ఉండడమే కాక వేసవి కాలంలో హోటల్‌కి వెళ్లి భోజనం చేయలేని రోగులకు, వృద్ధులకు, నిరుపేద ప్రజలకు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సదరం క్యాంపుకు ప్రత్యేకఅధికారి డాక్టర్ ఆంజనేయులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ తిరుపతిరెడ్డి, న్యాయవాది షేక్ సుమైర్, ఆర్ఎంపీ డి.చెంచులు, మదర్ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ సెంటర్ ఆధునీకరణకు రూ.50వేల చెక్కును అందజేసిన తమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి

**కనిగిరి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కమ్యూనిటీ వైద్యశాలలో ఉన్న డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ కోసం కనిగిరి టౌన్ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి గురువారం రూ.50వేలు చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర దాత తమ్మినేని శ్రీనివాసులురెడ్డిని అభినందించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న డయాలసిస్ సెంటర్ ఆధునీకరణకు దాతలు సహకరించాలని ఉగ్ర కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, తెలుగుదేశం పార్టీ నాయకులు అంజి, మున్నా, ఆజయ్, జిలాని, రబ్బాని, ఇతర తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కనిగిరి డయాలసిస్ సెంటర్ అభివృద్ధికి విరాళం

- రూ.25వేల చెక్కును అందజేసిన టీడీపీ నాయకుడు అంజినాయుడు

**కనిగిరి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని ఫ్లోరైడ్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కమ్యూనిటీ వైద్యశాలలో ఉన్న డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ నిమిత్తం కనిగిరి 20వ వార్డు టీడీపీ నాయకులు అంజి నాయుడు గురువారం రూ.25వేల చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, అంజి నాయుడుని అభినందిస్తూ డయాలసిస్ సెంటర్ మరింత అభివృద్ధి చెందేందుకు మరికొందరు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కనిగిరి టౌన్ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి, కనిగిరి తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, అంజి, మున్నా, అజయ్, జిలాని, రబ్బాని పాల్గొన్నారు.

## కనిగిరి దొరువు ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలు

- భయాందోళనలో మహిళలు

**కనిగిరి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని దొరువు ప్రాంతంలో ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంజాయి, మద్యం సేవించి అల్లరి చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం, గట్టిగా కేకలు వేయడం వంటి భయానక వాతావరణం సృష్టించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కనకదుర్గ అమ్మవారి దేవస్థానం, శివాలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వంటి పుణ్యక్షేత్రాలు ఉండటంతో దేవాలయాలకు వెళ్లే మహిళలు ఆకతాయిల చర్యలతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. గంజాయి, మద్యం సేవించిన వ్యక్తులు రాత్రివేళ చిల్లరగా తిరుగుతూ ప్రజలను బెదిరించడం వరుస ఘటనలుగా మారినట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసు శాఖ, మున్సిపల్ అధికారులు స్పందించి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, మహిళా సంఘాలు, భక్తులు కోరుతున్నారు. ఆకతాయిల తీరుపై కఠిన చర్యలు తీసుకుంటే మాత్రమే ప్రజలకు రక్షణ లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నాయక్

**కొనకనమిట్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



తాగునీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ లక్ష్మణ్ నాయక్ అన్నారు. క్రాస్ ఫోగ్రాంలో భాగంగా గురువారం కొనకనమిట్ల ఎస్సీ కాలనీలో చేతి పంపు మరమ్మత్తు పనులను పరిశీలించారు. చేతి పంపులలో నీటి ధారా తగ్గినట్లయితే అదనంగా పైపులు వేయాలని వాడుకలో లేని చేతి పంపులను గ్రాస్తుల సహకారంతో సకాలంలో రిపేర్లు చేయాలని మెకానిక్‌కు సూచించారు. ఈ క్రాస్ ఫోగ్రామ్ మార్చి 20వ తేదీ వరకు ఉంటుందని, అన్ని గ్రామాల్లో చెడిపోయిన చేతి పంపులను, డీప్ బోర్లను మరమ్మత్తులు చేసేందుకే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వీరితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సృజన జ్యోతి ఉన్నారు.

## వైసీపీ మండల అధ్యక్షుడిగా మల్లిఖార్జునరెడ్డి

**సీఎస్‌పురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**




వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన పాలుగుళ్ళ మల్లిఖార్జునరెడ్డిని నియమించారు. ఆ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. మల్లిఖార్జునరెడ్డి గతంలో ఉప్పలపాడు ఎంపీటీసీగా పని చేసి ప్రస్తుతం పార్టీలో సీనియర్ నాయకులుగా కొనసాగుతున్నాయి. మల్లిఖార్జునరెడ్డిని మండల అధ్యక్షుడుగా ఎంపిక చేయడం పట్ల మండలంలోని వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21-2Pg5exH.qxd:21-2Pg5exH.qxd 01/01/01 8:22 AM Page 1



# ఒటిటిలు 'ఎథిక్స్ కోడ్' పాటించాలి




## స్వీయనియంత్రణ సంస్థలు అశ్లీలకంటెంట్ నిషేధించాలి
### కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఇండియాస్ గాట్ లాటెంట్ కార్యక్రమంలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశంలో తీవ్ర దుమారంరేపాయి. ఈక్రమంలో ఐటి నిబంధనల్లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఒటిటిలు, సామాజిక మాద్యమాలు తప్పనిసరిగా పాటించాలనికేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఎ'రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండాచూడాలని ఆదేశించింది. సమాచార ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మార్గదర్శకాలు విడుదలచేసింది. ఒటిటి ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు వచ్చాయి. ఐటి నిబంధనల్లోని నైతిక నియమావళిని ఖచ్చితంగా అనుసరించాలని సూచించింది. లేనిపక్షంలో ఆంక్షలు విధించాల్సి ఉంటుందని కూడా ప్రకటించింది. ఆన్‌లైన్ క్యూరెటెడ్ కంటెంట్‌పై సోషల్‌మీడియా తప్పనిసరిగా కేంద్రం చట్టాలను అనుసరించాల్సిందేనని అన్నారు. వయసు ఆధారిత నిబంధనలు విధిగా పాటించాలన్నారు. చట్టంనిషేధించిన కంటెంట్‌ను ప్రసారంచేయ కూడదని నిర్దేశించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల కంటెంట్‌ను రెగ్యులేట్ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కేంద్రం స్పందించింది. స్వీయనియంత్రణ ఉన్న ఒటిటిలు నైతిక విలువలుపాటించాలన్నారు. ఐజిఎల్‌లో పాల్గొన్న ఒక వ్యక్తిని తల్లితండ్రుల గురించి శృంగారంపై ప్రశ్నించడంతో ప్రముఖ యూ ట్యూబర్ అల్హాబాదియాపై తీవ్రనిరసనలు వ్యక్తం అయ్యాయి. ఆతడి వ్యాఖ్యలపై పలువురు పార్ల మెంటు సభ్యులుకూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసారు.

సమయ్‌రైనాషోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేసారు. దీనితో పలు రాష్ట్రాల్లో ఆతడిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదయిన ఎఫ్‌ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్‌చేయాలని ఒక పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు అల్హాబాదియా వ్యాఖ్యలపై అసహనం వ్యక్తంచేసింది. అశ్లీల కంటెంట్ నియంత్రించేందుకు చర్యలు తీసుకునే ఆలోచన ఉందా అని సుప్రీం కేంద్రాన్ని స్పందిం చింది. దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసులుసైతం జారీచేసింది.



### ఒకప్పటి బహిష్కృతనేత
## ఇపుడు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీలో ఒకప్పుడు అసెంబ్లీ మార్షల్స్ బలవంతంగా ఎత్తుకుని బయటకు తీసుకెళ్లిన వ్యక్తి ఇపుడు అదే ఢిల్లీ అసెంబ్లీకి స్పీకర్ అయ్యారు. రోహిణి ఎమ్మెల్యే విజేందర్‌గుప్తాను పార్టీ స్పీకర్‌గా ఎంపికచేసింది. సుమారు పదేళ్లక్రితం అసెంబ్లీనుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన పాత వీడియోలు ఇపుడు వైరల్ అవుతున్నాయి. 2015లో ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే అల్కాలాంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. దీనితో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులోపాల్గొన్న బిజెపి ఎమ్మెల్యే అయిన విజేందర్‌గుప్తాను అప్పటి స్పీకరు ఆరోజు సాయంత్రం నాలుగు గంటలవరకూ సభనుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకుని అసెంబ్లీనుంచి బయటకు తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆయన అభిమానులు ఇపుడు వైరల్ చేస్తున్నారు. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా తనను ఎంపికచేయడంపట్ల గుప్తా హర్షంప్రకటించారు. హైకమాండ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ముడా కేసులో 8వేల పేజీలతో
# లోకాయుక్త 'బి' రిపోర్టు!



**మైసూరు, ఫిబ్రవరి 20:** మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికారసంస్థ (ముడా) కుంభకోణంపై కర్ణాటక లోకాయుక్త ఎస్పీ టిజె ఉదేశ్ గురువారం ఎనిమిది పేజీల తాత్కాలిక బి రిపోర్టును కోర్టులో దాఖలుచేసారు. లోకాయుక్త అధికారుల బృందం ముడా దర్యాప్తునకు సంబంధించిన పత్రాలు నాలుగు బ్యాగ్‌ల్లో ప్రజాప్రతినిదుల కోర్టుకు తరలించారు. ఎస్పీ ఉదేశ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దర్యాప్తు జరుగుతోందన్నారు. కోర్టుకు సమర్పించిన పత్రాలు దర్యాప్తునకు సంబందించిన కీలకమూనవన్నారు. ముడా కుంభకోణం కేసులో సిఎం సిద్ధరామయ్యతోపాటు ఆయన భార్యకు లోకాయుక్త క్లీన్‌చిట్ ఇచ్చింది.

ఈ కుంభకోణంలో ఆరోపణలపై ఆధారాలు లేవని దాంతో కుంభకోణాన్ని నిరూపించలేమని పేర్కొంటూ లోకాయుక్త పోలీసులు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు లేఖరాసారు. ఐపిసి, అవినీతి నిరోధక చట్టం, కర్ణాటక బూసేకరణ చట్టం వంటి అనేక నిబంధనలను లేఖలోప్రస్తావించారు. అక్రమా లకు పాల్పడినట్ల ఎదుర్కొంటున్న సిఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతితోపాటు నలుగురికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని ఈకేసులో నలుగురు నిందితులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలులేక నిరూపితం కాలేదన్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు స్నేహ మయికి వారంరోజులు గడువు ఇస్తున్నట్లు లేఖలో వెల్లడించారు.

కేసులో దర్యాప్తుసాగుతోందన్నారు. కేసులు నలుగురు నింది తులపై చట్టపరమైన చర్యలు సాధ్యంకాదని తుదినివేదికను కోర్టుకు అందించామని ఎస్పీ ఉదేశ్ అన్నారు. లోకా యుక్తపై సామాజిక కార్యకర్త ఫిర్యాదుదారుడు స్నేహ మయి కృష్ణ స్పందించారు. లోకాయుక్తపై ఆయన విమర్శలు కురిపించారు. రాజకీయ నేతలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. లోకా యుక్తపై తనకు సందేహాలునిజమని రుజువు చేసారన్నారు. లోకాయుక్త అధికారులు తమ ఆత్మలను రాజకీయ నాయకులకు అమ్ముకున్నట్లు వ్యవహరించారని విమర్శించారు. తాను అవసరమైన అన్ని పత్రాలు ఇచ్చినప్పటికీ సిద్ధ రామయ్య పార్వతి మల్లిఖార్జనస్వామి దేవ రాజ్‌లపై ఎలాంటి ఆధారాలేలేవంటూ బీ రిపోర్టు నుదాఖలుచేయబోతున్నారని ఆరోపించారు.

## కుంభమేళాలో స్నానంచేస్తున్న మహిళల విడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు
### కేసు నమోదు చేసిన యుపి పోలీసులు



**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 20:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు 55కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళా భక్తుల వీడియోలు విక్రయిస్తున్న రెండు సామాజిక ఖాతాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు యుపి పోలీసు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల గోప్యత, గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి వీడియోలను కొన్ని ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తున్నాయి. సోషల్ మీడియా మానిటరింగ్ టీమ్ దీన్ని గుర్తించింది. దీనిపై కొత్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ వీడియోలు అప్‌లోడ్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను గుర్తించేందుకు మెటా నుంచి వివరాలు కోరినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ వీడియోలు విక్రయిస్తున్నట్లు మరో కేసు నమోదయింది. వీటిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహాకుంభమేళాకు సంబంధించి అభ్యంతకరమైన, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జనవరి 13న మొదలైన మహా కుంభమేళా కార్యక్రమం ఫిబ్రవరి 26 వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 నాటికి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలుచేసే భక్తులసంఖ్య 60 కోట్లుదాటే అవకాశంఉందని అంచనా వేస్తు న్నారు. తొలుత దీనికి 45కోట్లమంది మాత్రమేవస్తారని అంచనావేయగా ఊహించనిరీతిలో భక్తులు పోటెత్తారు.

## శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

**కొలంబో, ఫిబ్రవరి 20:** శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి చెందాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. రైలులోని ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. అయితే ఏనుగుల గుంపును ఢీకొన్న రైలు పట్టాలు తప్పింది. కొలంబోకు తూర్పున ఉన్న హబరానాలోని వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్టులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గాయపడిన రెండు ఏనుగులకు చికిత్స అందిస్తున్నారు. శ్రీలంకలో గత యేడాది ఏనుగుల వల్ల 170 మంది మృతి చెందారు. అయితే వేర్వేరు ఘటనల్లో 500 ఏనుగులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. లంకలో సగటున ప్రతి యేడాది సుమారు 20 ఏనుగులు రైలు ఢీకొనడం వల్ల మృతి చెందుతున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అడవుల నరికివేత వల్ల జంతువులు మానవ ప్రదేశాల్లోకి వస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో రాత్రి పూట రైళ్లను నెమ్మది నడపాలని, హారన్లు ఇవ్వాలని డ్రైవర్లకు ఆదేశాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. శ్రీలంలో సుమారు ఏడువేల ఏనుగులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బౌద్ధ మతస్తులు ఆ జంతువుల్ని పవిత్రంగా భావిస్తారు. ఏనుగుల్ని చంపితే అక్కడ జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

### 30 యేళ్ల క్రితం కేసులో
## మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు..

**ముంబయి, ఫిబ్రవరి 20:** దాదాపు 30 ఏళ్ల క్రితం మోసానికి పాల్పడిన కేసులో ఎన్సీపి నేత, మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మాణిక్‌రావ్ కొకతేకు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మంత్రితో పాటు అతని సోదరుడికి జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ నాసిక్ కోర్టు తీర్పు వెలువరించింది. నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ కోటాలో ఫ్లాట్‌లు పొందారని మాజీ మంత్రి దివంగత టిఎస్ దిఘాలే అప్పట్లో చేసిన ఫిర్యాదుతో కోకటే సోదరులపై కేసు నమోదైంది. 1995 నాటి ఈ కేసులో మొత్తం 10 మంది సాక్షులను విచారించిన నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు కోకతే సోదరులిద్దరినీ దోషులుగా తేల్చి శిక్షలు విధిస్తూ తీర్పు ఇచ్చింది. మరోవైపు, కోర్టు విచారణకు హాజరైన మంత్రి మాణిక్‌రావ్ మాట్లాడుతూ ఈకేసులో తనకుబెయిల్ మంజూరైందని తెలిపారు. ఈతీర్పుపై అప్పీల్‌కు వెళతానని చెప్పారు.

### జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందన్న లోక్‌పాల్‌కు
## సుప్రీం నోటీసులు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ ఉత్తర్వులు ఆందోళనకర మంటూ ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు పంపింది. హైకోర్టు సిట్టింగ్ అదనపుజడ్జిపై దాఖ లైన రెండు ఫిర్యాదులను లోక్‌పాల్ విచారి స్తోంది. లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టి స్టే విధించింది.

# తూర్పు ఐరోపా నుంచి అమెరికా దళాలు వెనక్కి!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు అనుకూలంగా మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ మేరకు జర్మనీ పత్రిక బిల్డ్ కథనం ప్రచురించింది. దీని ప్రకారం.. 1990 తర్వాత నాటోలో చేరిన దేశాల్లో ఉన్న అమెరికా సేనలను వెనక్కి పిలిపించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. దీంతో అల్బానియా, బల్గేరియా, క్రొయేషియా, ఎస్తోనియా, ఫిన్‌లాండ్, హంగేరీ, లాత్వియా, లిథువేనియా, మాంటెనెగ్రో, నార్త్ మెసిడోనియా, పోలాండ్, రొమానియా, స్లొవేకియా, స్లొవేనియా, స్వీడన్‌ల నుంచి దళాలు వెనక్కి వచ్చే అవకాశాలున్నాయి. వీటితోపాటు ఇటలీ, కొసావో నుంచి అమెరికా దళాలు వైదొలిగే అవకాశాలున్నాయి.

ముఖ్యంగా బాల్టిక్ దేశాల నుంచి దళాలను వెనక్కి రప్పించడంపై ట్రంప్ సానుకూలంగా స్పందించొచ్చని అధికార వర్గాలు నమ్ముతున్నాయని ఫైనాన్షియల్ పత్రిక పేర్కొంది. దీనిపై లథువేనియా అధ్యక్షుడు స్పందిస్తూ.. అమెరికా-ఐరోపా సైనిక సహకారం భవిష్యత్తుపై చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. అమెరికా దళాలను వెనక్కి తీసుకొంటుందనే సంకేతాలు ఇప్పటివరకు లేవన్నారు.

తూర్పుఐరోపాలోని పోలాండ్‌లో అమెరికా దళాలు అత్యధికంగా ఉన్నాయి. వీరి సంఖ్య 10,000కు పైగా ఉండొచ్చు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ముగించేలా ట్రంప్ హడావుడిగా చర్యలు చేపట్టారు. కాస్తభూమితో పోయేదాన్ని యుద్ధం వరకూ తీసుకొ చ్చారని జెలన్‌స్కీనే ట్రంప్ నిందించారు. ఈ క్రమంలో తాజాగా తూర్పు ఐరోపా నుంచి సేనల విరమణ కూడా రష్యాకు సానుకూలంశం అవుతుంది.

**పెంటగాన్ రక్షణ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని ఆదేశాలు**

పెంటగాన్‌న డిఫెన్స్ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సే ఆదేశాలు జారీ చేశారు. యేటా 8 శాతం చొప్పున తగ్గించుకొంటూ రావాలని పేర్కొన్నారు. ఈ కోతలను ఫిబ్రవరి 24 నాటికి సిద్ధం చేయాలని వెల్లడించారు. బడ్జెట్ తగ్గింపుల నుంచి 17 విభాగాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. వీటిల్లో అణ్వాయుధాలు, అమెరికా దక్షణ సరిహద్దుల్లో కార్యకలాపాలు, మిస్సైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌లు వంటివి ఉన్నాయి. గతేడాది అమెరికా 850 బిలియన్ డాలర్లను రక్షణ కోసం వెచ్చించింది. 2023 నాటికి దీనిలో 300 బిలియన్ డాలర్లను తగ్గించాలని హెగ్సే లక్ష్యంగా పెట్టుకొన్నారు.



# భారత్‌లో టెస్లా తయారీ అన్యాయమే!
### మస్క్ పక్కన ఉండగానే ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా దిగ్గజ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా భారత్‌మార్కెట్‌లోకి ఎంట్రీకి సిద్ధం అవుతోంది. ఇప్పటికే ఈ సంస్థ నియామకాలు, షోరూంల ఏర్పాటుకోసం ప్రయత్నాలు ప్రారంబించింది. అయితే ఈప్రక్రియ ఎంత మాత్రం ట్రంప్‌కు ఇష్టంలేదు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలనే టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ప్రణాళిక అమెరికాకు అన్యాయం చేయడమే అని అన్నారు. మస్క్ పక్కన ఉండగానే అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలుచేసారు. ఇద్దరూకలిసి ఒక టివి ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. భారత్‌లోకి టెస్లా ఎంట్రీ ప్రణాళికలపై ట్రంప్ మాట్లాడారు. ప్రపంచంలోని ప్రతిదేశం అమెరికాను వాడుకోడానికి ప్రయత్నిస్తోందని, సుంకాలతో మానుంచి లబ్దిపొందాలని చూస్తున్నారని అందువల్లనే ఎలాన్‌మస్క్ తన కార్లను విక్రయించడం అసాధ్యం అవుతోందన్నారు. భారత్‌నే చూడండి ఆయన భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఆయన వరకూ అది మంచిదే కావచ్చు. కానీ అమెరికాపరంగా అది చాలా అన్యాయమైన నిర్ణయమని ట్రంప్ అన్నారు.

గతవారం ప్రధానిమోడీతో భేటీని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ఆ సమావేశంలో విద్యుత్ కార్లపై అధిక సుంకాల విషయాన్ని మోడీతో ప్రస్తావించినట్లు తెలిపారు. సుంకాలసమస్యను పరిష్కరించుకోవడంతోపాటు వీలయినంత సత్వరమే వాణిజ్య ఒప్పందంకోసం ఇరుదేశాలు కలిసి పనిచేసేలా నిర్ణయంచామని అన్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో టెస్లా అధినేతతో భేటీ అయ్యారు. తర్వాత కొన్నిరోజులకే ఈసంస్థ భారత్‌లో నియామకాలుచేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచే అమ్మకాలు ప్రారంభించనున్నది. అయితే కార్ల తయారీపై మాత్రం టెస్లా నిర్ణయాన్ని ప్రకటించలేదు. భారత ప్రభుత్వం నూతన ఈవీ పాలసీని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కార్లతయారీ సంస్థలుదేశంలో కనీసం 500 మిలియన్ డాలర్లుపెట్టుబడి పెట్టడంతో ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే దిగుమతి సుంకాలను 15శాతానికి తగ్గించేవిధంగా కేంద్రం కొత్తవిధానం తెస్తోంది. దీనితో మస్క్ భారత్‌లో టెస్లా తయారీకి సిద్ధం అవుతున్నారు.

## జెలెన్‌స్కీ ఒక సక్సెస్‌ఫుల్ కమెడియన్
### ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ట్రంప్ వ్యాఖ్యలు వైరల్



**వాషింగ్టన్,ఫిబ్రవరి 20:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఒక విజయవంతమైన కమెడియన్ అని వ్యాఖ్యానించారు. అంతకుముందే తప్పుడు సమాచారం ఉచ్చులో ట్రంప్ ఉంటున్నారని, తనకు రేటింగ్ తగ్గిందని, ఈసారి ఎన్నికలు లేకుండానే జెలెన్‌స్కీ అధ్యక్షుడు కావాలని కలలు కంటున్నారన్న ట్రూత్‌లో పోస్టుచేసారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ రష్యా ఇచ్చిన తప్పుడు సమాచారమే వాస్తవమన్న భ్రమలో ట్రంప్ ఉన్నారని తనకు 57శాతం రేటింగ్ ఉందని ప్రైవేటు ఏజెన్సీలే చెప్పాయని ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ట్రంప్ తప్పుడు సమాచార బబుల్‌లో కొనసాగుతున్నారని చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడికి కోపం వచ్చింది. ఆయనొక సక్సెస్‌ఫుల్ కమెడియన్ అనిపించుకున్నారని అలాగే కొనసాగుతారని భావిస్తున్నట్లు పోస్టుచేసారు. అంతేకాకుండా రష్యాతో మొదట ఉక్రెయిన్ వివాదాన్ని ప్రారంభించిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. 350 బిలియన్ డాలర్లు అమెరికా ఖర్చుచేసినా యుద్ధంలో విజయం సాధించలేకపోతున్నారని ట్రంప్ వ్యాఖ్యా నించారు. అమెరికా లేకుండా రష్యాసేనలను ఢీకొనడం కష్టమేనని గతంలోనే జెలెన్‌స్కీ చెప్పిన సంగతి తెలిసిందే. అమెరికా లేకుండా ఉక్రెయిన్ ఈసమస్యను ఎప్పటికీ పరిష్కరించుకోలేదని ట్రంప్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌చేస్తున్న వ్యాఖ్యలు రష్యాకు మద్దతిచ్చేవిగా ఉన్నాయని, తనకు ఎన్నికల్లో రేటింగ్ నాలుగుశాతంగా ఉందని చేసిన వ్యాఖ్యలు రష్యా ఇచ్చిన తప్పుడు సమాచార మేనన్నారు. మొదట వివాదం తామే ప్రారంభించామని చెప్పడంకూడా విడ్డూరంగా ఉందని రష్యా ఉక్రెయిన్ యుద్ధంలోకి జెలన్‌స్కీ అమెరికాను లాగుతున్నారని ట్రంప్‌చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ఖండించారు. యూరోప్‌కంటే అమెరికా 200 బిలియన్ డాలర్లు వ్యయంచేసిందని, యూరోప్ సొమ్ములకు గ్యారంటీ ఉందని, అమెరికా ఎప్పటికీ వెనక్కి తీసుకోలేదని అన్నారు. ఈ యుద్ధం అమెరికాకంటే యూరోప్‌కే ఎక్కువ ప్రయోజనకరమని వేర్పాటుకు మద్యలో ఒక పెద్ద సముద్రం ఉందన్నారు.

### ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్
# పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించింది. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. దాంతో నాగేశ్వరన్ మార్చి 31, 2027 వరకు పదవిలో కొనసాగుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన 2022, జనవరి 28న సిఇఎగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతో పాటు కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం ఆయన కార్యాలయం బాధ్యత. మాజీ క్రెడిట్ సూయిస్ గ్రూప్ ఎజి, జూలియన్ బేర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్, విద్యావేత్త అయిన నాగేశ్వరన్.. కెవి సుబ్రమణియన్ స్థానంలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియామకయ్యారు.

ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో మందగమన సంకేతాల మధ్య 2024-25 ఆర్థిక సర్వే రాబోయే ఆర్థిక సంవత్సరానికి 6.3-6.8 శాతం వృద్ధి రేటును అంచనా వేసిన కొద్దివారాల తర్వాత.. నాగేశ్వరన్ పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కేంద్రం అంచనా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 6.4 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. నాగేశ్వరన్ సిఇఎగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు.. 2019 నుంచి 2021 వరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలిలో పార్ట్‌టైమ్ సభ్యుడిగా పని చేశారు. భారత్, సింగపూర్‌లో అనేక బిజినెస్ స్కూళ్లకు పని చేశారు. నాగేశ్వరన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (ఎంబిఎ) డిగ్రీని పొందారు. 1994లో మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆయన ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, క్రియా విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

# చైనాతో అమెరికా ఒప్పందం!
### వాణిజ్య యుద్ధ భయాల వేళ ట్రంప్ పచ్చజెండా

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** దూకుడు నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. డ్రాగన్‌తో ట్రేడ్ వార్ డీల్ రూపుదాల్చే అవకాశం ఉందని తాజాగా వ్యాఖ్యలు చేశారు. 2020లోనే చైనాతో ఒక గొప్ప వాణిజ్య ఒప్పందం జరిగిందని మీడియాతో మాట్లాడుతూ గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ జరుగుతుందన్న ఆందోళనల వేళ అగ్రరాజ్య అధ్యక్షుడి నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన నోటిలో టారిఫ్ పదమే వినిపిస్తోంది. దానికి తగ్గట్టే మిత్రులు, శత్రువులు అనే తేడా లేకుండా అన్ని దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తానని తేల్చి చెప్పారు. వాణిజ్య లోటును తగ్గించుకోవడం కోసమే ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు.

చైనా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకునే వస్తువులపై 10 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దానికి చైనా కూడా కౌంటర్ ఇచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ద్రవీకృత సహజ వాయువుపై (ఎల్ఎన్‌జి) 15 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ముడి చమురు, వ్యవసాయ పరికరాలు, పెద్ద ఇంజిన్ల కార్లపై 10 శాతం సుంకాన్ని వసూలు చేయనున్నట్లు తెలిపింది. ఇలా ఒకరిపై ఒకరు పరస్పర సుంకాలు విధించుకుంటున్న తరుణంలో ట్రంప్ నుంచి ఈ స్పందన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

21-2Pg6exHMNWJQE.qxd:21-2Pg6exHMNWJQE.qxd 01/01/01 9:54 AM Page 1



# రాష్ట్రంలో అత్యంత శక్తిమంతమైన, సమర్ధవంతమైన పాలన సాగుతోంది

## - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్



**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో అత్యంత శక్తివంతమై,సమర్ధవంతమైన ప్రభుత్వపాలనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సాగిస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.గత ప్రభుత్వం ఆర్దికరంగంలో చేసిన విధ్వంసాన్ని గుర్తించి, పరిస్థితిని చక్కదిశే దిశలో ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తున్నామన్నారు.తమంతా ప్రతి విషయంలోను సమన్వయంతోనే కలిసి ముందుకెళ్తున్నాం పవన్ కల్యాణ్ తెలిపారు.ప్రమాణస్వీకారం ముగిసిన తర్వాత ఎన్డీఏ నేతలందరికీ భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా విందును ఏర్పాటు చేశారు. విందుకు హాజరై బయటకు వస్తున్న సమయంలో పవన్‌తో జాతీయ మీడియా కాసేపు చిట్‌చాట్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏపీలో తాజా పరిస్థితులపై మీడియా అడిగిన ప్రశ్నలకు పవన్ సమాధానం ఇచ్చారు.వెన్నునొప్పితో ఏపీలో కొన్ని భేటీలకు హాజరుకాలేకపోయానని పవన్ కల్యాణ్ అన్నారు. ఇప్పటికీ వెన్నునొప్పి తీవ్రంగా బాధిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తోందన్నారు.పవన్ జగన్ అప్పుల కుప్పగా మార్చినందున ఆర్థిక ఇబ్బందులు చవిచూడాల్సి వస్తుందన్నారు.వాటి ప్రభావం ప్రజలపై లేకుండా సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు.పర్యావరణ, అటవీశాఖలు నాకు ఇష్టమైన శాఖలని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.నిబద్ధతతో నా మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నా అన్నారు.ఏపీ పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధిని తాము అధికారంలోకి అడుగుపెట్టిన తరువాత గాడిలో పెట్టామన్నారు.జల్‌జీవన్ మిషన్ అమలులో కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు.ఇందుకు అవసరమైన నిధులను కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ తెప్పించుకుంటున్నామన్నారు.గ్రామీణ రహదారుల రూపురేఖలు మారుతున్నాయన్నారు.అన్ని మౌలిక వసతుల కల్పనకు అవకాశం కల్పిస్తున్నామన్నారు.సనాతన ధర్మం పట్ల తనకు అపారమైన నమ్మకం,గౌరవం ఉన్నాయన్నారు.తాను వాటిని ఆచరిస్తున్నా అన్నారు.ప్రధాని తన పట్ల అభిమానంతో " హిమాలయాలకు వెళ్తున్నావా ! అని చమత్కరించారన్నారు.తాను ఆయన చెప్పినట్లే బాధ్యతగా వ్యవహరిస్తున్నానన్నారు.ఈ దేశంలో అత్యుత్తమ సంస్కరణలతో,చప్రజల పట్ల బాధ్యత కనపరుస్తూ ప్రధాని మోడీ పరిపాలన అందిస్తున్నారన్నారు.ఆయన పట్ల ప్రజాభిమానానికి నిదర్శనం ఢిల్లీలో 27ఏళ్ళ తరువాత బిజెపి అధికారంలోకి రావడమన్నారు.ఇది సామాన్య విషయం కాదన్నారు.



స్వర్ణశోభితంగా కనువిందు చేస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయ దృశ్యం (ఇన్‌సెట్‌లో) కన్నప్ప

# భోళాశంకరుని సన్నిధిలో మహాశివరాత్రి సంబరాలు

## నేడు కన్నప్ప ధ్వజారోహణతో శివరాత్రికి శ్రీకారం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** తిరుపతి జిల్లాలోని శ్రీకాలహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గెలిచిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి ఇవి మొదటి శివరాత్రి బ్రహ్మోత్సవాలు కాబట్టి ఆయనే అన్ని తానే అయి పర్యవేక్షించుకుంటూ ముందుకు సాగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముగ్గురు మంత్రులను రప్పించి సమీక్షలు జరిపారు. ఖర్చులతో సంబంధం లేకుండా నిర్వహించుటకు నిర్ణయించారు.ఇక్కడి ఉత్సవాల్లో అగ్రతాంబూలం భోళాశంకరుడు తనకు కన్నులు అర్పించిన తిన్నడికి ఇచ్చారు.ఇది ఈ దివ్యక్షేత్రంలో ప్రసిద్ధి. ఆలయానికి తూర్పున కొండపై భక్తకన్నప్ప ఆలయ నిర్మాణం గమనిస్తే మూగజీవాలకే కాకుండా తన భక్తులకు కూడా ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో మనకు అర్థమౌతుంది.శుక్రవారం సాయంత్రం భక్త కన్నప్ప ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమౌతాయి.ఇందుకు అధికారులు ముస్తాబులు చేశారు. కన్నప్ప కొండను అందంగా తీర్చి దిద్దారు. నెల రోజుల నుంచి అధికారులు, సిబ్బంది రేయింబవళ్ళు తేడా లేకుండా కృషి చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు.శివరాత్రికి అవసరమైన ఏర్పాట్లు అన్ని చేపట్టారు. దేశ నలుమూలలలోని ప్రజా ప్రతినిధులు మంత్రులకు శాసనసభ్యుడే ఆహ్వానాలు అందించారు. స్వర్ణశోభిత ఆలయంలో బ్రహ్మోత్సవ సంబరం: దక్షిణకైలాసంగా బాలసిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం స్వర్ణశోభితంతో విరాజిల్లుతోంది.వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబం సహకారంతో ఆలయం బంగారుమయమైంది. సాధారణంగా పరమేశ్వరుడు స్మశానాధీశుడుగా విష్ణుమూర్తిని లక్ష్మీనిలయుడుగా వర్ణిస్తుంటారు. శివుని ఆలయాలు సాధారణ అలంకారాలతో కనిపిస్తుంటే, వైష్ణవాలయాలు స్వర్ణకాంతులతో కనువిందు చేస్తూంటాయి. తెలుగుదేశం గతంలో నియమించిన పాలకమండలి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో దాతల సహకారంతో కైలాసనాధున్ని నిలయాన్ని స్వర్ణమయంగా మార్చారు. 2017లో మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకుని వాయులింగేశునిపై అచంచల భక్తిభావంతో పలువురు దాతలు ముందుకు వచ్చి భూరి విరాళాలుగా ఆలయంలో స్వర్ణతాపడం పనులను చేపట్టిరికార్డు స్థాయిలో పూర్తిచేశారు. ఆలయ శిఖరాలు సుమారు 99 కలశశిఖరాలు ఆలయపరిధిలో ఉండగా నేడు అన్నింటినీ బంగారు తాపడం చేయించి ప్రతిష్ఠింపచేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచే శ్రీకాళహస్తి ఆలయం స్వర్ణకాంతులతో ప్రకాశవంతమవుతూ భక్తులకు కనువిందు చేస్తోంది. అంతేకాక శ్రీకాళహస్తికే తలమానికంగా ఉండిన శ్రీకృష్ణదేవరాయలచే నిర్మించబడిన గాలిగోపురం 2010లో కుప్పకూలడంతో ప్రధానలోటుగా మారింది. అయితే నవయుగ నిర్మాణ సంస్థ ప్రతిష్టాత్మక ంగా తీసుకుని రాజగోపురాన్ని పునఃనిర్మించి కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు.ఈ ఏడాది గోపురానికి సరికొత్త అందాలను దిద్దారు. దాంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తికి తలమానికమైన గాలిగోపురం కూడా బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక కళ సంతరించుకుంది.గోపురం చుట్టూ హరితాన్ని ఆపాదించారు . ఇక ఆలయం లోపల స్వామివారి ధ్వజస్తంభానికి బంగారు తాపడం పనులు భక్తులు ఆనందపరవశులయ్యేలా చేస్తోంది. స్వామి వారి గర్భాలయమే అత్యంత విశేషమహిమాన్వితమైనది స్వామివారి ఉచా ్వసనిశ్వాసలకు నిలయమైన వాయుదీపం చూసి భక్తులు భక్తితన్మయత్వంలో మురిసిపోతుంటారు. అలాంటి మహాభాగ్యంతోపాటు శివరాత్రికి స్వామివారి పానమట్టం స్వర్ణతాపడం భక్తజనాన్ని మనోఆనందాన్ని రెట్టింపుచేయనున్నది.

**.జ్ఞానాంబిక-స్వర్ణాంభిక:** శ్రీకాళహస్తి ఆలయంలో కొలువుదీరిన దేవేరి జ్ఞానప్రసూనాంబికాదేవి స్వర్ణతేజోమయంతో వెలిగిపోతోంది. దేవేరి జ్ఞానాన్ని అనుగ్రహించే మాతగా సకల కోరికలను తీర్చే కల్పవల్లిగా భాసిల్లుతోంది. అలాంటి అమ్మవారి నిలయం మహాశివరాత్రికి స్వర్ణశోభితంతో భక్తజనాలకు కనువిందు చేస్తోంది. పాలకుల విశేషకృషితో అమ్మవారి నిలయాన్ని బంగారు తేజోమయంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ముఖమండపాన్ని బంగారు తాపడం చేయించారు.దీంతో దేవేరి నిలయం స్వర్ణశోభితంగా మారింది. అంతేకాక అమ ్మవారి మకరతోరణం కూడా దాత ముందుకు వచ్చి స్వర్ణతాపడం చేయించడంతో గర్భాలయంలో దేవేరి అటు నిత్యాలంకరణలో బంగారు చీర,

వజ్రకిరీటం, బంగారు మకరతోరణంతో జ్ఞానాంబిక స్వర్ణాంభికగా భక్తులకు దర్శనమిస్తోంది. ఇలా ఆలయంలో ప్రధానమైన కలశాలు, ధ్వజస్తంభం, అమ్మవారి గర్భాలయం స్వర్ణశోభితంగా మారి శ్మశానాధీశుని నిలయం స్వర్ణతేజో నిలయంగా మారి శివరాత్రికి భక్తులకు ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో తేలియాడేలా చేస్తోంది. రేపటి నుండి ప్రారంభమౌతున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల సంబరాల్లో భక్తజనాలను స్వర్ణాలయం విశేషంగా ఆకర్షించనున్నది.

# గన్నవరంలో మైనర్ బాలికలు అదృశ్యం

## - 4 గంటల్లో పట్టుకున్న పోలీసులు

**గన్నవరం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఒకేసారి 5గురు మైనర్ బాలికలు అదృశ్యం కావటం కృష్ణాజిల్లాలో కలకలం సృష్టించింది. విజయవాడలోని ఓప్రయివేటు కళాశాలలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఐదుగురు మైనర్ బాలికలు గురువారం ఉదయం ఒక్కసారిగా అదృశ్యం కావటంతో పోలీసువర్గాల్లో కలవరం రేకెత్తింది. వెంటనే స్పందించిన గన్నవరం సిఐ శివప్రసాద్ తన సిబ్బందితో రంగంలోకి అదృశ్యమైన విద్యార్థినిలను నాలుగుగంటల్లో పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే గన్నవరం మండలం ముస్తాబాద గ్రామానికి చెందిన నలుగురు బాలికలు కళాశాలకు బస్సులో వెళుతుంటారు. వీరితో విజయవాడ మాచవరంకు చెందిన మరో బాలిక స్నేహం చేస్తుంది. ఈనేపధ్యంలో ముస్తాబాద గ్రామానికి చెందిన ఒక బాలిక కళాశాలకు సరిగా వెళ్ళటం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈఐదుగురు స్నేహితులు ఇంటి నుండి పారిపోవాలని పధకం రూపొందించుకున్నారు. శుక్రవారం వేకువ జామున మూడుగంటల సమయంలో ఓబాలిక అదృశ్యం కావటం తల్లిదండ్రులు గుర్తించి 112కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేసారు. వెంటనే స్పందించిన గన్నవరం సిఐ శివప్రసాద్ రంగంలోకి దిగి ముస్తాబాద గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈబాలిక స్నేహితులను విచారించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో మిగిలిన ముగ్గురు బాలికలు ఇంటలోలేని విషయం వెలుగులోకి వచ్చింది. ఈదశలో ఓబాలిక హైదరాబాద్‌లో పరీక్షరాసేందుకు వెళుతున్నట్లు చెప్పటంతో సదరు బాలిక తండ్రి తన కుమార్తెను ఉదయం 4గంటలకు విజయ వాడలో దింపివచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడికాగా పోలీసులు శరవేగంగా విజయవాడ చేరుకుని విచారణ వేగవంతం చేసారు. ఓబాలిక వద్ద ఫోన్ ఉండటంతో ఫోన్‌లో బాలిక తల్లితో మాట్లాడించారు. ఈక్రమంలో బాలికలు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళుతున్నట్లు గుర్తించి ఆమార్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించారు. బాలికలు ప్రయాణి స్తున్న రైలు పిడుగురాళ్ల వద్దకు చేరుకోగానే ఐదుగురు బాలికలను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

# జిఒ నెం.426ని సమర్ధిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే కొనసాగింపు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ దేవాదాయ ,ధర్మాదాయ చట్ట పరిధిలోకి వచ్చే ఆలయాల ప్రాంగణాల్లోని దుకాణాల నిర్వహణకు పిలిచే టెండర్లలో హిందూయేతరులు పాల్గొనకూడదని పేర్కొంటూ 2015 లో ఏపీ ప్రభుత్వం జారీచేసిన జీఓ నెం.426 ని సమర్ధిస్తూ హైకోర్టు 2019 సెప్టెంబరు 27న ఇచ్చిన తీర్పుపై స్టే కొనసాగిస్తూ సుప్రీంకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఎండీ రఫీ, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించగా 2020 ఫిబ్రవరి 27న జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ కేఎం జోసెఫ్‌ల నేతృత్వంలోని ధర్మాసనం, హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తర్వాత ఈ కేసు విచారణ 12 సార్లు వాయిదా పడింది. జీఓ అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించిన, ఆలయాల దుకాణాల నిర్వహణలో హిందూయేతరులు పాల్గొనకుండా ఇదివరకు రెండుసార్లు టెండర్లు జారీ చేయడంతో పిటిషనర్లు కోర్టు దిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు.వాటిని దృష్టిలో ఉంచుకొని అధికారులు కోర్టుకు క్షమాపణలు చెప్పి ఆ టెండర్లను ఉపసంహరించారు. మళ్లీ ఇప్పుడు శ్రీశైలం మరికొన్ని ఆలయాల దుకాణాల నిర్వహణకు హిందూయేతరులను మినహాయిస్తూ టెండర్లు పిలిచిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పిటిషనర్లు తాజాగా క్లారిఫికేషన్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై బుధవారం జస్టిస్ అభయ్ ఎస్.ఓక, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టినప్పుడు ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ దేవాదాయశాఖ అధికారులు తప్పు తెలుసుకొని టెండర్లను ముందే ఉపసంహరించుకున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇదే సమయంలో పిటిషనర్ల తరఫు న్యాయవాదులు జోక్యం చేసుకుంటూ రాష్ట్ర అధికారులు పదేపదే ఇలాంటి టెండర్లుజారీ చేస్తున్నారని, మూడోసారి ఇలాంటి పొరపాటు చేసినందున భవిష్యత్తులో ఇలా జరుగకుండా స్పష్టత ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరడంతో 2020 ఫిబ్రవరి 27న జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఉందని, తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు అది కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన వైఎస్సార్సీపీ నేతలు

## - కూటమి దురుద్దేశాలు మాకు తెలుసు: ప్రతిపక్షనేత బొత్ససత్యనారాయణ



గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందిస్తున్న వైకాంగ్రెస్ పార్టీ నేతలు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:**మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తోందని శాసన మండలిలో ప్రతిపక్షనేత బొత్సా సత్యనారాయణ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ అరాచకాలకు పాల్పడుతుంద న్నారు. తాజాగా గుంటూరు పర్యటనలో ఆయనకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏపీ ప్రభుత్వ వైఫల్యంపై వైఎస్సార్‌సీపీ నేతలు బొత్స సత్యనారాయణ,మెరుగు నాగార్జున,అంబటిరాంబాబు,కారుమూరి నాగేశ్వరరావు, మొండితోక అరుణ్‌కుమార్, వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు గురువారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ జస్టిస అబ్దుల్ నజీర్‌ను కలిసి ఫిర్యాదుచేసారు.ఆయనకు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై వినతి పత్రం అందించారు. అనంతరం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎంగా వైఎస్ జగన్ కు జెడ్ ఫస్ల్ సెక్యూరిటీ ఉంటుంది. ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడ భద్రత కల్పించాలి. కానీ గుంటూరు పర్యటనలో ఒక్క కానిస్టేబుల్ కూడా కనిపించలేదు. వైఎస్ జగన్ భద్రతపై మాకు ఆందోళన ఉంది. మా ఆందోళనను గవర్నర్‌కు తెలియజేశాం. ఆయకు రక్షణ కల్పించాలని గవర్నర్‌ను కోరాం మా ఫిర్యాదుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. చట్టం తమ పని తాను చేసుకునేలా చేయాలి. కానీ కూటమి ప్రభుత్వం దురుద్దేశాలు మాకు తెలుసు. జగన్‌ను ఇబ్బందిపెట్టాలనే ఏకపక్షంగా భద్రత తగ్గిస్తున్నారు. మా హయాంలో ఎక్కడైనా భద్రత తగ్గించామా? అని కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి బొత్స నిలదీశారు. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతున్న టీడీపీ నేతలు ఇబ్బందుల్లో ఉన్న రైతులను తమ పార్టీనేత పలకరిస్తే కొత్త భాష్యాలు చెబుతున్నారన్నారు.ఎన్నికల కోడ్ అధికార పార్టీకి వర్తించదా ? అన్నారు.

# మంత్రులపైనా క్రిమినల్ కేసులు

## ఇద్దరు ఢిల్లీ మంత్రులు బిలియనీర్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీలో కొత్త సీఎంగా బాధ్యతలుచేపట్టిన రేఖాగుప్తా కేబినెట్ మంత్రులపై తీవ్రస్థాయి క్రిమినల్‌కేసులు కూడా ఉన్నాయి. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినవారిపై క్రిమినల్‌కేసులు నమోదయి ఉన్నాయి.మంత్రి ఆశిష్‌సూద్‌పై తీవ్రమైన నేరారోపణలున్నట్లు ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఎడిఆర్) క్రటించింది. ఎన్నికల్లో వారిచ్చిన అఫిడవిట్ల ఆధారంగానే వీటిని ప్రకటించింది. షాలిమార్‌బాగ్‌నుంచి తొలిసారి బిజెపి ఎమ్మెల్యే అయిన రేఖ గుప్తా ఢిల్లీ 9వ సీఎంగా గురువారంబాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. కేబినెట్‌మంత్రుల్లో ఇద్దరు బిలియనీర్లు ఉన్నారు. రాజౌరి గార్డెన్‌నియోజకవర్గంనుంచి బిజెపి ఎమ్మెల్యే మంజీందర్‌సింగ్ సిర్సాకు 248.85 కోట్ల ఆస్తులున్నాయి. కరావాల్ నగర్‌నియోజకవర్గానికి చెందిన మంత్రి కపిల్‌మిశ్రా అతితక్కువగా 1.06 కోట్లఆస్తులుప్రకటించారు. ఏడుగురు మంత్రుల సగటు ఆస్తులు రూ.56.03 కోట్లుగా ఉంది. న్యూఢిల్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం తనకు అత్యధికంగా రూ.74.36 కోట్ల అప్పులున్నట్లు చెప్పారు. ఏడుగురు మంత్రుల్లో ఆరుగురు గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువస్థాయి విద్యార్హతలున్నఆరు అయితేఒక మంత్రి మాత్రం 12వ తరగతి మాత్రమే పూర్తిచేసారు.

# నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రిజర్వే షన్లపై మాట్లాడిన కేసులో కోర్టుకు రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజర య్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై బేగంబజార్ పీఎస్‌లో, నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం 3 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ ప్రభు త్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్‌ఛైర్మన్ తిరుపతి వర్మ అన్నారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు వచ్చే నెల 23కి వాయిదా వేసింది.

# ఏఐజి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్న మాజీ సిఎం కెసిఆర్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గురువారం గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం కెసిఆర్ తన సతీమణి శోభతో కలిసి ఏఐజీ ఆసుపత్రికి వచ్చి పలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కెసిఆర్ తిరిగి తన ఇంటికి వెళ్లిపోయారు. ఆసుపత్రికి వచ్చిన కెసిఆర్ ఆరోగ్యంపై పూర్తివివరాలు సేకరించిన ఆసుపత్రి డాక్టర్లు అవసరమైన పరీక్షలు నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిఆర్ఎస్ అధినేత తన ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో కాలుజారి పడిపోవడంతో తుంటిఎముక విరిగి గాయ పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు తుంటి ఎముక శస్త్రచికిత్స చేయిం చుకున్న కెసిఆర్ కొన్ని నెలలుగా తన ఫాంహౌజ్‌లోనే విశ్రాంతి తీసుకుం టున్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాక్రమాలపై ఫాంహౌజ్ నుంచే పర్య వేక్షించడంతోపాటు ఫాంహౌజ్ కేంద్రంగా పార్టీ నేతలతో సమావే శమవుతున్నారు. కాగా కొన్నినెలల అనంతరం ఫాంహౌజ్ నుంచి బయటకు వచ్చిన కెసిఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ 25 వసంతాల వేడుకలో పాల్గొని కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాగా గురువారం కెసిఆర్ ఏఐజీ ఆసుపత్రికి వచ్చినట్లు తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందగా, సాధారణ వైద్య పరీక్షల కోసమే కెసిఆర్ ఏఐజీ ఆసుపత్రికి వెళ్లినట్లు బిఆర్ఎస్ వర్గాలు ప్రకటించాయి. కాగా తన మనవడు, మాజీమంత్రి కెటిఆర్ కుమారుడు హిమాన్షును చూసేందుకు కెసిఆర్ త్వరలో విదేశాలకు వెళ్లనున్నారని, అందులో భాగంగానే తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ముందు జాగ్రత్త కోసం ఏఐజీ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్నారని సమాచారం అందుతుంది. ఇందులో భాగంగానే కెసిఆర్ తన పాస్‌పోర్టు రిన్యూవల్ కోసం బుధవారం సికిందరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని సందర్శించారని అంటున్నారు. గురువారం వైద్య పరీక్షల అనంతరం కెసిఆర్ తన కుటుంబసభ్యులతో కలిసి నందిహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లారు.

# కలుషితాహారంతో 28 మంది విద్యార్థులకు అస్వస్థత

## మూడు రోజులుగా వర్సిటీలోనే చికిత్స

## యాజమాన్యంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోనీ ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సంఘటన చోటుచేసుకున్నది. పోలేపల్లి సెజ్‌లోనీ ఎస్వీకేఎం ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో కలుషిత, నాణ్యతలేని ఆహారం తీసుకోవడం వల్ల సుమారు 28మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు, విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యి మూడు రోజులు కావడంతో సమాచారం బయటకు రాకుండా చర్యలు తీసుకున్నారు. యూనివర్సిటీలోనే బెడ్లపై, మంచాలు వేసి సెలైన్లు పెట్టి చికిత్స అందిస్తూ వచ్చారు. విషయం బయటకు వస్తే తమ యూనివర్సిటీకి చెడ్డపేరు వస్తుందని గుట్టుగా చికిత్స అందించారు. ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి హుటా హుటీగా యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీ యాజమాన్యానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ఫైర్ అయ్యారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని యూనివర్సిటీ యాజమాన్యానికి సూచించారు. యాజమాన్యం నిర్లక్ష్యానికి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటనపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి స్పందించారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. యూనివర్సిటీలోనే ఆహారం కల్తీ జరగడం విద్యార్థులు అస్వస్థకు గురికావడం బాధాకరమన్నారు. యాజమాన్యం మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

# గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

## 300 కిలోల సరకు, కంటైనర్ వ్యాను స్వాధీనం

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** డ్రగ్స్ విక్రేతను పట్టు కున్న ఎస్ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడి నుంచి 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర పూణెకి చెందిన అహ్మద్ గులాబ్ షేక్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. విలాసాలకు అలవాటు పడిన నిందితుడు సులు వుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి రవాణా మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో అరకు నుంచి మహారాష్ట్రకు డిసిఎం కంటైనర్ వ్యానులో స్క్రాప్ మధ్యలో గంజాయిని తరలిస్తుండగా... విశ్వ సనీయ సమాచారం మేరకు మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు అబ్దుల్లా పూర్‌మెట్ పోలీసుల సహకారంతో రామోజీ ఫిల్మ్‌సిటీ వద్ద డీసీఎం కంటైనర్ వాహనాన్ని(ఎంహెచ్ 16 సీడీ 2076)పట్టుకుని తనిఖీ చేసి గంజాయిను గుర్తించారు.

# ఎన్నికల్లో ఓడిపోతే నా పరిస్థితి ఘోరంగా మారేది!

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అధ్యక్ష న్నికల్లో ఓటమి పాలయి ఉంటే తన జీవితం మరింత దారు ణంగా ఉండేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అన్నారు. గత ప్రభుత్వం తనతో అత్యంత దారుణంగా వ్యవహరించిందని ఆరోపించారు. మియామిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే తన జీవితం చాలాఘోరంగా మారిపోయేదని అన్నారు. న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ జీవితంగడిసపే పరిస్థితి వచ్చుండేదన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఓటమి పాలయితే తర్వాత పోటీచేసేందుకు చాలా ధైర్యం అవసరం అయ్యేదన్నారు. గత ప్రభుత్వం తనపై అత్యంత దారుణంగా ప్రవర్తించిందంటూ ఆరోపించారు. 2024లో అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాట్ అభ్యర్థి కమలా హ్యారిస్‌పై ట్రంప్ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలకు ముందు ట్రంప్ పోర్న్‌స్టార్‌కు హష్‌మనీ కేసుతో సహా పలు క్రిమినల్, సివిల్‌కేసులు ఎదుర్కొన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైన అనంతరం ఆయనపై ఉన్న రెండు ఫెడరల్‌కేసులనుంచి ఊరట లభించింది. హష్‌మనీకేసులో న్యూయార్క్ న్యాయమూర్తి షరతులులేని డిశ్చార్జిని వర్తింపచేసారు.

# అమృత తుల్యమైన మన తెలుగును కాపాడుకుందాం

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మనం తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే మనకు అలవడే భాష మాతృభాష, ఇదే మన అస్తిత్వం, ఇదే మన సంస్కృతి, సంప్రదాయాలకు మూలం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భాష, సంస్కృతులకు అవినాభావ సంబంధముందని, భాష మన సంస్కృతికి జీవనాడి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతమైన సంస్కృతి, ఉన్నతమైన సమాజానికి బాటలు వేస్తుందన్నారు. భారతదేశపు భాషా వైవిధ్యతే, మన గొప్ప నాగరికతకు పునాది. మన ఆటలు, మాటలు, పాటలు, సంగీతం, కళలు, పండుగలు, పబ్బాలు, వ్యాపార సంబంధాలు భాష లేకుండా పెంపొందలేవు అన్నారు. వీటన్నింటినీ కాపాడుకుని భవిష్యత్ తరాలకు అనుగుణంగా పరిస్థితులు కల్పించాలంటే మన మాతృభాషను మనం కాపాడుకోవాలని అన్నారు. మన దైనందిన జీవితంలో మాతృభాష వినియోగం పెరగాలన్నారు. మన మాతృభాష అయిన తెలుగు ప్రాశస్త్యం గురించి ఎంత చెప్పినా తక్కువే. మన భాష చాలా గొప్పది. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని కృష్ణ దేవరాయలు అన్నా, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా ప్రశంసలందుకున్నా విశ్వనాథ సత్యనారాయణ అమర భాష అని కీర్తించినా సినారె, శ్రీశ్రీ వంటి ప్రముఖులెందరో తమ జీవిత సర్వస్వం తెలుగే అని ఎలుగెత్తి చాటినా తమిళ కవి సుబ్రమణ్య భారతి, తెలుగు వంటి సుందరమైన భాష మరొకటి లేదని పొగడినా, నికొలో కోంటీ, అబ్దుల్ అల్ హసన్ బహమనీ వంటి విదేశీయులు, తెలుగును స్వర్గపు భాషగా పేర్కొన్నా ఇదంతా తెలుగు భాష గొప్పదనమే అన్నారు. ఎన్నో యాసలు, మరెన్నో మాండలికాలు. ఒక్కో దాంట్లో, ఒక్కో అందమైన భావన అన్నారు. ఇవేవీ ఇతర భాషల్లో అంతగా కనిపించవు అన్నారు. అవధానం వంటి అద్భుతమైన ప్రక్రియ ఒక్క తెలుగు భాషకే సాధ్యం అన్నారు. ఇదీ మన తెలుగుభాష గొప్పదనం. అందుకే మన అమృతపు భాషను కాపాడుకోవడానికి మనమంతా పునరంకితం అవుదామని కేంద్ర మంత్రి అన్నారు.

21-2P g7exHMNWJQE111.qxd:21-2P g7exHMNWJQE.qxd 01/01/01 10:14 AM Page 1



# ముగిసిన పెద్దగట్టు జాతర

### సూర్యాపేటకు చేరిన మకర తోరణం
### స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పూజారులు
### చివరిరోజు కూడా దైవదర్శనం చేసుకున్న భక్తులు
### హుండీలోని కానుకల లెక్కింపు





**ప్రభాతవార్త, నడిగూడెం(సూర్యాపేట):** సూర్యాపేట జిల్లా దురాజ్పల్లిలో జరిగిన పెద్దగట్టు జాతర గురువారం ముగిసింది. ఈనెల 16న జాతర గంపల ప్రదక్షణతో ప్రారంభించారు. రోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 5వ రోజు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. లక్షలాదిమంది భక్తులు పెద్దగట్టుకు వచ్చి లింగమంతుల స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతర ముగింపు సందర్భంగా సూర్యాపేట యాదవ బజార్ నుండి పెద్దగట్టుకు తెచ్చిన మకర తోరణాన్ని తిరిగి స్వస్థలానికి చేర్చారు. దీంతో జాతర ముగిసిందని యాదవ పూజారులు పేర్కొన్నారు. నాలుగో రోజు నెలవారం సందర్భంగా చౌడమ్మ లింగమంతుల విగ్రహాలు ఉన్న దేవర పెట్టెను తీసుకొని మెంత బోయిన గొర్ల వంశీయులు సూర్యాపేట మండలం కేసారం వెళ్లారు. చివరి రోజు మకర తోరణాన్ని సూర్యాపేటకు చెందిన వల్లపు కోడి వంశస్థులు స్వామివారికి ధరింపజేసిన మకర తోరణాన్ని తిరిగి స్వస్థలానికి తరలించి జాతర ముగిసినట్టుగా పేర్కొన్నారు. హుండీలో వేసిన కానుకలను గురువారం ఉదయం నుండి లెక్కిస్తున్నారు. ఉండే ఆదాయం ఎంత వచ్చిందో తెలియాలంటే కొంత సమయం పట్టనుంది. లెక్కింపు కొనసాగుతుంది. అధికార యంత్రాంగం, పోలీసు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించి జాతరను విజయవంతం చేశారు. ఎక్కడ కూడా జాతీయ రహదారి 65 ట్రాఫిక్ జామ్ కాకుండా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. పెద్దగా దొంగతనాలు జరిగిన దాఖలాలు లేవు. పలువురు తప్పిపోగా వెంటనే గుర్తించి సంబంధించిన వారికి అప్పగించారు. జాతీయ రహదారిపై వాహనాలను మళ్ళించే విషయంలో కూడా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. మేరకు ఐజి సత్యనారాయణ ఎస్పి, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

పెద్దగట్టును సందర్శించిన ఐజి పోలీసులు నిర్వహిస్తున్న విధులను ప్రత్యేకంగా పరిశీలించి అభినందించిన సంగతి తెలిసిందే. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు సలహాలు ఇస్తూ విజయవంతంగా జాతర ముగిసేలా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ సిబ్బంది షిఫ్టులవారీగా పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూశారు. సౌకర్యాలు కల్పించడంలో కూడా సూర్యాపేట మున్సిపల్ అధికారులు యంత్రాంగము సఫలీకృతమయ్యారు. ఐదు రోజులపాటు జాతర నిర్వహించగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. దీన్నిబట్టే అధికార యంత్రాంగము ఎంత పకడ్బందీగా విధులను నిర్వహించి జాతరను విజయవంతం చేసిందో అర్థమవుతుంది. గురువారం టిఎస్పిఎస్సి సభ్యురాలు పాల్వాయి రజిని కుమారి జాతరను సందర్శించి స్వామి వారిని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చివరి రోజు జాతరకొచ్చిన భక్తులంతా ఇంటి ముఖం పట్టారు.

# ముస్లింల పక్షపాతి సీఎం చంద్రబాబు

**- ఇమామ్‌లు, మోజన్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం**

**-సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మెహమ్మద్ నసీర్ అహ్మద్ , ముస్లిం నాయకులు**

**గుంటూరు తూర్పు, ఫిబ్రవరి, 20 ప్రభాతవార్త :** ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు దిశగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఇందులో భాగంగా ఇమామ్ లు, మోజన్లకు గౌరవ వేతనం విడుదల చేశారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మెహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. రాష్ట్రంలోని ఇమామ్ లు,



మోజన్లకు గౌరవ వేతనం విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు కృతజ్ఞత సభ మరియు ప్రత్యేక దువ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని అన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, అభ్యున్నతికి మొదటి నుంచి సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేశారని తెలిపారు. రాష్ట్రంలో ఐదు వేల మసీదుల్లో ఇమామ్ లకు రూ.10 వేలు, మోజన్లకు రూ.5 వేలు ఇచ్చేందుకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం అమలు చేస్తున్నారని, ఇది ముస్లింల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన కేవలం ఎనిమిది నెలల కాలంలోనే ఇమామ్ లు, మోజన్ల ఆరు నెలల గౌరవ వేతనం రూ.45 కోట్లు విడుదల చేయడం పట్ల సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ముస్లింలకు రంజాన్ తోఫా వంటి కానుకలు అందించారని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ముస్లింలకు మొండి చెయ్యి చూపారని విమర్శించారు. ఇమామ్ లకు, మోజన్లకు గౌరవ వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని, మైనారిటీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించకుండా మాయమాటలు చెప్పి మభ్యపెట్టి మోసం చేశారని మండిపడ్డారు. మళ్లీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ముస్లింలకు పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, మైనారిటీ నాయకులు చిష్టి, జమీర్, హాఫీజ్, రఫీ, అన్వర్, భాషి, జాబి, ఉస్మాన్, అబ్దుల్లా, నూర్, ఖలీల్, అబ్బాస్, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# డీసిల్టింగ్ ప్రక్రియ నిరంతరం జరుగుతూ ఉండాలి : కమిషనరుధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** వర్షాలు పడినప్పుడు రోడ్డుపై నీరు నిలువకుండా ఉండేందుకు నగరంలో నిరంతరం డీసిల్టింగ్ ప్రక్రియ జరుగుతూ ఉండాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన తన పర్యటనలో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం రోడ్డు,ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్,కోనేరు శ్రీధర్ వీధి,గురునానక్ కాలని,ఆంధ్రా లయోలా కళాశాల రోడ్డులను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర భంగా



ఆయన మాట్లాడుతూ నగరంలో డీ సిల్టింగ్ పనులు ఖచ్చితంగా జరుగుతూ ఉండాలని, వర్షాలు పడినప్పుడు నగరంలో రోడ్లపైన ఎక్కడా నీటి నిల్వలు ఉండకుండా సైడ్ కాల్వల్లోకి నీటి ప్రవాహం వెళ్ళేందుకు వీలుగా ఉండాలని, దానికి ముందస్తుగా మైనర్,మీడియం,మేజర్ డ్రైన్‌లలో డీసిల్టింగ్ పనులు చేస్తూ,నిరంతరం కాల్వలో పూడికలు తీస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రాకముందే డీ సిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేస్తే,వర్షాకాలంలో రోడ్లపైన నీటి నిల్వలు వంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. అనంతరం కోనేరు శ్రీధర్ వీధిలో ఉన్న లక్ష్మీపతి అపా ఒపరావు సరోజినీ నగరపాలక సంస్థ పార్క్‌ను సందర్శించారు. నిర్వహణలో ఎటువంటి జాప్యం ఉండరాదని, ఇంజనీరింగ్,ప్రజారోగ్యం, ఉద్యానవన సిబ్బంది సమన్వయంగా ఉంటూ పార్క్ నిర్వహణ సక్రమంగా చేయాలని అధికారులను ఆదేశించారు. లయోలా కళాశాల రోడ్డు వద్ద గల మూడు బిన్నుల సెంటర్ లొకేషన్‌ను సందర్శించారు. మూడు రంగుల చెత్త బుట్టలను అక్కడ పెట్టి ప్రజలకు అర్థమయ్యే రీతిలో వ్యర్థాలు వేరు చేసే ప్రక్రియ,నిర్వహణ సెంటర్‌ను సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమీషనర్ ప్రభుదాస్,చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఇన్చార్జి చఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్,ప్రాజెక్ట్ ఆఫీసర్(యుసిడి) పి.సత్యన్నారాయణ, పి.సత్యకుమారి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,సామ్రాజ్యం, శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపీనాయక్,అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన జ్యోతిపై శిక్షణ

**నందిగామ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** విద్యా రంగంలో నాణ్యత పెంచటానికి ప్రభుత్వం అంగన్వాడీ ప్రీ స్కూల్ విద్యార్థులకు విద్యార్థులకు సులభతరంగా బోధించేందుకు



ప్రభుత్వం సపోర్టింగ్ ఆంధ్రస్ లెర్నింగ్ ట్రాన్స్ఫ్ర్మేషన్ పథకంపై నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో నంది గామ మండల అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షనా తరగతులు గురువారం ముగిశాయి. మొదటి విడత శిక్షనా తరగతుల్లో డిస్టిక్ రిసోర్స్ పర్సన్స్ డివి రాజ్యలక్ష్మి షేక్ మౌలాలి, వెంకటరావమ్మ శ్రీదేవి లు విజ్ఞాన జ్యోతి కోర్సులు అంగన్వాడీ వర్కర్స్ అంగనవాడి టీచర్లగా ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేస్తారని వారు ప్రీ స్కూల్ విద్యార్థులు సులభతరంగా బోధన అభ్యాసన చేసేందుకు సంబంధించి విద్యార్థులు అభ్యాసన ఫలితాలు బోధనా పద్ధతులను మెరుగుపరచడం, విద్యా రంగంలో నాణ్యత పెంచడం, పునాది అభ్యాసనాన్ని బలోపేతం చేయటం, ఉపాధ్యాయ విద్యార్థుల మధ్య సంబంధాలను మెరుగుపరచడం సంస్థాగత సామర్థ్యాలను సామాజిక సంస్థల ప్రమేయాన్ని బలోపేతం చేయటం విద్యార్థులకు బొమ్మల ద్వారా బోధన సులభముగా అర్థమయ్యే విధంగా పను అంశాలపై శిక్షనా తరగతులు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా తరగతులు నందిగామ మండల అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామచంద్రాపురం కొత్త చెరువులో అక్రమ గ్రావెల్ రవాణా

**పట్టించుకోని ఇరిగేషన్ రెవెన్యూ, పోలీసు శాఖ**

**ఎ కొండూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం రామచంద్రాపురం కొత్త చెరువు నుండి గత 4రోజులు అక్రమ గ్రావెల్ రవాణా జరుగుతున్నా సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ పోలీస్ శాఖల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉదాసీన వైఖరి అవలంభిస్తుండటం పట్ల రామచంద్రాపురం కోమటికుంట లక్ష్మీపురం గ్రామాల ప్రజలు రైతులు విమర్శిస్తున్నారు. ఈ రామచంద్రాపురం కొత్త చెరువు నుండి అక్రమంగా రవాణా చేస్తున్న మట్టి ట్రాక్టర్ రూ.700లకు విక్రయించి అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో కొందరు వ్యాపారంగా మార్చుకుని ఈ దందాను కొనసాగిస్తున్నారు. పలువురు ప్రజలు రైతులు ఆరోపించారు. ఈ కొత్త చెరువు నుండి మైలవరం మండలం బాడవ ఎన్‌హెచ్-30 టోల్‌ప్లాజా సమీపంలో కొందరికి ఈ అక్రమ మట్టి రవాణాకు సన్నాహాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఈ అక్రమ మట్టి దందా రవాణాను వెంటనే అరికట్టాలని ప్రజలు రైతులు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

# జీవవైవిధ్య సదస్సులో అందరూ భాగస్వామ్యం కావాలి

### బయోడైవర్సిటీ సదస్సులో మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** దెబ్బ తింటోన్న జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా కన్హ శాంతి వనంలో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు ఏర్పాటు చేసిన నేషనల్ బయోడైవర్సటీ కాన్ఫరెన్స్ 2025 పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మన పర్యావరణం, నీరు, భూ పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు.. జీవవైవిధ్య పరిరక్షణ దిశగా సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా ఈ జీవవైవిధ్య సదస్సు ఉపయోగపడుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.విద్యార్థులు, యువ సైంటిస్టులకు జీవ వైవిధ్యం కోసం పని చేయాలన్నారు. తెలంగాణ ఎన్నో విధాలైన సహజమైె ప్రాంతాలకు నెలవు, అడవులు, పచ్చిక బయళ్ళు, తడి నేలలు, వృక్షాలు, జంతువులు మన ప్రాంతంలో ఉన్నాయని జీవవైవిధ్యం పర్యావరణ సమతుల్యతను సంరక్షించడం మన బాధ్యత అని అందుకోసం సమిష్టి కృషి జరగాలని ఆకాంక్షించారు.

పపంచవ్యాప్తంగా మానవ తప్పిదం వల్ల మొక్కలు, జంతువులు అంతరించిపోయే దశలో ఉన్నాయన్న ఆమె వాటి సంరక్షణ కోసం మానవులుగా మనమే కృషి చేయాలన్నారు.ఒక జాతి అంతరిస్తే దానిలోని జన్యుసంపద అంతరించినట్లే అన్న మంత్రి జీవ వైవిధ్యపు నిజమైన విలువంతా జన్యువుల్లో నిక్షిప్తమై ఉంటుందన్నారు. మన దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు, చాలా సంస్థలు జీవవైవిధ్య సంరక్షణ లోనూ దాన్ని ప్రతిభావవంతంగా వినియోగించడం లోనూ నిమగ్నమై ఉన్నాయన్నారు.

**మన మన్యంకొండ విడియో ఆవిష్కరణ**

మహబూబ్ నగర్ జిల్లాలో కొలువై ఉన్న మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి జాతర విశిష్టత, ప్రాశస్త్యత గురించి ప్రత్యేకంగా రూపకల్పన చేసిన వీడియోను తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సమాజం ఉత్తమ విలువలతో ముందుకు సాగాలంటే, ధార్మిక చింతన కలిగించే ఇటువంటి చిత్రాలు మరిన్ని రావాల్సి న అవసరం ఉందని ఆమె ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా దేవాదాయ శాఖ మన తెలంగాణ ఆలయాల అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టిందని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.అందుకు ఆలయాల సందర్శనకు పెరుగుతున్న జన సందోహమే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.మన తెలంగాణ రాష్ట్రంలో ఎన్నెన్నో అద్భుతమైన ఆలయాలు ఉన్నాయని, వాటి వైభవోపేతమైన చరిత్రను, స్థల పురాణాన్ని, ప్రజల విశ్వాసాలను అందరికీ చేరేలాగా ప్రచారం జరగాలని అందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. అనంతరం దర్శకుడు అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ.. ఎంతో బిజీగా ఉన్నా ఈ వీడియో ఆవిష్కరణకి సమయం ఇచ్చి ప్రోత్సహించినందుకు ఆయన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.దేవాలయాలపై ఎంతో శ్రమకోర్చి వీడియో తీసిని శ్రీధర్ ను మంత్రి సురేఖ ప్రత్యేకంగా అభినందించి ఆయనను శాలువాతో సత్కరించారు.

# తెలంగాణలో హత్యారాజకీయాలకు తావు లేదు

### అవినీతిపై పోరాడే వారికి రక్షణ కల్పిస్తాం
### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తెలంగాణలో హత్య రాజకీయాలకు తావు లేదని, అవినీతి మీద పోరాడే వారికి రక్షణ కల్పిస్తాం అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజలింగమూర్తి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిఆర్ఎస్ పదేండ్లలో హత్యా రాజకీయాన్ని పెంచి పోషించిందని, బిఆర్ఎస్ దోపిడీని ప్రశ్నించిన రాజలింగాన్ని హత్య చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్‌తో పాటు ఐదుగురుపై సామాజిక కార్యకర్త రాజలింగం కోర్టులో కేసు వేశాడన్నారు. ఈ నేపథ్యంలో గండ్ర వెంకట రమణారెడ్డి హత్య చే యించాడన్నారు. కాళేశ్వరంలో కెసిఆర్‌కు దోషిగా శిక్ష పడుతుందని కెసిఆర్, కెటిఆర్‌లు హత్య చేయించారని రాజ లింగమూర్తి కూతురు, భార్య చెప్తుందన్నారు. అడ్వకేట్ వామనరావు భార్యభర్తల హత్యకు ఎవరు కారణమో అందరికి తెలుసునన్నారు. వరంగల్‌లో ఎంపిడిఓను హత్య బిఆర్ఎస్ వాళ్ళు చేశారని అప్పటి సిపి రంగనాథ్ చెప్పారన్నారు. కొడంగల్‌లో సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌పై కూడా సురేష్ అనే రౌడీ షీటర్ దాడి చేశారన్నారు. తెలంగాణలో అభివృద్ధి జరగొద్దు అనేది బిఆర్ఎస్ లక్ష్యం అన్నారు. కెసిఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందని అంటుండని, హత్య రాజకీయాలు చేయడమేనా మీ గ్రాఫ్ కెసిఆర్? కెసిఆర్ కిరాయి హత్యలు చేయించడమే తప్ప కెసిఆర్‌తో ఏమి కాదు అన్నారు. 15నెలల నుండి ఫాంహౌస్ నుండి ఎప్పుడైనా బయటకి వచ్చిండా? అన్నారు. రాజలింగమూర్తి హత్యను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరుతున్నామన్నారు. హత్యలో కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు, గండ్ర వెంకటరమణ రెడ్డి పాత్ర ఉందన్నారు. సిబిసిఐడి విచారణ చేసి 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి వెంటనే శిక్ష వేయాలన్నారు. హత్యను సిఎం రేవంత్‌రెడ్డి కూడా సీరియస్‌గా తీసుకుంటాడని అన్నారు. లగచర్లలో కూడా కలెక్టర్‌ను చంపాలని చూసిండని, తెలంగాణను దోచుకొని తిని ఎదురు తిరిగిన వాళ్ళను చంపేస్తారా? పాపం తగిలి పోతారన్నారు.

# విద్యార్థి పోరాటాలు మార్గదర్శకం కావాలి

### 50 యేళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమం ప్రస్థానం సదస్సులో ప్రొ.హరగోపాల్




కార్యక్రమంలో పాల్గొన్న ప్రొ. హరగోపాల్, ప్రొ. జగన్ సింగ్ తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఒక అధ్యాపకుడిగా కొనసాగుతూనే రాడికల్స్ విద్యార్థుల నుంచి ఎంతో నేర్చుకున్నానని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రస్తుత సంక్షోభ కాలంలో మనుషులు మిగలడమే ఒక సవాలుగా మారిందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థులు 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం పై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. మొదటి రోజు సభలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాడికల్స్ విద్యార్థులు తన విద్యార్థులని చెప్పేందుకు చాలా గర్వంగా ఉందన్నారు. అధ్యాపక జీవితంలో మధురమైన క్షణాలు ఉన్నాయంటే అవి విద్యార్థులు చేసిన పోరాటాలన్నారు. వాళ్ళంతా వివిధ అంశాలపట్ల కూడా అపరిమిత జ్ఞానాన్ని కలిగిగి ఉండేవారన్నారు.

త్యాగాలు చేసేవాళ్ళు భవిష్యత్తు తరంకోసమే చేస్తారన్నారు. భగత్‌సింగ్ జ్ఞాపకాలను పదిలం చేస్తూ ఆయన మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్‌సింగ్ గ్రంథా లయాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో 70, 80ల కాలం నాటి విద్యార్థి పోరాటాలు సమాజానికి మార్గదర్శకం కావాలని అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ జగన్ సింగ్ మాట్లాడుతూ నేడు దేశంలోని బి జె పి పాలనలో ప్రజలకు మేలు జరగడం లేదని, ఫలితంగా దోపిడీ హింస దౌర్జన్యాలు పెరుగుతున్నాయన్నారు. ఇవి నిర్మూలించాలంటే సమాజంలో విప్లవం రావాల్సి న అవసరంతో పాటు ఐక్య ఉద్యమాలు అవసరమన్నారు. 1920లో దేశంలో ఎటువంటి ఆర్థిక సంక్షోభం ఉండేదో ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొందని, నాడు భగత్ సింగ్ విప్లవోద్యమాలను నిర్మించి దేశాన్ని సమర్ధం చేశారని, అలాగే రాడికల్ స్టూడెంట్స్ కూడా ఉద్యమాలు నిర్మించి ప్రజలను జాగృతం చేశారన్నారు. నాటి విద్యార్థి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని నేడు వాటిని ముందుకు తీసుకుపోవాలని సూరపనేని జనార్ధన్ సోదరుడు మోహన్ రావు అన్నారు. ఆర్ఎస్‌యు విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికే నేను మార్క్సిజాన్ని చదువుకున్నానని ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. 80వ దశకంలో తరగతి గదిలో విద్యార్థులకు ప్రొఫెసర్లకు మధ్య చర్చ జరిగేదని, ఇప్పుడు అలాంటి వాతావరణం లేదని అన్నారు. నాటి విద్యార్థులు విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు నిరంతరం కృషి చేసేవారన్నారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదన్నారు. విలువలు మృగ్యమైన ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలను నిలబెట్టడం ఎలా అనేది మన ముందున్న ప్రశ్న అని అన్నారు. అంతకు ముందు అమరవీరుల జెండాను పులి అంజయ్య మాతృమూర్తి సోమ నరసమ్మ, స్నూపాన్ని ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్) సహచరి పద్మ ఆవిష్కరించారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం ఎదుట విద్యార్థి అమరులకు పూర్వ విద్యార్థులు, పలువురు ప్రజా సంఘాల నాయకులు నివాళులఉ అర్పించారు. విద్యార్థి అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం, విప్లవ విద్యార్థి అమరులకు జోహార్లు, జోహార్ అంటూ విప్లవగేయాలు, నినాదాలతో సుందరయ్య విజ్ఞానకేంద్రం మారుమ్రోగింది.

# పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

**-నగర కమిషనరు పులి శ్రీనివాసులు**

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 20 ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే పనులను ప్రాధాన్యత క్రమంలో నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేసేలా ఏఈలు ప్రత్యేక దృష్టి సారించాలని నగర




కమిషనర్ పులి శ్రీని వాసులు ఐఏఎస్ స్పష్టం చేశారు. గురువారం కమీషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా సంగడిగుంట, ఎల్ఎల ఆర్, పాత గుంటూరు, గణేష్ నగర్ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణ సమయాల్లోనే స్థానిక వార్డ్ సచివాలయ ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపాలను గుర్తిస్తే సంబందిత కార్యదర్శులు, ఏఈలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎల్ఎల్ఆర్ ని పరిశీలించి, త్రాగునీటి సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని, రిజర్వాయర్లలో త్రాగునీటి సరఫరా చేయు సమయంలో క్లోరిన్ తనిఖీలు చేయాలన్నారు. త్రాగు నీరు సరఫరా సమయంలో వార్డుల్లో పర్యటిస్తూ నీటి నాణ్యతను పరిశీలించాలని, ఎక్కడైనా పైపు లైన్ల లీకులు గమనిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేసి లీకులకు వెంటనే మరమ్మతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు ప్రాంతాల్లో పారిశుద్యం, ఖాళీ స్తలాల సమస్యలపై ప్రజల నుండి అందిన ఫిర్యాదుల మేరకు ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎన్ వి ఎస్ సుబ్బారావు చౌదరి గుంటూరు ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివి

**- జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ**

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 20 ప్రభాతవార్త :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి సూపరింటెండెంట్ గా, గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గా, ఒక సర్జన్ గా ఎన్వీ సుబ్బారావు చౌదరి గుంటూరు ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివి అని జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ పేర్కొన్నారు. గురువారం ఎన్ వి ఎస్ చౌదరి సంస్మరణ సభను స్థానిక సుశృతా హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్



ఎన్ వి ఎస్ చౌదరి సర్జన్ గా, ఒక ఉపాధ్యాయునిగా అందించిన సేవలు మరువలేనివి అని ఆయన ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఎంతో మంది సర్జన్స్ కు ఆయన విద్య నేర్పడానికి కళాశాల, ఆసుపత్రి అభివృద్ధికి ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళాయి అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ ఆయన ఒక సర్జన్ గా స్ఫూర్తిని ఇచ్చిన వారిలో ఎన్ వి ఎస్ ఒకరు అని వారు తుది శ్వాస విడిచినా వారి ఆత్మ ఈ పరిసరాల్లోనే తిరుగుతూ ఉంటుంది అని అలాంటి వ్యక్తి ఆత్మకు శాంతి కాకుండా మరో జన్మ తీసుకొని వారిలాంటి వారు ఇంకొకరు ఈ సమాజానికి అవసరం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోడిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమా జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ సుధాకర్, ఎన్ వి ఎస్ కుమారులు డాక్టర్ ఎన్ వి ఎస్ ప్రసాద్ (యు ఎస్ ఏ) వి ఎస్ ప్రసాద్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు

21-02pg10exHMNWJQE.qxd:21-02pg10exHMNWJQE.qxd 01/01/01 8:29 AM Page 1



### ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో..

# హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ విజయం

## 2-1 తేడాతో రాజస్థాన్ యునైటెడ్ ఓటమి



**ఢిల్లీ:** ఐ-లీగ్ జాతీయ ఫుట్బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్బాల్ క్లబ్ (ఎఫ్సీ) జట్టు ఐదో విజయం నమోదు చేసింది. జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ 2-1 గోల్స్ తేడాతో రాజస్తాన్ యునైటెడ్ ఎఫ్సీ జట్టును ఓడించింది. 10 మ్యాచ్‌ల తర్వాత రాజస్తాన్ జట్టుకు ఇది తొలి ఓటమి కావడం గమనార్హం. శ్రీనిధి జట్టు తరఫున ఏంజెల్ ఒరెలియన్ (43వ నిమిషంలో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (73వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. రాజస్తాన్ యునైటెడ్ జట్టుకు మైకోల్ కబ్రెరా (75వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఈనెల 25న జరిగే తదుపరి మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్‌తో హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ జట్టు తలపడుతుంది. 12 జట్లు పోటీపడుతున్న ఈ ఐ-లీగ్‌లో 15 మ్యాచ్ పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 19 పాయింట్లతో ఎనిమిదోస్థానంలో ఉంది.

### జాతీయ పారా అథ్లెట్‌లో..

# తెలంగాణ అమ్మాయికి స్వర్ణం




**న్యూఢిల్లీ:** జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. చెన్నైలో జరుగుతున్న ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి, అంతర్జాతీయ పారాథ్లెట్ జివాంజి దీప్తి 400 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది.

దీప్తి అందరికంటే వేగంగా, అందరి కంటే ముందుగా 57.82 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. హర్యానాకు చెందిన పూజా 1:08.21 సెకెన్లలో గమ్యాన్ని చేరుకుని రజతం సొంతం చేసుకోగా, హర్యానాకే చెందిన భువి అగర్వాల్ కాంస్యం దక్కించుకుంది.





### మహిళల ప్రీమియర్ లీగ్‌లో..

# ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విక్టరీ

## 7 వికెట్ల తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టీ20 టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. అనాబెల్ సదర్లాండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడం వల్ల ఈ విజయం సాధ్యమైంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఢిల్లీ ప్లేయర్లలో ఓపెనర్ కిరణ్ నవగిరె (27 బంతుల్లో 51; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభం అందివ్వగా, శ్వేత సెహ్రావత్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్) హెన్రీ (15 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో అనాబెల్ 2 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 19.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. మెగ్ లానింగ్ (49 బంతుల్లో 69; 12 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అనాబెల్ (41 నాటౌట్; 4 ఫోర్లు), మరిజాన్ కాప్ (29 నాటౌట్; 4 ఫోర్లు), షఫాలీ వర్మ (26; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేశారు. యూపీ వారియర్స్ బౌలర్లలో సోఫియా, దీప్తి శర్మ, గ్రేస్ హ్యారిస్ తలా ఒక వికెట్ తీశారు.

# ఛాంపియన్స్ ట్రోఫీలో డేంజరస్ టీమ్

### టీమిండియాకు టెర్రర్

### మూడో మ్యాచ్‌కు ఇబ్బందులు





**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు ఇబ్బందులు మూడో మ్యాచ్ నుంచి ఎదురుకానున్నాయి. టోర్నీ మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టుతో తలపడేందుకు టీమిండియా సిద్ధమైంది. ఐసీసీ ఈవెంట్లలో భారత జట్టుకు కివీస్ పెద్ద తలనొప్పిలా మారింది. ఎల్లప్పుడూ టీమిండియాపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ఈసారి భారత్, న్యూజిలాండ్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ నెల 23 ఆదివారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రెండు జట్లు తలపడనున్నాయి. గత ఎడిషన్‌లో, భారత జట్టు తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. కానీ, చివరికి పాకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. మరోవైపు, న్యూజిలాండ్ తమ గ్రూప్‌లో చివరి స్థానంలో నిలిచింది. మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. అయితే, రాబోయే ఎడిషన్‌లో టోర్నమెంట్ గెలవడానికి భారత్, న్యూజిలాండ్ రెండూ ఫేవరెట్‌లలో ఉన్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి భారతదేశం సిద్ధమవుతుండగా, న్యూజిలాండ్‌ను చూసి టీం ఇండియా కాస్తంత భయపడుతోంది. ఐసీసీ ఏ ఈవెంట్‌లోనైనా నాకౌట్ మ్యాచ్‌లలో న్యూజిలాండ్ ఎల్లప్పుడూ భారతదేశాన్ని ఇబ్బంది పెడుతుంది. 2000 సంవత్సరంలో, కివీస్ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌ను ఓడించింది. సెమీఫైనల్స్ లో 2019 ప్రపంచ కప్ నుంచి భారత జట్టును ఓడించింది. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన ముక్కోణపు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ 78 పరుగుల భారీ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. తదుపరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 305 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో సులభంగా ఓడించింది. చివరికి పాకిస్తాన్‌పై ఫైనల్ మ్యాచ్‌ను కూడా గెలుచుకుంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీకి ముందే న్యూజిలాండ్ బ్యాటింగ్ లైనప్ ఫామ్‌ను కనుగొంది. ట్రైసిరీస్‌లో, అనేక మంది కివీస్ బ్యాట్స్‌మెన్స్ ఫామ్‌ను కనుగొన్నారు. ఐసీసీ ఈవెంట్‌లోకి వెళ్లే ముందు పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. ఈ టోర్నమెంట్‌లో కేన్ విలియమ్సన్ మూడు ఇన్నింగ్స్‌లలో 112.50 సగటుతో 225 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్ (మూడు మ్యాచ్‌ల్లో 154 పరుగులు), డారిల్ మిచెల్ (మూడు మ్యాచ్‌ల్లో 148 పరుగులు), డెవాన్ కాన్వే (రెండు మ్యాచ్‌ల్లో 145 పరుగులు) వంటి బ్యాట్స్‌మెన్ కూడా పరుగుల స్కోరు చేసిన వారిలో ఉన్నారు.

### ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో..

# బోపన్న జోడీ శుభారంభం



**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-నునో బోర్జెస్ (పోర్చుగల్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. దోహాలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బోర్జెస్ ద్వయం 7-6 (7/2), 7-6 (7/4)తో రెండో సీడ్ సిమోన్ బొలెలీ-ఆండ్రియా వావాసోరి (ఇటలీ) జంటను బోల్తా కొట్టించింది. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఏడు ఏస్లు సంధించింది. మ్యాచ్ మొత్తంలో రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్‌లు అనివార్యమయ్యాయి. టైబ్రేక్స్‌లో బోపన్న-బోర్జెస్ పైచేయి సాధించి విజయాన్ని అందుకోవడంతో పాటు, క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నారు.

ఆట





### హాకీ ప్రొ లీగ్‌లో..

### భారత్ పురుషుల జట్టు

# సంచలనం

**వరల్డ్ ఛాంపియన్ జర్మనీపై 1-0తో గెలుపు**

**స్పెయిన్ చేతిలో భారత్ మహిళల టీం ఓటమి**

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు సంచలనం సృష్టించింది. ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో భువనేశ్వర్‌లో జరిగిన రెండో రౌండ్ రెండో మ్యాచ్‌లో టీమిండియా 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. ఆట నాలుగో నిమిషంలో గుర్జంత్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ వచ్చిన భారత్ చివరకు విజయాన్ని ఖరారు చేసుకుంది.

అంతకు ముందు జర్మనీతో జరిగిన రెండో రౌండ్ తొలి మ్యాచ్‌లో భారత్ 1-4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. మరోవైపు భారత మహిళల జట్టుకు మరో ఓటమి ఎదురైంది. స్పెయిన్ జట్టుతో జరిగిన రెండో రౌండ్ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0-1తో ఓడిపోయింది.

స్పెయిన్ తరఫున సెగూ మార్టా (49వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది.

# పిఎన్‌బి వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దాదాపు ఐదేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును తగ్గించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు బ్యాంకులు కూడా రుణ రేట్లను సవరిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను తగ్గించగా, ఇప్పుడు మరో ప్రభుత్వ రంగ పిఎన్‌జి కూడా అదే నిర్ణయం తీసుకుంది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు గురువారం ప్రకటించింది. కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు తాజా ప్రకటనలో వెల్లడించింది. గృహరుణాలతో పాటు, కారు ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుంది. తాజా సవరణతో పిఎన్‌బిలో గృహరుణాల ప్రారంభ రేటు 8.15 శాతానికి దిగొచ్చింది. దీంతో రూ.లక్ష రుణానికి ఇఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇక ఆటోమొబైల్ రుణాలపై వడ్డీ రేటు 8.50 శాతం నుంచి ప్రారంభం కానుంది. విద్యా రుణాలపై కనిష్ట వడ్డీని 7.85 శాతానికి తగ్గించినట్లు పిఎన్‌బి తెలిపింది. అటు వ్యక్తిగత రుణాలపై సవరించిన వడ్డీరేటు 11.25 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 7న రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రేపో రేటును 6.50శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు 6.25 శాతానికి తగ్గించిన విషయం విదితమే. దీంతో పలు బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. గత వారం ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేట్, రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను ఎస్‌బిఐ 25బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.




# చదువు మానేయాలన్న నిర్ణయం బాధించింది: బిల్ గేట్స్



వాణిజ్యం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాప కుడు బిల్ గేట్స్ (బిల్ గేట్స్) తన కాలేజీ జీవితం గురించి పలు ఆసక్తికర విష యాలు. హార్డ్ యూనివర్సిటీలో చదువు మానేయాలనే నిర్ణయం తీసుకున్నప్పుడు చాలా బాధపడినట్లు చెప్పా రు. సోర్స్ కోడ్ మై బిగినింగ్స్ పేరుతో తాను తీసుకొచ్చిన పుస్తకంలో ఆసక్తికర విషయా లన్నీ తాజాగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో పంచుకున్నారు. కళాశాల రోజులు చాలా ఆహ్లాదకరంగా గడిచాయని, ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. హార్వర్డ్‌లో బాగా ఎంజాయ్ చేశాను. మనస్తత్వ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చరిత్రకు సంబంధించిన తరగతులను ఆస్వాదించేవాడిని. తెలివైన వాళ్లతో సమయం గడపడం నాకు నచ్చేది. ఆసక్తికరమైన విషయాలపై రాత్రిళ్లు చర్చించేవాళ్లం అని గేట్స్ అన్నారు. 1975లో సాఫ్ట్‌వేర్ కంపెనీ తొలి సీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు హార్వర్డ్ యూని వర్సిటీలో చదువు మానేయాల్సి వచ్చిందని బిల్ గేట్స్ ఏర్పాటు చేసింది. ఆ నిర్ణయం తీసుకోవడం చాలా బాధను కలిగించింది. డిగ్రీ పూర్తిచేసేందుకు హార్వర్డ్‌కు తిరిగి వెళ్లాలనిపించింది. అయితే వచ్చిన అందిపుచ్చు కొనేందుకు తాను, తన స్నేహితుడు అయిన పాల్అలెన్ను, కళాశాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని గేట్స్ చెప్పారు. ఆసమయంలో గేట్స్, అలెన్ ఇద్దరూ కంప్యూటర్ల కోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను సృష్టించగలిగితే కొత్త పరిశ్రమలో ముందంజలో ఉండగలమని భావించారు. అలా రెండేళ్లు మైక్రోసాఫ్ట్‌ను నడుపుతూనే తన చదువును బ్యాలెన్స్ కోసం ప్రయత్నించారు. తన చదువు పూర్తి చేయడానికి మరో స్నేహితుడు. మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామర్ అయిన రిక్ వీలాండ్ సాయం తీసుకోవాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. ఇక చివరకు చదువు మానే యాల్సి వచ్చిందని చెప్పారు. ఇదిలా ఉంటే, సోర్స్ కోడ్ పుస్తకాన్ని మూడు భాగాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్ 1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్ ప్రయాణం, మెలిండా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు చోటు కల్పించలేదు. భవిష్యత్తులో విడు దల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశం ఉంది. 2000 సంవత్సరం వరకు మైక్రోసాఫ్ట్ సిఇఒగా గేట్స్ విధులు నిర్వర్తించారు. తన పదవీకాలంలో కంప్యూటర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరిగా నిలిచారు.




**ముంబై, ఫిబ్రవరి 20:** గూగుల్‌కు చెందిన పేమెంట్ యాప్ గూగుల్ పే (గూగుల్ పే) విద్యుత్, గ్యాస్ వంటి బిల్ పేమెంట్లపైనా ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటివరకు ఈతరహా లావాదేవీలపై ఎలాంటి ఫీజూ విధించేది కాదు. ఇక నుంచి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా

# గూగుల్ పేలోనూ ఇక ఛార్జీల మోత!

లావాదేవీలపై కన్వీనియన్స్ ఫీజు రూపంలో స్వల్ప మొత్తంలో రుసుము వసూలుచేసేందుకు సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవు. ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామైన పేటీఎం, ఫోన్‌పేలు ఇప్పటికే ఈ తరహా ఫీజును వసూలు చేస్తుండగా, ఇన్నాళ్లూ ఉచితంగా అందించిన గూగుల్ పే సైతం ఇకనుంచి వాటి బాటలోనే నడవనుంది. గూగుల్‌పే మొబైల్ రీఛార్జీలపై రూ.3 కన్వీనియన్స్ ఫీజు రూపంలో వసూలు చేస్తోంది. ఇకపై క్రెడిట్, డెబిట్ కార్డు చేసే విద్యుత్, గ్యాస్ బిల్ పేమెంట్లపై 0.5 శాతం నుంచి 1 శాతం వరకు ఛార్జీలు విధిస్తున్నట్లు సూచిస్తున్నాయి. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ యూజర్‌కు ఈ అనుభవం ఎదురైనట్లు ఓ ఆంగ్లమీడియా సంస్థ ఉదాహరణను ఉటంకించింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్వియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పేమెంట్ వసూలు చేసినట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. ఈ పేమెంట్ ప్లాట్‌ఫామ్ ఇప్పటికే ఛార్జీల వసూలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ రుసుములు అందరికీ వర్తిస్తాయా? లేదా? అనే విషయం ఇంకా తెలియలేదు. భవిష్యత్‌లో అందరినుంచీ ఈ ఫీజు వసూలు చేసే అవకాశం ఉందని టెక్‌లు ఉన్నాయి. అయితే ఒప్పందం గూగుల్ పే ఎక్కడా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. పే గూగుల్ వెబ్‌సైట్ ప్రకారం.. కార్డ్ పేమెంట్ ప్రాసెసింగ్ ఖర్చుల్ని కవర్ చేయడానికి ఈ రుసుము సాయపడుతుందని, ఇప్పటికే అనేక ఫిన్టెక్, క్విక్కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించాయి. ఇదే ట్రెండ్‌ను ఇతర సంస్థలూ అనుసరించే అవకాశం ఉందని, తమ ఆదాయాలు పెంచుకోవడానికి ఈ మొత్తాలు ఉపయోగపడతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతి కూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు, రోజంతా అదే ఒరవడి కొనసాగించాయి. దీంతో వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిసాయి. అమెరికా అనుసరిస్తున్న టారిఫ్ పాలసీలు, దానివల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మన మార్కెట్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఐటిసి, మారుతి సుజుకి షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. చివరికి సెన్సెక్స్ 203.22 పాయింట్లు క్షీణించి 75,735.96 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 19.75 పాయింట్లు నష్టపోయి 22,913.15 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.65గాఉంది. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, హెచ్‌సి ఎల్ టెక్నాలజీస్, ఐటిసి వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్‌టిపిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.16 డాలర్ల వద్ద కొనసాగగా, బంగా రం ఔన్సు 2971 డాలర్ల వద్ద ట్రేడ యింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps